
జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


భారత్ పొరుగు దేశాలకు పశ్చిమాసియా ఉద్రిక్తతలు

అయినా.. మోదీ మౌనమే వహిస్తారా? 05

ఖమేనీ మృతికి భారత్ సంతాపం


సంపుటి 28, సంచిక: 252 | శుక్రవారం | 06-03-2026 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00


# ప్రమాద ఘంటికలు





- ట్రంప్–జియోనిస్టుల రక్తతర్పణానికి ఇరాన్ పిలుపు
- కుర్దిస్టులపై ఇరాన్... హెజ్బొల్లాపై ఐడిఎఫ్ భారీ దాడులు
- ధ్వంసమవుతున్న ఇరాన్,ఇజ్రాయెల్
- పురాతన భవనాలు, మౌలిక సదుపాయాలు నేలమట్టం
- అజర్ బైజాన్‌లో ఇరాన్ డ్రోన్ల విధ్వంసం
- పశ్చిమాసియాలో ఆర్థిక క్షేత్రాల ధ్వంసం
- ఇరాన్‌పై 5,000 బాంబు దాడులు : ఐడిఎఫ్
- యుద్ధంలోకి నార్వే,ఆస్ట్రేలియా
- ఇరాన్ గగనతలాన్ని స్వాధీనం చేసుకుంటాం : యుఎస్
- ఇరాన్‌లో 1,332 కు చేరిన మృతులసంఖ్య
- సైప్రస్‌లో భయాందోళన

**దుబాయ్:** ఇరాన్‌తో అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఇరాన్ కూడా దీటుగా స్పందిస్తూ ఇజ్రాయెల్‌ను వణికిస్తోంది. హిందూ మహాసముద్రంలో యుద్ధ నౌకను ముంచివేసినందుకు అమెరికా–జియోనిస్టులకు తీవ్ర పశ్చాత్తాపం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ అత్యున్నత షియా మత గురువు అయెతొల్లా అబ్దొల్లా జావది అమోలీ ప్రభుత్వ టెలివిజన్‌లో మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్–జియోనిస్టుల రక్తతర్పణానికి పిలుపు ఇచ్చారు. పశ్చిమాసియాలో గురువారం ఆరో రోజు యుద్ధంలో ఇజ్రాయెల్–అమెరికాలపై 19వ విడత భారీస్థాయి దాడులు చేసినట్లు చెప్పింది. దేశంలోకి క్షిపణులు,డ్రోన్లు వరదలా వచ్చి పడుతున్నాయంటూ ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేసింది. ఐడిఎఫ్ కూడా ఒక ప్రకటన చేస్తూ టెహ్రాన్‌పై భీకరదాడులతో విరుచుకుపడ్డామని పేర్కొంది. లెబనాన్‌లో ఇరాన్ మద్దతు ఉన్న 80 హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తుండగా, కుర్దిస్టు ప్రాంతాలపై ఇరాన్ దాడులు ప్రారంభించింది. ఇజ్రాయెల్, అరబ్ దేశాలలో అమెరికా స్థావరాలపై దాడులతోపాటు ఇరాన్‌లో ఇస్లామిక్ రిపబ్లిక్ షియా పాలనకు వ్యతిరేకంగా ఉన్న కుర్దిస్టులను మట్టుపెడతామని రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ఇరాక్‌తోపాటు ఇరాన్‌లో అంతర్గతంగా ఉన్న కుర్దిస్టు ప్రాంతాలపై దాడులు చేస్తోంది. ఇరాన్ వ్యాప్తంగా విధ్వంసం సృష్టించడమే లక్ష్యంగా అమెరికా–ఇజ్రాయెల్ దాడులు కొనసాగాయి. అనేక నగరాలు, ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని బాంబుల వర్షం కురిస్తున్నాయి. ఇరాన్‌లోని ట్రిజ్, టెహ్రాన్, క్వామ్, ఇస్ఫహాన్, షిరాజ్, తరువాయి 2లో

## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్రకు బదిలీ

రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ

బెంగాల్ గవర్నర్ సివి ఆనంద్ బోస్ రాజీనామా

**న్యూఢిల్లీ :** తెలంగాణ నూతన గవర్నర్‌గా ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా వ్యవహరిస్తోన్న శివప్రతాప్ శుక్లా నియమితులయ్యారు. ప్రస్తుత తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా, తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిని పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమించారు. ఈ మేరకు రాష్ట్రపతి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. నాగాలాండ్ గవర్నర్‌గా నందకిశోర్ యాదవ్, బిహార్ గవర్నర్‌గా విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ తరువాయి 2లో

ఇరాన్ యుద్ధ నౌకపై

## యుఎస్ టార్పిడో దాడికి సిపిఐ ఖండన

- హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని సైనిక ఘర్షణ, యుద్ధ వేదికగా మార్చొద్దని విజ్ఞప్తి
- భారత ప్రభుత్వం సూత్రప్రాయమైన, స్వతంత్ర వైఖరిని అవలంభించాలని హితవు

**న్యూఢిల్లీ :** భారతదేశం,శ్రీలంక తీరాలకు దగ్గరగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ నావికాదళ నౌక 'ఐరిస్ దేనా'పై దాడికి పాల్పడి వందకు మందికి పైగా ఇరానియన్ నావికుల మరణానికి కారణమవడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. గురువారం సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం తరపున సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఇక్కడ తరువాయి 12లో

బిహార్‌లో నాటకీయ పరిణామం

## రాజ్యసభకు నితీశ్

త్వరలో బిహార్‌కు బిజెపి ముఖ్యమంత్రి !

రేస్‌లో డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా



**పాట్నా :** బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ గురువారం రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇద్దరు నాయకులు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో అసెంబ్లీ కార్యదర్శి ఖ్యాతి సింగ్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నితీశ్ కుమార్ రాజ్యసభలోకి ప్రవేశించాలనే తన నిర్ణయాన్ని ప్రకటించడంతో, రాష్ట్రానికి ఎక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రిగా తన పదవీకాలానికి తెరపడింది. ఈ సంవత్సరం ప్రారంభంలో బిజెపి అధ్యక్షుడిగా నియమితులైన నబిన్‌కు, ఇది పార్లమెంటులో ఆయన తొలిసారిగా పని చేయనున్నారు. ప్రస్తుతం ఆయన శాసనమండలి సభ్యుడిగా ఉన్నారు. నామినేషన్లు దాఖలు చేసినప్పుడు డిప్యూటీ సిఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా హాజరయ్యారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రాజ్యసభకు వెళ్తున్నట్లు స్వయంగా తన ఎక్స్ పోస్టులో ధ్రువీకరించారు. దీంతో సిఎం పదవికి ఆయన రాజీనామా చేయనున్నారని స్పష్టమవుతోంది. 'రెండు దశాబ్దాలుగా మీరు నన్ను నమ్మి నాకు మద్దతు ఇచ్చారు. అంకితభావంతో నా విధుల్ని నిర్వర్తించాను. మీ మద్దతు, నమ్మకం వల్లే బిహార్ అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. నా పార్లమెంటరీ జీవితాన్ని ప్రారంభించినప్పటి నుంచే మనసులో ఒక కోరిక ఉండేది. రాష్ట్ర స్థాయిలో రెండు చట్టసభలకు, పార్లమెంట్‌లో రెండు సభలకు ప్రాతినిధ్యం వహించాలని అనుకున్నాను. అందుకే త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజ్యసభ ఎంపిగా నాప్రయాణాన్ని ప్రారంభించాలని అనుకుంటున్నాను. కొత్త బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా బిహార్‌తో నా బంధం కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను. కొత్త ప్రభుత్వానికి నా పూర్తి మద్దతు అందిస్తాను' అని తన పోస్టులో తరువాయి 12లో



## ఇద్దరూ ఏకగ్రీవమే


రాజ్యసభ అభ్యర్థులుగా కాంగ్రెస్ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు

హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం నుంచి ఖాళీగా ఉన్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. పోటీ చేసేందుకు సరైన సంఖ్యా బలం లేకపోవడంతో బిజెపి, బిఆర్ఎస్ రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. ఒక స్వతంత్ర అభ్యర్థి మాత్రం నామినేషన్ దాఖలు చేశారు. గురువారం తరువాయి 2లో





రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య, సాక్షి వివాహ వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

## నేటి నుంచి 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' షురూ

హైదరాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్న సిఎం : 99 రోజుల కార్యాచరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ''ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ''ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'' లోగోను రాష్ట్ర ప్రభుత్వం గురువా రం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో భాగం గా హైదరాబాద్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను తరువాయి 2లో


ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక
99 DAYS ACTION PLAN

### గ్రామ సభ కార్యక్రమాల షెడ్యూల్

రాష్ట్ర గీతంతో కార్యక్రమం ప్రారంభం ( 5 నిమిషాలు).
సిఎం వీడియో సందేశం (10 నిమిషాలు)
**వివిధ శాఖల విజయాలపై సమాచారం ..** ( 15 నిమిషాలు)
ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లు చదవడం ( 15 నిమిషాలు)
లబ్ధిదారుల అభిప్రాయాలు (15 నిమిషాలు)
ప్రజాప్రతినిధుల సందేశం ( 30 నిమిషాలు)

## నేపాల్‌లో పోలింగ్ ప్రశాంతం

- 48% ఓటింగ్
- నేటి సాయంత్రానికి పూర్తి ఫలితాలు



**కాఠ్మండు:** నేపాల్‌లో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా పూర్తయింది. ఎక్కడా ఎలాంటి ఘర్షణలూ చెలరేగలేదని ఎన్నికల సంఘం ప్రకటించింది. తుది సమాచారం ప్రకారం 48 శాతం పోలింగ్ నమోదు కాగా కాఠ్మండులో 65 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ పూర్తయ్యాక రాత్రి ఏడు గంటలకు కౌంటిగ్ ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం సాయంత్రానికి ఫలితాలు వెలువడతాయి. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం ఐదు గంటలకు పూర్తయింది. ఐతే ఆలస్యంగా వచ్చినవారిని ఆ తర్వాత కూడా ఓటు వేసేందుకు అనుమతించారు. అనేకమంది ప్రముఖులు, అభ్యర్థులు తమ తమ సొంత నియోజకవర్గాలలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. దేశ తాత్కాలిక ప్రధామంత్రి సుశీల కర్కి ఫైమాంఘులి లోని ధపసి లోయర్ సెకండరీ స్కూలు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. తర్వాత ఆమె మాట్లాడుతూ, భవిష్యత్తుకోసం ఈ రోజు ఎంతో ఆశాజనకమైనదన్నారు. ఝాపా–5 నియోజకవర్గంలో పోటీ చేస్తున్న 35 ఏళ్ళ యువకుడు, కాఠ్మండు మాజీ మేయర్ బలేంద్ర షా ఓటు హక్కును మార్చుకోకపోవడంతో తరువాయి 12లో

పశ్చిమాసియా, ఉక్రేన్ సంఘర్షణలకు

## త్వరగా ముగింపు పలకాలి

- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- సైనిక ఘర్షణ ద్వారా ఏ సమస్యనూ పరిష్కరించలేమని వ్యాఖ్య
- శాంతి కోసం చేసే ప్రతీ ప్రయత్నానికీ భారత్ మద్దతు ఉంటుందని వెల్లడి
- ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో విస్తృత స్థాయి చర్చలు



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా ప్రాంతీయ యుద్ధం పతాకస్థాయికి చేరుతున్న నేపథ్యంలో, ఈ ప్రాంతంలో పెరుగుతోన్న సంఘర్షణకు త్వరగా ముగింపు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపును ఇచ్చారు. సైనిక ఘర్షణ ద్వారా ఏ సమస్యనూ పరిష్కరించలేమని నొక్కిచెప్పారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో గురువారం విస్తృత స్థాయి చర్చల అనంతరం మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో అమెరికాఇజ్రాయెల్ యుద్ధం ఆరవ రోజుకు చేరిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చోటుచేసుకున్నాయి. ఇరువైపులా తాజా దాడుల మూలంగా ఈ ప్రాంతం తరువాయి 12లో

## 'విబి – జి రామ్ జి'లో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత

- 712 పంచాయతీలలో ఖాళీలు
- కుంటుపడుతున్న ఉపాధి పనులు

ప్రజాపక్షం/హనుమకొండ

కూలీలతో పాటు అన్నదాతలకు చేయూత అందిస్తున్న 'విబి జి రామ్ జి' (జాతీయ గ్రామీణ ఉపాధి హామీ) పథకంలో క్షేత్ర స్థాయి సహాయకుల (ఫీల్డ్ అసిస్టెంట్లు) కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ కు ఒకటి, రెండు గ్రామ పంచాయతీలు కొన్ని చోట్ల మూడు,నాలుగు పంచాయతీల ను సైతం అదనంగా అప్పగించారు. లేని పక్షంలో సీనియర్ మేట్లకు ఫీల్డ్ అసిస్టెంట్ల బాధ్యతలు అప్పగిస్తున్నారు. మరికొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు నిర్వర్తిస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్షేత్ర సహాయాకులను క్రమబద్ధీకరించాలని సమ్మె చేపట్టడంతో అందరినీ విధుల నుంచి తొలగించింది. ఒక దశలో ఆ వ్యవస్థను రద్దు చేస్తున్నట్టు కూడా ప్రకటించింది. ఆ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వం వారిని మళ్లీ విధుల్లోకి తీసుకుంది. కానీ వారి పరిస్థితి మాత్రం మారలేదు. గ్రామ పంచాయతీకి ఒకరి చొప్పున మాత్రం కాకుండా అదనంగా మరికొన్ని పంచాయతీల ఉపాధి పనుల పర్యవేక్షణ బాధ్యతలను అలాగే కొనసాగించింది. గత ప్రభుత్వ హయాంలో 500 జనాభా ఉన్న చిన్న గ్రామాలు, రెండు మూడు తండాలను కలిపి పంచాయతీలుగా ఏర్పాటు చేయగా వాటిల్లో క్షేత్ర సహాయకులను ఇప్పటి తరువాయి 2లో



భవన నిర్మాణంలో ప్రమాదం

## ఇద్దరు కార్మికులు మృతి

మరో ముగ్గురికి గాయాలు

హైదరాబాద్ టోలీచౌకీలో దుర్ఘటన

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నగరంలోని టోలీచౌకీ ప్రాంతంలో గురువా రం భవన నిర్మాణ స్థలంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అల్ హస్నాత్ కాలనీలో చోటుచేసుకుంది. లాలా అహ్మద్ అనే ఆటోడ్రైవర్, వాచ్‌మెన్ షబ్మన్ తరువాయి 2లో

# హోర్ముజ్ చుట్టూ కేంద్రీకృతమవుతున్న యుద్ధం!

**చైనా నౌకలు తప్ప ఎవరికీ అనుమతిలేదు : ఐఆర్‌జిసి**

**ద.కొరియాలో ఇంధన వనరుల సంక్షోభం**

**తల్లడిల్లుతున్న చిన్న దేశాలు**



**టెహ్రాన్ :** హోర్ముజ్ జలసంధి ద్వారా రాకపోకలు సాగించేందుకు చైనాదేశ నౌకలను మాత్రమే అనుమతిస్తామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) గురువారం స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధిని దాటి వెళ్లేందుకు ఇంకెవ్వరూ ప్రయత్నం చేసినా ఆ నౌకలను ధ్వంసం చేస్తామని, ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్, యూరోపియన్ యూనియన్ దేశాల నౌకలకు ఎలాంటి అనుమతీ లేదని పేర్కొంది. దీంతో భారత్ చమురుకు ఢోకాలేదన్న ఆశలు చిగురిస్తున్నాయి. హోర్ముజ్ జలసంధిని దాటి మహాసముద్రంలోకి ప్రవేశించి తమతమ గమ్యాలకు వెళ్ళే అవకాశం లేక ఇప్పటికే 200కు పైగా నౌకలు ఆ ముఖద్వారం వెలుపల ఆరురోజులుగా స్తంభించిపోయాయి. వాటి రవాణా ఖర్చులు రోజు గడిచేకొద్దీ కోట్ల రూపాయల మేరకు పేరుకుపోతూ ఉండటంతో చమురు వాణిజ్యవేత్తలు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో బ్యారెల్ ధర 200 డాలర్లకు పెరిగిపోయే ప్రమాదం కనిపిస్తుంది. జలసంధిని సురక్షితంగా వాణిజ్య నౌకలను దాటించేందుకు వైట్‌హౌస్ ఒక ప్రణాళికా వ్యూహాన్ని సిద్ధం చేస్తూ ఉండటంలో అమెరికా–ఐఆర్‌జిసి పంతాలమధ్య రాబోయే రోజుల్లో దాడులు–ప్రతిదాడులతో యుద్ధం ఎటువెళుతుంది? చమురు అవసరాల సంగతేమిటనే ఉత్కంఠ పెరుగుతోంది. ఈ దశలో హోర్ముజ్ జలసంధి చుట్టూ పశ్చిమాసియా భవిష్యత్తు యుద్ధం కేంద్రీకృతమవుతున్న పరిస్థితులు గోచరిస్తున్నాయి. ఆరు రోజులుగా హోర్ముజ్ జలసంధి నుండి వాణిజ్య నౌకల కార్యాకలాపాలన్నీని లిచిపోవడంతో ప్రపంచదేశాల్లో చమురు, సహజవాయువు సంక్షోభం పెరుగుతోంది. అనేక ఆసియా దేశాలు పశ్చిమాసియా చమురు సరఫరాలపైనే ఆధారపడ్డాయి. ప్రపంచానికి అవసరమైన 20 శాతం లిక్విఫైడ్ గ్యాస్ ఖతార్ నుండే సరఫరా అవుతోంది. రాబోయే రెండు వారాల్లో అనేక చిన్న దేశాల్లో నిల్వలు పూర్తిగా ఖాళీ అవుతాయి. తమ దేశంలో కేవలం ఇంకా ఏడు రోజులకు సరిపడ మాత్రమే సహజవాయువు నిల్వలు ఉన్నాయని దక్షిణ కొరియా ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతోంది. పశ్చిమ ఆసియాపై ఆధారపడిన బంగ్లాదేశ్‌లో కూడా ఆందోళన పెరుగుతోంది. చైనా, జపాన్ దేశాలకు ఎలాంటి ఢోకా లేదు. జపాన్ ప్రభుత్వం సమృద్ధిగా చమురు, సహజవాయువు నిల్వలను సమకూర్చుకుంది. 74 రోజులకు సరిపడ చమురు, సహజవాయువు నిల్వలున్నాయని భారత్ కూడా స్పష్టం చేసింది. ఈ పరిస్థితుల్లో ప్రపంచంలోనే అతపెద్ద చమురు ఉత్పత్తిదారైన రష్యా అవకాశాలకోసంఎదురుచూస్తోంది. భారత్ అవసరాలు తాము తీరుస్తామని ప్రకటించింది.

## ఇజ్రాయెల్ – హెజ్బొల్లా సైనికుల ప్రత్యక్ష పోరాటం

**దాడుల్లో హమాస్ అధికారి, భార్య మృతి**

**లొంగిపోయే ప్రశ్నేలేదు : హెజ్బొల్లా ప్రతిజ్ఞ**

**జెరూసలెం:** లెబనాన్‌లోని మారుమూల ప్రాంతాలకు, లోలోపలికి ఇజ్రాయెల్ దళాలు చొచ్చుకు పోతున్నాయి. లెబనాన్ అంతటా యుద్ధం విస్తరించింది. రెండు రోజుల క్రితం లెబనాన్‌లోకి భౌతికంగా ప్రవేశించిన ఇజ్రాయెల్ దళాలు అనేక ప్రాంతాలలో దాడులు చేస్తుండగా వారికి మద్దతుగా మరోవైపు గగనతల దాడులు కొనసాగుతున్నాయి. లెబనాన్‌లోని పలు ప్రాంతాలలో హెజ్బొల్లా–ఇజ్రాయెల్ దళాలమధ్య బాహాబాహీ ప్రత్యక్ష పోరాటం కొనసాగుతోంది. ఇజ్రాయెల్‌కు లొంగిపోయే ప్రశ్నేలేదని,ఆ దేశంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతాలను దెబ్బతీస్తామని హెజ్బొల్లా ప్రతిజ్ఞ చేయగా, మరోవైపు ఇజ్రాయెల్ కూడా హెజ్బొల్లాను నిరాయుధలను చేసే వరకూ లెబనాన్‌ను జల్లెడపడతామని శపథం చేసింది. అనేక ప్రాంతాలలో బాంబు పేలుళ్ళు కొనసాగుతున్నాయి. బీరూట్‌లో జాతీయ రహదారిపై ఇజ్రాయెల్ బాంబులవర్షం కురిపించింది. కారులో వెళుతున్న సమయంలో జరిగిన ఈ దాడిలో హమాస్ ఉగ్రవాద సంస్థ ఉన్నతాధికారి, అతడి భార్య మరణించారు. ముందస్తు సమాచారం మేరకే ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైనికదళం ప్రకటించింది. సోమవారం లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించినప్పటినుండీ ఇప్పటివరకూ 75 మంది మరణించారు. తాజాగా గురువారం దక్షిణ లిటానీ నది సమీపంలో హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దళాలు దాడులు చేశాయి. ప్రధానంగా బీరూట్‌లో, దక్షిణ లెబనాన్‌లో అనేక లక్ష్యాలపై ఐ.డి.ఎఫ్ దాడులు కొనసాగుతుండగా, టెల్‌అవీవ్ సమీపంలో ఐ.డి.ఎఫ్ స్థావరాలపై దాడులు చేసినట్లు హెజ్బొల్లా ప్రకటించింది.

## అమెరికాకు పశ్చాత్తాపం తప్పదు

**మా మాటలు అండర్‌లైన్ చేసుకోండి**

**'ఐరిస్ దేనా'నౌక ధ్వంసంపై అరాఘ్చి హెచ్చరిక**



**టెహ్రాన్ :** హిందూమహాసముద్రంలో 'ఐరిస్ దేనా' నౌకను ధ్వంసంచేసిన అమెరికాకు తీవ్ర పశ్చాత్తాపం తప్పదని ఇరాన్ విదేశీమంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి (విదేశీమంత్రి) తీవ్రహెచ్చరిక చేశారు. అంతకు అంత ప్రతీకారం తీర్చుకుంటామని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అమెరికా తీవ్ర పశ్చాత్తాపం చెందాల్సి వస్తుందన్నారు. "నా మాటలు అండర్ లైన్ చేసుకోండి, దేశాధ్యక్షుడు ఇలాంటి చర్యకు పాల్పడినందుకు రాబోయేకాలంలో అమెరికా అత్యంత చేదు అనుభవాలతో పశ్చాత్తాపం చెందుతుంది'' అని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఎలాంటి ముందరి హెచ్చరికలూ లేకుండా ఇరాన్ యుద్ధనౌకపై దాడులు చేయడం విరుద్ధచర్యగా పేర్కొన్నారు. అమాయకులైన అమెరికన్ ప్రజలను ట్రంప్ అవాంఛనీయమైన యుద్ధంలోకి లాగి కష్టాలపాలు చేస్తున్నారని విమర్శించారు. ఇరువైపులా జెనీవాలో సంప్రదింపులు జరుగుతున్న సమయంలో ఒక సానుకూల వాతావరణం వస్తుందనుకున్న తరుణంలో ట్రంప్ చర్చలకు ద్రోహం చేశారని ఇంతకుముందు కూడా ఆయన విమర్శించారు. అత్యంత సంక్లిష్టమైన అణు చర్చలను కూడా ట్రంప్ ఒక రియల్ ఎస్టేట్ కార్యకలాపంలాగా మార్చేశారన్నారు. వాస్తవాలను మబ్బులమాటున దాచిపెట్టి అవాస్తవికమైన అంచనాలను నెరవేర్చుకోవడం ఎప్పటికీ సాధ్యంకాదన్నారు. దక్షిణ శ్రీలంక తీరంలో ఇరాన్ నౌకను అమెరికా జలాంతర్గామి టార్పెడో సహాయంతో పేల్చివేసి నీట ముంచింది. ఈ దాడిలో 87 మంది ఇరాన్ సైనికులు, సిబ్బంది మరణించగా, 61 మందిగల్లంతయ్యారు. 32 మందిని శ్రీలంక రక్షణదళం కాపాడి ఆసుపత్రుల్లో చేర్చి చికిత్సలు చేస్తోంది.

## మధ్యవర్తిత్వానికి దక్షిణాఫ్రికా సంసిద్ధత



**కేప్‌టౌన్ :** పశ్చిమాసియాలో పరిణామాలు ప్రపంచానికి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా అన్నారు. తక్షణమే కాల్పుల విరమణ పాటించి చర్చలకు తరలివెళ్ళాలని ఆయన అన్ని పక్షాలకు విజ్ఞప్తి చేశారు. సంఘర్షణను, ఆపై యుద్ధాన్ని ముగించేందుకు చర్చలే ఎల్లప్పుడూ ఉత్తమ మార్గంగా ఉంటాయన్నారు. యుద్ధ పరిష్కారానికి మధ్యవర్తిత్వం చేసేందుకు దక్షిణాఫ్రికా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. రోజు రోజుకూ యుద్ధ తీవ్రత పెరగడం మంచిదికాదన్నారు. కేప్‌టౌన్‌లో గురువారం ఉదయం జరిగిన ఇంధన భద్రతసదస్సు సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. మధ్యధరా సముద్ర ప్రాంతం లేదా ఇంకెక్కడైనాగానీ అంతర్జాతీయస్థాయిలో, కోరితే మధ్యవర్తిత్వానికి మరేదైనా సహాయకారిగా పాత్ర పోషించడానికి దక్షిణాఫ్రికా తనవంతు కర్తవ్యాలను నెరవేర్చడానికి సిద్ధంగా ఉందన్నారు. వెంటనే యుద్ధం ముగిసిపోవాలని కోరుకుంటున్నామన్నారు.

# ట్రంప్‌కు కళ్ళెంవేసే యత్నం విఫలం

**సెనేట్‌లో వీగిపోయిన తీర్మానం**



**వాషింగ్టన్ :** ఇరాన్‌పై దాడులు చేసేందుకు అధ్యక్షుడు ట్రంప్‌కు ఉన్న అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రటిక్ సభ్యుడు టిమ్ కైన్ తెచ్చిన యుద్ధ వ్యతిరేక తీర్మానం అమెరికా సెనేట్‌లో వీగిపోయింది. రిపబ్లికన్ల తీర్మానానికి అధికార రిపబ్లికన్ పార్టీ సభ్యులు పూర్తి మద్దతు తెలియజేయగా, ప్రతిపక్ష డెమోక్రటిక్‌పార్టీ సభ్యులు ఇరాన్‌పై దాడి రాజ్యాంగ విరుద్ధమంటూ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సెనేట్‌లో ట్రంప్‌కు వ్యతిరేకంగా ఆయన అధికారాలను పరిమితంచేసే తీర్మానాన్ని 53 – 47 ఓట్లతో సభ్యులు తిరస్కరించారు. దీంతో యుద్ధం కొనసాగించేందుకు ట్రంప్ తన అధికారాలను నిలబెట్టుకున్నారు. ట్రంప్ అధికారాలను పరిమితం చేసే తీర్మానం గెలిచి ఉంటే కాంగ్రెస్ ప్రమేయం లేకుండా ఇక ట్రంప్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి వచ్చి ఉండేది. ఈ తీర్మానం గెలిచిఉంటే ఇరాన్‌కు, అమెరికా సైన్యానికి తప్పుడు సంకేతాలు వెళ్ళి ఉండేవని రిపబ్లికన్లు వ్యాఖ్యానించారు.అమెరికా రాజ్యాంగం ప్రకారం దేశాధ్యక్షుడికీ, కాంగ్రెస్ అంటే సెనేట్, దిగువసభలకు యుద్ధ సమయంలో వేరువేరు బాధ్యతలు ఉంటాయి. యుద్ధం చేయాలా? వద్దా? అనే నిర్ణయాలు తీసుకునే హక్కు అధ్యక్షుడికి ఉంటుంది. అదేసమయంలో కాంగ్రెస్‌లో ఉన్న ఉభయసభలకు ఈ యుద్ధానికి నిధులు కేటాయించే హక్కులు ఉంటాయి. చాలా సందర్భాలలో అమెరికాలో యుద్ధ సమయాలలో నిధుల కేటాయింపులపై అధికార ప్రతిపక్షాలకు తీవ్ర విభేదాలు తలెత్తాయి. 1973లో వియత్నాంలో యుద్ధం జరిగినప్పుడు నాటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌కు ఉన్న యుద్ధ అధికారాలను పరిమితం చేయడానికి ఆనాడు కాంగ్రెస్ యుద్ధ అధికారాల తీర్మానం తీసుకువచ్చింది. సైనిక చర్య ప్రారంభించిన 48 గంటల్లో అధ్యక్షుడు సమాచారాన్ని ఉభయసభలకూ తెలియజేయాలి. 60 రోజుల వ్యవధిలో సైనిక బలాన్ని ఉపయోగించడానికి కాంగ్రెస్ ఉభయసభలూ తీర్మానం చేయాలి. దీనిని ఎయుఎంఎఫ్ అంటారు. దీనిని రద్దుచేయడానికి ఇప్పటివరకూ జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అమెరికా కాంగ్రెస్‌ను ట్రంప్ పక్కకు నెట్టేశారని, తనను సమర్థించుకున్నారని డెమోక్రాట్లు విమర్శించారు. ఒకవేళ భవిష్యత్తులో యుద్ధం విస్తరిస్తే పరిస్థితులు తలక్రిందులు అవుతాయని మరికొందరు డెమోక్రాట్లు ఆలోచించారు. నాలుగు లేదా ఐదు వారాలలో యుద్ధం ముగిస్తామని ట్రంప్ మొదట చెప్పారు. కానీ రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ మాత్రం ఈ లక్ష్యాన్ని రెట్టింపు చేసి యుద్ధం ముగియడానికి ఎనిమిది వారాలు పట్టవచ్చునని గడువు పొడిగించారు. పెన్సిల్వేనియాకు చెందిన రిపబ్లికన్ సభ్యుడు జాన్ ఫెట్టర్‌మాన్, మైనేకు చెందిన రిపబ్లికన్ మితవాద సెనేటర్ సూసాన్ కాల్సిన్ తీర్మానాన్ని వ్యతిరేకించగా, కెంటుకీకి చెందిన రిపబ్లికన్ సెనేటర్ రాండ్ పాల్ అనుకూలంగా ఓటు వేశారు. మిగిలినవారంతా తమ తమ పార్టీల వైఖరులకు అనుగుణంగానే ఓటింగ్‌లో పాల్గొన్నారు.

## ట్రంప్‌ను ఎదిరించిన స్పెయిన్‌కు కృతజ్ఞతలు చెప్పిన ఇరాన్ అధ్యక్షుడు

**టెహ్రాన్:** అమెరికా,ఇజ్రాయెల్ దేశాలు దాడులు చేసేందుకు తన స్థావరాలు ఇచ్చేందుకు, యుద్ధంలో సహకరించేందుకు తిరస్కరించిన స్పెయిన్‌కు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ కృతజ్ఞతలు తెలయజేశారు. అనిశ్చిత ప్రపంచంలో స్పెయిన్ చాలా బాధ్యతాయుతంగా వ్యవహరించిందని ప్రశంసించారు. స్పానిష్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పాశ్చాత్య ప్రపంచంలో ఇంకా సున్నిమైన మనస్సాక్షి, నైతికవిలువలూ సజీవంగానే ఉన్నాయని తెలియజేసిందని ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. అమెరికాకు స్థావరాలు ఇచ్చేందుకు, యుద్ధంలో చేరేందుకు స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్ తిరస్కరించారు.

## ఇరాన్‌కు అజర్‌బైజాన్ అల్టిమేటమ్

**బాకు:** అటానమస్ రిపబ్లిక్ ఆఫ్ ఆజర్‌బైజాన్‌పై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. దీంతో అక్కడి విమానాశ్రయం టర్మినల్ భవంతిని డ్రోన్లు ధ్వంసం చేశాయి. నక్చివాన్‌లోని పలు ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. అనేకమంది గాయపడ్డారు. దీంతో అజర్‌బైజాన్ విదేశీమంత్రిత్వశాఖ తీవ్రస్థాయిలో ఇరాన్‌పై మండిపడింది. ఈ దాడుల ద్వారా ఇరాన్ అంతర్జాతీయ చట్టాలను, నిబంధనలను ఉల్లంఘించిందని, ఈ దాడులకు దారితీసిన పరిస్థితులు ఏమిటో స్పష్టం చేయాలని,అందుకు జవాబుదారీ వహించాలని డిమాండ్ చేసింది.వీలైనంత తక్కువ సమయంలో ఈ చర్యలకు తగిన వివరణ ఇవ్వాలని కోరింది. ఇకమీదట ఇలాంటి దాడులు జరపబోమని తమకు స్పష్టం చేయాలని అజర్‌బైజాన్ విదేశీమంత్రిత్వశాఖ డిమాండ్ చేసింది. తగిన నిర్దేశిత సమయంలోపు సమాధానం చెప్పకపోతే అవసరమైన చర్యలు తీసుకునే హక్కు తమ దేశానికి ఉందని కూడా స్పష్టం చేసింది.

## ఇద్దరు కార్మికులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

కార్థన్, గోవా మేస్త్రీ రమేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని సమీపంలోని ఆలివ్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం ప్రకారం నిర్మాణంలో ఉన్న భవనంపై కార్మికులు గోవా కర్రలపై నిలబడి పనులు చేస్తుండగా అవి ఒక్కసారిగా కూలిపోయాయి. దీంతో పైన పనిచేస్తున్న కార్మికులు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భవన యాజమని అరాఫత్ నిబంధనలకు విరుద్ధంగా ఆరు అంతస్తులు నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్న స్థానిక జిహెచ్ఎంసి అధికారులు సదరు భవన నిర్మాణంపై చర్యలు తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది.

**సంతాపం తెలిపిన మంత్రులు ప్రభాకర్, వివేక్**

ఈ ప్రమాదంపై హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామిలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిర్మాణంలో ఉన్న భవనంలో జరిగిన ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం, మరి కొందరు తీవ్రంగా గాయపడటం కలిచివేసిందన్నారు. ఘటనకు గల కారణాలపై జిల్లా కలెక్టర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి నాణ్యమైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవన నిర్మాణ ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు గాయపడిన కార్మికుల ఆరోగ్యం పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

## ఇద్దరూ ఏకగ్రీవమే

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్లకు గడువు ముగియడంతో శుక్రవారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఎంఎల్‌ఎల సంతకాలు లేకుండానే స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడంతో, ఆ నామినేషన్‌ను ఎన్నికల అధికారి తిరస్కరించే అవకాశాలు ఉన్నాయి. దీంతో అభిషేక్ మను సింఘ్వీ, వేం.నరేంద్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవంగా కానుంది.

కాగా అభిషేక్ మను సింఘ్వీ మూడు సెట్లను, వేం నరేందర్ రెడ్డి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను రాష్ట్ర శాసనసభ వ్యవహారల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో శాసనసభ కార్యాలయంలోని ఎన్నికల అధికారి ఉపేందర్ రెడ్డికి గురువారం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్,ఎంఐఎం తరపున ఎంఎల్‌ఎలు అహ్మద్ బిన్ బలాల, మీర్ జుల్ఫికర్ అలీ, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, తదితరులు హాజరయ్యారు.

**రాష్ట్రం నుంచి రెండవసారి పోటీలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నాను : అభిషేక్ మను సింఘ్వీ**

తెలంగాణ రాష్ట్రం తరపున రాజ్యసభకు రెండవ సారి అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని అభిషేక్ సింఘ్వీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తానన్నారు. తనకు అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, అగ్రనాయకులు సోనియా, రాహుల్, కెసివేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు ఆయన తెలిపారు. వేం.నరేందర్‌ర రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో తన వంతు ప్రయత్నిస్తానని హామీనిచ్చారు. తనకు రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, అగ్రనాయకులు సోనియా, రాహుల్, కెసివేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

**సిఎం సలహాదారు పదవికి నరేందర్ రెడ్డి రాజీనామా**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ సలహాదారు వేం.నరేందర్ రెడ్డి తన సలహాదారు పదవికి రాజీనామా చేశారు.ఆయన రాజీనామాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు ఆమోదించారు.రాజ్యసభ సభ్యునిగా నరేందర్ రెడ్డి పేరును ఖరారు చేసిన నేపథ్యంలో తన సలహాదారు పదవికి రాజీనామా చేశారు.

## 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' షురూ

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. తొలుత అన్ని జిల్లాల్లో ఇన్‌ఛార్జ్ మంత్రుల ఆధ్వర్యంలో శుక్రవారం సన్నాహక సమావేశాలను నిర్వహించనున్నారు. ఆ తర్వాత గ్రామ సభల ద్వారా సుమారు 90 నిమిషాల పాటు ''ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'' కార్యక్రమాన్ని నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ప్రణాళిక శాఖ నోడల్ శాఖగా వ్యవహరించనుంది. ఈ సభలకు ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు,ఇతర ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 10 ప్రధానాంశాలపై ప్రత్యేక దృష్టి సారించింది. 99 రోజుల కార్యాచరణను అమలు చేసే విధంగా ఆయా శాఖల వారిగా ఐఎఎస్‌లను డిజిపి శివదర్‌రెడ్డిని నోడల్ అధికారులుగా నియమించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పర్యవేక్షణకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్ష తన మంత్రివర్గ ఉప సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమావేశమై దిశానిర్దేశం చేయగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు శాఖల వారిగా సమీక్షలు, సమావేశాలను నిర్వహించారు. కాగా ప్రతి గ్రామ సభ కార్యక్రమాన్ని రాష్ట్ర గీతంతో ప్రారంభించనున్నారు. ఈసభకు వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులను కూడా పరిచయం చేసి వారి అభిప్రాయాలను సభ ద్వారా తెలియజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## శివప్రతాప్ శుక్లా

(మొదటి పేజీ తరువాయి)

సయ్యద్ అటా హస్నైన్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

**బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి**

అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర గవర్నర్ సి.వి.ఆనంద్ బోస్ తన పదవికి ఆకస్మికంగా రాజీనామా చేశారు. ఈ రాజీనామా పట్ల బెం గాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తీవ్ర ది గ్భ్రాంతి వ్యక్తం చేశారు. తమిళనాడులో వివాదాస్పద గవర్నర్‌గా పేరొందిన ఆర్.ఎన్.రవి రవి బెంగాల్‌కు బదిలీ అయ్యారు. కేంద్ర హోంశాఖ నుండి తనకు ఈ సమాచారం అందిందని మమతా బెనర్జీ చెప్పా రు. ఆర్.ఎన్. రవికి అదనపు బాధ్యతలు అప్పగించే విషయం గురించి ముందుగా తనను అమిత్ షా సంప్రదించలేదని ఆమె అన్నారు. గవర్నర్ సి.వి.ఆనంద్ గురువారం ఉదయం తన రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి పంపించారు. న్యూఢిల్లీలోనే ఆయన పదవికి రాజీనామా చేసినట్లు అక్కడి పశ్చిమ బెంగాల్ రాష్ట్ర భవన్ ప్రకటించింది. 2022 నవంబరు 17వ తేదీన సి.వి.ఆనంద్ గవర్నర్ బాధ్యతలు తీసుకున్నారు. ''ఔను...నేను రాజీనామా చేశాను. మూడున్నర సంవత్సరాలపాటు నేను గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించాను, ఇక అది నాకు చాలు'' అని సి.వి.ఆనంద్ వ్యాఖ్యానించారు. అంతకుమించిన అదనపు సమాచారం ఆయన చెప్పలేదు. ఐతే ఆకస్మిక రాజీనామాకు పురిగొల్పిన పరిస్థితులు, ఏవైనా రాజకీయ ఒత్తిడులు ఎదురయ్యాయా? వంటి విషయాల గురించి కూడా ఆయన వివరించలేదు. ''కేంద్ర హోంమంత్రి అమిత్ షా నుండి నాకు సమాచారం అందింది, ఇప్పుడు రాజీనామా చేసిన సి.వి.ఆనంద్‌బోస్ స్థానంలో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి అదనపు బాధ్యతలు తీసుకుంటారు'' అని సోషల్ మీడియా ద్వారా మమతా బెనర్జీ తెలియజేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బహుశా హోంమంత్రి అమిత్ షా చేసిన రాజకీయ ఒత్తిడి కారణంగానే సి.వి.ఆనంద్ బోస్ తన పదవికి రాజీనామా చేసి ఉంటారని ఆమె సందేహం వ్యక్తం చేశారు. ఈ విషయం విని తానెంతో దిగ్భ్రాంతికి గురయ్యానని ఎక్స్ వేదికగా ఆమె పేర్కొన్నారు. ''దీని వెనుక కారణాలు ఏమిటో ఈ క్షణంలో నాకు తెలియవు, కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి మనం ఊహించాలి, కొన్ని రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చమని బహుశా అమిత్ షా ఒత్తిడి చేసి ఉండాలి, అలా జరిగిందంటే నేనేమీ పెద్దగా ఆశ్చర్యపడను, ఎన్నికలు సమీపిస్తున్నాయి, అందువల్ల ఆయన రాజకీయ ప్రయోజనాలను సి.వి.ఆనంద్ ద్వారా ఆశించి ఉంటారు'' అని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. తాత్కాలిక బాధ్యతలను ఆర్.ఎన్.రవి చేపడతారన్న విషయం కూడా తనకు అమిత్ షా తెలియజేశారన్నారు. కానీ ఆయన నియామకం గురించి ఒక ముఖ్యమంత్రిగా తనతో ముందు గా సంప్రదించలేదని, ఆయనకు తాత్కాలిక బాధ్యతలు అప్పగిస్తున్న విషయం మాత్రమే చెప్పారన్నారు. ''కేంద్ర హోం మంత్రి ఇప్పుడే నాకు తెలియజేశారు, ఆర్.ఎన్.రవిని పశ్చిమ బెంగాల్‌కు గవర్నర్‌గా నియమించారు. ఈ విషయంలో ఆయన నన్ను ఎప్పుడూ సంప్రదించలేదు, నిర్దేశిత సంప్రదాయాల ప్రకారం హోం మంత్రి నన్ను సంప్రదించాల్సి ఉంది, ఈ ఏకపక్ష నిర్ణయం ప్రజాస్వామ్య సంప్రదాలను, రాష్ట్రాలకు ఉన్న గౌరవాన్ని కూలదోసినట్టే'' అని మమతా విమర్శించారు.

## ప్రమాద ఘంటికలు

(మొదటి పేజీ తరువాయి)

బుషెర్ రాష్ట్రాలలో ఉన్న మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా–ఇజ్రాయెల్ వేలాదిగా క్షిపణి దాడులు చేస్తున్నాయి. ప్రమాదకరమైన, నిషిద్ధ క్లస్టర్ బాంబులను తమదేశంపై ఇరాన్ ప్రయోగిస్తోందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఇది అత్యంత ప్రమాదకరమైన విషయమని పేర్కొంది.

వారం రోజుల్లోనే ఇరాన్ గగన తలాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకుంటామని అమెరికా ప్రకటించింది. మరో రెండు వారాలపాటు క్రమ పద్ధతిలో ఇరాన్‌లో ఉన్న వేలాది లక్ష్యాలపై దాడులు చేస్తామని, ఇరాన్ పాలకులను, దాని సైనిక వ్యవస్థ సామర్థ్యాన్నీ క్రమంగాగా క్షీణింపజేయడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇప్పటివరకూ ఇరాన్‌పై 5,000 బాంబు దాడులు చేశామని పేర్కొంది. తూర్పు టెహ్రాన్‌లో ఇరాన్ మిలిటరీ కాంపౌండ్‌పై 100 యుద్ధ విమానాలు దాడిచేసి 250 బాంబులను జారవిడిచి ధ్వంసం చేసినట్లు తెలిపింది. వచ్చే ఆదివారంనాటికి ఇజ్రాయెల్ గగనతలాన్ని తెరచి విమానాల రాకపోకలను పునరుద్ధరిస్తామని ఆ దేశ రవాణా మంత్రి మిర్ రెజెవ్ గురువారంప్రకటించారు. ఇరాక్‌లో ఉన్న కుర్దులతో కలిసి సమన్వయ దాడులు చేస్తామని ఇరాన్ ప్రకటించింది. గురువారం తెల్లవారేవరకూ రాత్రం తా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో భారీ దాడులు కొనసాగిస్తూనే ఉంది. టెహ్రాన్‌ను ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్–అమెరికా ''హెవీ బాంబింగ్''కార్యకలాపాలు నిర్వహించాయి. యుద్ధంలో చేరే అవకాశాలను నార్వే ప్రభుత్వం తోసిపుచ్చలేదు. మరోవైపు ఆస్ట్రేలియా కూడా యుద్ధంలోకి ప్రవేశించేందుకు ఆయుధ సంపత్తిని తరలించడం ప్రారంభించింది. దాడులవల్ల, ముందస్తు జాగ్రత్తలవల్ల ఇరాన్ దేశం అంతటా అంధకారం నెలకుంది. బాగ్దాద్‌లో తాజాగా మళ్ళీ బాంబు దాడులు జరిగాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఉమ్మడి దళాలు బలగాలు ధ్వంసం చేసిన రివల్యూషనరీ కోర్టు, ఇరాన్ పాత పార్లమెంటరీ భవనం, అత్యున్నత మండలి కార్యాలయ భవన సముదాయం, చారిత్రక కట్టడాలు, భవనాలు, మౌలిక సదుపాయాల చిత్రాలను పాశ్చాత్య మీడియా విడుదల చేసింది. ఇరాన్‌పై ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో 636 ప్రాంతాలలో 1,332 మంది ప్రజలు సైనికులు మరణించారని రెడ్‌క్రాస్ సంస్థ ప్రకటించింది. అదేవిధంగా రాజధాని టెహ్రాన్ నుండి యుద్ధం మొదలైన మొదటి రెండు రోజుల్లోనే 1,00,000 మంది ప్రజలు నగరం వదలి సురక్షిత ప్రాంతాలకు పారిపోయారని ఐక్యరాజ్యసమితి తన నివేదికలో తెలియజేసింది. టర్కీపై ఇరాన్ క్షిపణులను గురిపెట్టడంతో ఈ రెండు దేశాలమధ్య ఉద్రిక్తతలు మొదలయ్యాయి. ఇరాన్ డ్రోన్‌లు అటానమస్ రిపబ్లిక్ ఆఫ్ అజర్‌బైజాన్‌ను తాకాయి. ఆ దేశ నక్చివాన్‌లోని పలు ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు క్షిపణి దాడుల్లో ధ్వంసమయ్యాయి.

## ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత

(మొదటి పేజీ తరువాయి)

వరకు నియమించలేదు. దీంతో పథకం నిర్వహణ భారంగా మారుతోంది. క్షేత్ర స్థాయిలో పనుల గుర్తింపు, కూలీల హాజరు, పని ప్రదేశంలో వసతులు, సమయానికి వేతనాల చెల్లింపులు తదితర పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్తగా ఏర్పాటైన 712 గ్రామ పంచాయతీలకు క్షేత్ర సహాయకులు ఇప్పటి వరకు లేరు.

**పాలనా సౌలభ్యం కోసం పంచాయతీలు**

రాష్ట్ర ప్రభుత్వం 2019లో మేజర్ గ్రామ పంచాయతీలను విడదీసి 500కు పైగా జనాభా కలిగిన తండాలను, గూడెంలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి పాత పంచాయతీలతో సమానంగా కొత్త పంచాయతీలకు గుర్తింపును ఇచ్చింది. పంచాయతీలను యూనిట్ గా తీసుకొని పనులను నిర్ణయిస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని కూలీలకు పనులు కల్పిస్తున్నారు. వీరు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు. అయితే ఉపాధి హామీ పనులను పంచాయతీ స్థాయిలో పర్యవేక్షించేందుకు క్షేత్ర సహాయకులను నియమించలేదు. దాదాపు ఐదేళ్ల నుంచి పాత పంచాయతీల్లో పాత క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులే ఆయా పంచాయతీల్లో పనులను పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.54 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 24.43 లక్షల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు.

**712 కొత్త పంచాయతీలు**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1708 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అంతకు ముందు 976 పంచాయతీలు ఉండగా కొత్తగా 712 ఏర్పాటయ్యాయి. ఆ తర్వాత పునవ్యవస్థీక రణలో భాగంగా అదనంగా మరో 20 పంచాయతీలు వచ్చి చేరాయి. హనుమకొండ జిల్లాలో 27, వరంగల్ జిల్లాలో 131, జనగామ జిల్లాలో 91, మహబూబాబాద్ జిల్లాలో 241, ములుగు, జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలో 222 కొత్తగా ఏర్పాటయిన పంచాయతీల్లో ఉన్నాయి. కొత్త పంచాయతీల్లో క్షేత్ర సహాయకులను కొత్తగా నియమించాల్సి ఉండగా ఇప్పటివరకు నియామకం జరగలేదు. దీంతో పాత పంచాయతీ క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులపై అదనపు పని భారం పడుతోంది. కొత్త పంచాయతీల్లోనూ విధులను నిర్వహిస్తున్నందుకు క్షేత్ర సహాయకులకు అదనంగా భత్యాలు ఇస్తున్నారా అంటే అదీ లేదు. పాత, కొత్త గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు పాలకవర్గ సమావేశాలు, గ్రామ సభలు పెట్టినప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్లు ఎటువెళ్లాలో తేల్చుకోలేని పరిస్థితి తరుచూ ఏర్పడు తోంది. ఏడాదిలో సరాసరి పదిరోజుల కన్నా మించి కూలీలకు ఉపాధి పనులు కల్పించని గ్రామ పంచాయతీ ల్లో క్షేత్ర సహాయకులను తొలగించారు. అటువంటి ఖాళీలు కూడా ఉమ్మడి జిల్లాలో 125 వరకు ఉన్నాయి. వీటి పని భారం కూడా ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల మీదనే పడుతోంది.

**క్షేత్ర సహాయకులే కీలకం**

గ్రామాల్లో పనులు కల్పించడం, కూలీల మస్టర్ల కేటాయింపు, పనుల పర్యవేక్షణ, కొత్త జాబ్ కార్డుల మంజూరు, ఆధార్ అను సంధానం, కూలీలకు వసతి వంటి బాధ్యత లను క్షేత్ర సహాయకులే నిర్వహిస్తుంటారు. ఉన్న వారికే రెండు మూడు గ్రామాల బాధ్యతలు అప్పగిస్తున్నారు. క్షేత్ర సహాయ కుల కొరత వల్ల ఉపాధి పనుల కల్పనలో ఆలస్యం జరుగుతోంది. మస్టర్ల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. పని పూర్తయిన తర్వాత క్షేత్ర స్థాయి పరిశీలన, ఆన్ లైన్ ఎంట్రీ ఆలస్యం కావడంతో కూలీలకు డబ్బులు సకాలంలో అందడం లేదు.

**మేట్లకు బాధ్యతలు**

అనుభవం ఉన్న కూలీలనే మేటిలుగా నియమించి పనులు చేయించే బాధ్యతలు అప్పగిస్తున్నారు. మేట్లు చురుగ్గా లేని చోట్ల పంచాయతీ కార్యదర్శులపై భారం పడుతోంది. మేట్లకు సరైన అవగాహన లేపోవడంతో వారు చేసే తప్పిదాలకు గురికావలసి వస్తోంది. పూర్తి స్థాయి బాధ్యతలు లేక పనుల్లో పురోగతి లేకుండా నిర్లక్ష్యానికి గురి అవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. కాగా, క్షేత్ర సహాయకులకు సకాలంలో వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. గత డిసెంబర్ నుంచి వారికి వేతనాలు రావడం లేదు. ఇదే విషయమైన ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం ఉండ డం లేదని క్షేత్ర సహాయకుల సంఘం నాయకులు వాపోతున్నారు.

**పెరిగిన పని భారం**

గ్రామాల్లో కూలీలను పనుల్లోకి వెళ్లేలా చేయడం, మస్టర్ల కేటాయింపు, పనుల గుర్తింపు, జాబ్ కార్డులకు అర్హులను గుర్తించడం వంటి పనులను చేయడంలో క్షేత్ర సహాయ కులు ఎంతో కీలకం. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న క్షేత్ర సహాయకుల్లో కొంత మందిని వివిధ కారణాలతో విదుల నుంచి తొలగించారు. ఆ ఖాళీలతో పాటు నూతన పంచాయతీ ల్లో క్షేత్ర సహాయకులు అవసరం లేదని భావించి పనుల నిర్వహణ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం అప్పగించింది. కార్యదర్శులు, గ్రామ పనులతో పాటు ఉపాది హామీ పనుల నిర్వహణతో సతమతమవుతున్నారు. పనుల ఒత్తిడి వల్లవారు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేక పోతున్నారు. దీనితో లక్ష్యం మేరకు కూలీలు పనుల్లోకి రావడం లేదు. పనులు సక్రమంగా జరగడం లేదు.

## కడియంపై దాఖలైన పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

దానం నాగేందర్‌పై విచారణ శనివారానికి వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్టేషన్‌ఘన్ పూర్ ఎంఎల్‌ఎ కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత వేటు పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అసెంబ్లీలోని తనచాంబర్‌లో గురువారం విచారణ చేపట్టారు. ఇరు వర్గాల వాదనలు విని తీర్పును రిజర్వ్ చేశారు. కాగా ఖైరతాబాద్ ఎంఎల్‌ఎ దానం నాగేందర్‌పై విచారణను శనివారానికి వాయిదా వేశారు. పార్టీ ఫిరాయింపులపైనఇప్పటికే 8 మంది ఎంఎల్‌ఎలకు చెందిన కేసును విచారించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆ పిటిషన్‌ను తిరస్కరించారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

ఓపెన్ ఈ-టెండర్ నోటీసు నంబర్లు C/E.29/Elec/M/SC/44,45, 46, 47 & 48/PA/OT/2025-26 తేదీ.03.03.2026 PUB/2044

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున, క్రింద సంతకం చేసిన వారు 24.03.2026న మధ్యాహ్నం 3 గంటల వరకు క్రింద ఇవ్వబడిన పని కోసం ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం. 1. ఇ-టెండర్ నంబర్: etender no. C/E.29/Elec/M/SC/44/PA/OT/2025-26, ఇ-టెండర్ నంబర్. E-M-SC-44-OT-2025-26 పని పేరు: సికింద్రాబాద్ డివిజన్ విద్యుత్ నిర్వహణ విభాగం- బీదర్ రైల్వే స్టేషన్ వద్ద రోడ్డు నంబర్. 1 & రోడ్డు నంబర్. 3 కోసం బ్యాలస్ట్ లేని ట్రాక్ మరియు త్వరిత నీటిపారుదల ఏర్పాట్లు విద్యుత్ ఏర్పాట్లు. టెండర్ విలువ : రూ. 1,99,30,111.00 EMD : రూ. 2,49,700.00 CTF: రూ. 0.00 పూర్తి కాలం: 6 నెలలు.

క్ర.సం.2. ఇ-టెండర్ నం. etender no. C/E.29/Elec/M/SC/45/PA/OT/2025-26 టెండర్ నం.E-M-SC-45-OT-2025-26 పని పేరు: సికింద్రాబాద్ డివిజన్ విద్యుత్ నిర్వహణ విభాగం PRLI విద్యుత్ అమరికలలో లూప్ లైన్-1 కోసం బ్యాలస్ట్ లెస్ ట్రాక్ మరియు క్విక్ వాటర్ సిస్టమ్‌ను అందించడం. టెండర్ విలువ: రూ. 1,99,30,111.00 EMD: రూ. 2,49,700.00 CTF: రూ. 0.00 పూర్తి కాలం: 6 నెలలు

క్ర.సం. 3. ఇ-టెండర్ నం. etender no. C/E.29/Elec/M/SC/46/PA/OT/2025-26 ఇటెండర్ నం. E-M-SC-46-OT-2025-26 పని పేరు: సికింద్రాబాద్ డివిజన్ విద్యుత్ నిర్వహణ విభాగం సిర్పూర్ కాగజ్ నగర్ సిర్పూర్ కాగజ్ నగర్ రైల్వే స్టేషన్ వద్ద రోడ్ 5 మరియు రోడ్ 5 & 6 మధ్య క్విక్ వాటర్ సిస్టమ్ కోసం బ్యాలస్ట్ లెస్ ట్రాక్ ఏర్పాటు విద్యుత్ ఏర్పాట్లు. టెండర్ విలువ : రూ. 2,04,67,936.00 EMD : రూ. 2,52,300.00 CTF : రూ. 0.00 పూర్తి కాలం 6 నెలలు

క్ర.సం. 4. ఇ-టెండర్ నం. etender no. C/E.29/Elec/M/SC/47/PA/OT/2025-26 ఇ-టెండర్ నెం.E-M-SC-47-OT-2025-26 పని పేరు: సికింద్రాబాద్ డివిజన్ విద్యుత్ నిర్వహణ విభాగం KRMR ఎలక్ట్రికల్ అరేంజ్‌మెంట్స్‌లో లూప్ లైన్-1 కోసం బ్యాలస్ట్ లెస్ ట్రాక్ మరియు క్విక్ వాటర్ సిస్టమ్‌ను అందించడం. టెండర్ విలువ : రూ. 1,99,15,243.00 EMD : రూ. 2,49,600.00 CTF: రూ. 0.00 పూర్తి కాలం: 6 నెలలు

1. టెండర్ నిబంధనలు/ఇతర వివరాలు IREPS వెబ్‌సైట్‌లోని 'www.ireps.gov.in'లోని టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి, వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, పాల్గొనవచ్చు మరియు ఏవైనా మార్పులు ఉంటే చూడవచ్చు.
2. టెండర్ నోటీసును సీనియర్ DEE(నిర్వహణ), సికింద్రాబాద్ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ కార్యాలయంలో ఉన్న నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించారు, దీనిని అన్ని పని దినాలలో చూడవచ్చు.
3. ఎటువంటి కారణం చూపకుండానే టెండర్ను రద్దు చేసే హక్కు రైల్వేకు ఉంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (నిర్వహణ)/ సికింద్రాబాద్

ఓపెన్ ఇ-టెండర్ నోటీసు నం. N/E.29/TrD/Tender/23/2025-26 తేదీ. 27.02.2026 PUB/2045

క్రింది పనుల కోసం కింద సంతకం చేసిన వారు సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తారు.

క్ర.సం. 1 టెండర్ నం. N/E.29/TrD/Tender/23/2025-26 పనుల వివరణ నాందేడ్ డివిజన్: నాందేడ్ డివిజన్-TRD భాగం యొక్క అమృత్ స్టేషన్లలో (ADB, KNVT, HEM, HNL, WHM, BOKR) 25KVA AT సరఫరాను అందించడం పూర్తి కాలం: 12 నెలలు సుమారు విలువ (రూ.) 2475224.40 బిడ్ సెక్యూరిటీ (రూ.) 49500.00

ముగింపు తేదీ- N/E.29/TrD/ టెండర్/23/2025-26 23/03/2026 ఉదయం 11:00 గంటలకు.

గమనిక: ప్రారంభ తేదీ సెలవుదినం అయితే, తదుపరి పని దినాన టెండర్ తెరవబడుతుంది

వివరణాత్మక షరతుల కోసం 'www.ireps.gov.inలో మా సైట్‌ను సందర్శించండి'

డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ TRD/నాందేడ్

No: G/E.29/Tr/Tenders/2025-26 తేదీ: 03-03-2026 PUB/2046

టెండర్ నోటీసు నం: G/E.29/Tr./ టెండర్ నోటీసు/58/2025-26

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున పనిచేస్తున్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ట్రాక్షన్/గుంతకల్ కింది పనులకు E-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నం. GTL-TRD-29-eTN-90- 2025-26 పని పేరు: GTL విభాగం: OHE గుత్తి (GY)-రేణిగుంట (RU) విభాగంలోని జక్కలచెరువు (JKO) స్టేషన్ వద్ద UP లూప్ లైన్కు కామన్ లూప్ సాకర్యాల కోసం క్రాస్‌ఓవర్లను అందించడానికి బదులుగా మార్పులు సుమారు విలువ : రూ. 73,25,660.50/- EMD: రూ. 1,46,500.00/-

టెండర్ ముగింపు తేదీ & సమయం: 25.03.2026 మధ్యాహ్నం 3.00 గంటలకు

గమనిక: 1. టెండర్ డాక్యుమెంట్‌ను టెండరుదారులు www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
టెండర్ బిడ్డర్ మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.inకు లాగిన్ అవ్వండి. ఏదైనా సవరణ ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్.
A2593

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

## హెచ్‌సిఎ – విశాకా ఇండస్ట్రీస్
# రూ.68.73 కోట్ల చెల్లింపుల్లో అవకతవకలు

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన టిసిఎ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సిఎ) – విశాఖ ఇండస్ట్రీస్ మధ్య జరిగిన మధ్యవర్తిత్వ తీర్పు అమలు వ్యవహారంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ప్రధాన కార్యదర్శి దారం గురువరెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో పలు మాజీ, ప్రస్తుత హెచ్‌సిఎ పదవి దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో దారం గురువరెడ్డి మాట్లాడుతూ, 2004 అక్టోబర్ 16న హెచ్‌సిఎ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ఒప్పందం సందర్భంగా విశాఖ ఇండస్ట్రీస్‌తో అనుమానాస్పద ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. సుమారు రూ. 60–70 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించి విశాఖ ఇండస్ట్రీస్ రూ.6.50 కోట్లు చెల్లించి ప్రకటనలు, పేరుమార్పు హక్కులు పొందిందని చెప్పారు. ఆ సమయంలో హెచ్‌సిఎ అధ్యక్షుడిగా ఉన్న జి.వినోద్‌కు విశాఖ సంస్థతో సంబంధాలు ఉండటం వల్ల ప్రయోజనాల ఘర్షణ ఉన్నట్లు ఆరోపించారు.ఈ వివాదంపై 2016 మార్చి 15న మధ్యవర్తి ఎంఆర్ విక్రమ్ ఇచ్చిన తీర్పులో హెచ్‌సిఎ విశాఖ ఇండస్ట్రీస్‌కు రూ.25.92 కోట్లు చెల్లించాలని ఆదేశించారని తెలిపారు. అయితే అప్పటి హెచ్‌సిఎ అధ్యక్షులు జి. వివేకానంద్, మహ్మద్ అజహరుద్దీన్ ఆ తీర్పును సవాలు చేయకుండా వదిలేయడంతో వడ్డీతో కలిపి మొత్తం బాధ్యత రూ.68.73 కోట్లకు పెరిగిందని ఆరోపించారు.మాజీ న్యాయమూర్తి ఎల్. నాగేశ్వరరావు సమర్పించిన నివేదికలో కూడా ఈ వ్యవహారాన్ని కలుషిత పిటిషన్‌గా పేర్కొంటూ అవినీతి, నిధుల దుర్వినియోగంపై కేసులు నమోదు చేయాలని సూచించారని దారం గురువరెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 2026 ఫిబ్రవరి 9న కెనరా బ్యాంకు ద్వారా హెచ్‌సిఎ రూ.68.73 కోట్లు డ్రాఫ్టల రూపంలో ప్రత్యేక వాణిజ్య న్యాయస్థానానికి చెల్లించిందని, అప్పీల్ చేయకుండా లేదా రాజీ మార్గం అనుసరించకుండా ఈ చెల్లింపు జరిగిందని ఆయన తెలిపారు. ఈ వ్యవహారంలో మాజీ హెచ్‌సిఎ అధ్యక్షుడు డాక్టర్ జి. వివేకానంద్ (ప్రస్తుత మంత్రి), మాజీ అధ్యక్షుడు మహ్మద్ అజహరుద్దీన్, జి. వినోద్, మధ్యవర్తి ఎం.ఆర్. విక్రమ్‌తో పాటు ప్రస్తుత అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఏ. అమర్‌నాథ్, సర్దార్ దల్జీత్ సింగ్, టి. బసవరాజు ఇతర అధికారులపై భారతీయ శిక్షాస్మృతిలోని మోసం, నమ్మకద్రోహం, కుట్ర, నకిలీ పత్రాల తయారీ తదితర నేరాల కింద కేసులు నమోదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 2004 నుంచి 2026 వరకు హెచ్‌సిఎ ఖాతాలపై కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ లేదా కేంద్ర దర్యాప్తు సంస్థ ద్వారా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కూడా ఆయన కోరారు.

## లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన జిహెచ్‌ఎంసి అధికారి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** లంచం తీసుకుంటూ జిహెచ్‌ఎంసి ఉద్యోగిని అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో ఖాతాల విభాగంలో ఎగ్జామినర్‌గా పనిచేస్తున్న సూర్యవంశి సంతోష్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పదవీ విరమణ ప్రయోజనాలకు సంబంధించిన ఫైలును ప్రధాన కార్యాలయానికి పంపించేందుకు ఫిర్యాదుదారుడి వద్ద నుంచి సూర్యవంశి సంతోష్ రూ.40 వేల లంచం డిమాండ్ చేశాడు. అనంతరం రూ.35 వేల లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులు అతడిని కార్యాలయంలోనే పట్టుకున్నారు. లంచంగా తీసుకున్న రూ.35 వేల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికార విధులను దుర్వినియోగం చేసి అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినందుకు అతనిపై కేసు నమోదు చేశారు.నిందితుడిని అరెస్ట్ చేసి నాంపల్లిలోని ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. భద్రతా కారణాల వల్ల ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు.

### లంచం డిమాండ్ చేస్తే 1064కు సమాచారం

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. అలాగే వాట్సాప్ (9440446106), సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు.

## గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్ర నిధులు

కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు పంచాయతీ రాజ్ సంస్థలకు గ్రాంట్ల రూపంలో నిధులు అందిస్తున్నామని చెప్పారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ వంటి మౌలిక సదుపాయాల కోసం ఈ నిధులు వినియోగించుకోవచ్చన్నారు. గత పదేళ్లలో తెలంగాణ గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు కేంద్రం రూ.11 వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేసిందన్నారు. 2015–16 నుండి 2019–20 వరకు రూ.5,060 కోట్లు విడుదల కాగా, 2020–21 నుండి 2025–26 వరకు కేటాయింపులు పెరిగి రూ.9,050 కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. 2026లో ఇప్పటివరకు తెలంగాణకు రూ.1,034.42 కోట్ల నిధులు అందాయని, దీంతో రాష్ట్రంలోని 12,702 గ్రామ పంచాయతీలకు లాభం చేకూరుతుందన్నారు. కేంద్రం నుండి నిధులు అందిన 10 రోజుల్లోపు రాష్ట్ర ప్రభుత్వం వాటిని పంచాయతీల ఖాతాల్లోకి మళ్లించాలని, ఆలస్యమైతే వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మిగిలిన నిధులు వినియోగ ధృవీకరణ పత్రాలు సమర్పించిన వెంటనే విడుదల చేస్తామని కిషన్ రెడ్డి వెల్లడించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులను దారి మళ్లించడం వల్ల సర్పంచులు ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఆ పరిస్థితి రానివ్వకూడదని ఆయన కోరారు.

## సాగర్ డ్యాం వద్ద తనిఖీ

డ్యాం క్రస్ట్ గేట్లు, కంట్రోల్ రూమ్, టెలిమెట్రి వ్యవస్థ పరిశీలించిన కేంద్ర జల వనరుల సంఘం ఉన్నతాధికారులు



**ప్రజాపక్షం/నందికొండ:** దేశంలోని ప్రముఖ సాగునీటి ప్రాజెక్టులలో ఒకటైన నాగార్జునసాగర్ ప్రాజెక్టును గురువారం కేంద్ర జల వనరుల సంఘం కృష్ణాగోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.ఎస్. సహారే సందర్శించి ప్రాజెక్టు పనితీరును పరిశీలించారు. డ్యాం నిర్వహణ, భద్రతా చర్యలు, సాంకేతిక వ్యవస్థల పనితీరుపై ఆయన ప్రాజెక్టు అధికారులతో సమీక్ష నిర్వహించారు.పర్యటనలో భాగంగా మొదట జలాశయంలోని నీటిమట్టాన్ని తెలియజేసే ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, అనంతరం డ్యాం క్రస్ట్ గేట్ల విభాగాన్ని సందర్శించి గేట్ల నిర్వహణ విధానం, భద్రతా ఏర్పాట్లు, నీటి విడుదల నియంత్రణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే డ్యాం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి అక్కడ అమలు చేస్తున్న పర్యవేక్షణ వ్యవస్థల పనితీరుపై వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా సాగర్ ప్రాజెక్టు ఇంజనీర్లు ఆండాలు, కృష్ణయ్య, సత్యనారాయణలు జలాశయ ప్రస్తుత నీటిమట్టం, గేట్ల నిర్వహణ విధానం, నీటి విడుదల ప్రక్రియతో పాటు ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను చీఫ్ ఇంజనీర్‌కు వివరించారు.అనంతరం ప్రాజెక్టులో అమలు చేస్తున్న ఆధునిక టెలిమెట్రి వ్యవస్థను కూడా ఎం.ఎస్. సహారే పరిశీలించారు. ఈ వ్యవస్థ ద్వారా జలాశయ నీటి మట్టం, నీటి ప్రవాహం వంటి వివరాలను తక్షణమే పర్యవేక్షించే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రాజెక్టు నిర్వహణ, భద్రతా చర్యలు,సాంకేతిక వ్యవస్థల పనితీరును సమీక్షించిన చీఫ్ ఇంజనీర్ అధికారులు చేపడుతున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.



## హాకీ వరల్డ్ పోటీలకు సిఎంను ఆహ్వానించిన మంత్రి వాకిటి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 8 నుండి 14 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి వేదికగా హాకీ స్టేడియంలో జరగనున్న ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాలిఫై ఉమెన్ హాకీ టోర్నమెంట్ 2026 కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎండి సోనీ బాలా దేవిలు ఆహ్వానించారు.ఈ మేరకు గురువారం వారు సిఎంను కలిసి హాకీ టోర్నమెంట్ గురించి వివరించారు.

## 8న 'బమ్మకున్ - ఉద్- దౌలా'

9న కూకట్‌పల్లి నల్ల చెరువును ప్రారంభించనున్న సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 8వ తేదీన హైదరాబాద్ పాతబస్తీలోని 'బమ్మకున్ ఉద్ దౌలా చెరువును, 9వ తేదీన కూకట్‌పల్లి నల్ల చెరువును ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. హైడ్రా మొదట విడత చేపట్టిన 6 చెరువుల్లో ఇప్పటికే అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను గత ఏడాది సెప్టెంబరు 28న సిఎం ప్రారంభించిన విషయం తెలిసిందే. మరో మూడు చెరువులు(ఉప్పల్ నల్ల చెరువు, మాదాపూర్ లోని సున్నం చెరువు, తమ్మిడికుంట) నిర్మాణ దశలో ఉన్నాయి. వీటికి తోడు రెండో విడత మరో 14 చెరువులను హైడ్రా అభివృద్ధి చేయడానికి కసరత్తు చేస్తోంది. ఇలా హైదరాబాద్ నగరంలో మురికి కూపాలుగా మారిన చెరువుల రూపురేఖలు మార్చే పనిలో హైడ్రా నిమగ్నమైంది. చెరువులు, నాలాలను పరిరక్షించి వరదలు లేని, పర్యావరణహితమైన నగరాన్ని నిర్మించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఆ దిశగా హైడ్రా చెరువుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. నగరం నలువైపులా ఉన్న మరో 4 పెద్ద చెరువులను కూడా ట్యాంక్‌బండ్ తరహా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## డిజిటలేజేషన్ న్యాయ ప్రక్రియల్లో సాంకేతిక సహాయం అందిస్తాం

థింపులో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్‌ను కలిసిన సిజెఐ సూర్యకాంత్

**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ గురువారం థింపులో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్‌ను కలిశారు. భూటాన్ దేశంలో డిజిటలైజేషన్, డిజిటలైజేషన్ న్యాయ ప్రక్రియలలో ఉత్తమ పద్ధతుల అభివృద్ధికి సాంకేతిక సహాయం అందించడానికి సమగ్ర మద్దతును అందిస్తామన్నారు. న్యాయ సహకారం, న్యాయవిద్య, సాంకేతిక సవాళ్లు, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సవాళ్లను చర్చించడానికి సిజెఐ బుధవారం భూటాన్ ప్రధానమంత్రి షేరింగ్ టోగ్బే కూడా కలిశారని అధికారులు చెప్పారు. సుప్రీంకోర్టు విడుదల చేసిన ఒక ప్రకటన ఈ విషయాన్ని వెల్లడించింది. భారత దేశం, భూటాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ సహా ప్రేక్షకులను రాజు ఆహ్వానించారు. ఈ చర్చల్లో వీరిద్దరూ అభిప్రాయాలను మార్పిడి చేసుకున్నారని సుప్రీం కోర్టు ప్రకటన తెలియజేసింది. సైబర్ నేరాలు, డిజిటల్ మోసాల విషయంలో ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రధానమంత్రి టోబ్గే, భారత ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్ మధ్య జరిగిన చర్చల్లో చోటు చేసుకున్నాయని, వాటికి పరిష్కారాలు అన్వేషించారని ఆ ప్రకటన తెలిపింది. చర్చల సమయంలో భూటాన్‌లోని జెఎస్‌డబ్ల్యు స్కూల్ ఆఫ్ లా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను సులభతరం చేస్తామని సిజెఐ సూర్యకాంత్ భరోసా ఇచ్చారు.

## మాదిగ జాతికి కాంగ్రెస్ ద్రోహం : మంద కృష్ణమాదిగ



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** రాజ్యసభ సీట్ల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగ జాతికి నమ్మకద్రోహం చేశాడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మాదిగ జాతికి మరింత అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కాంగ్రెస్ హయాంలో జరగనంత తీవ్ర అన్యాయం రేవంత్‌రెడ్డి హయాంలోనే జరుగుతుందన్నారు. మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానాలు ఉన్న తెలంగాణలో ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించకుండా అన్యాయం చేశారని, ఈ మధ్యకాలంలో ఐదు ఎమ్మెల్సీలు భర్తీ చేస్తే ఎస్సీలలోని మాల సామాజిక వర్గానికి ఇచ్చి ఎస్టీలకు ఒకటి ఇచ్చి మాదిగలకు మాత్రం ఒక్కటి కూడా ఇవ్వలేదన్నాడు. ఇప్పుడు రాజ్యసభ సీట్లలో ఇవ్వకుండా మాదిగ జాతికి ద్రోహం చేశాడని మండిపడ్డారు. కర్ల రాజేష్ ఘటనలో గత 110 రోజులుగా ఉద్యమిస్తుంటే రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ద్రోహం చేసిన రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా ఈనెల 13 వరకు నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు డా.చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎంఆర్పిఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసిం హ మాదిగ, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దప్పు మల్లికార్జున్ మాదిగ ఎంఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తిక్ మాదిగ, ఇటిక శ్రీ కిషన్ మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.కొమ్ముశేఖర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి డా. పల్లెర్ల సుధాకర్ మాదిగ, ఎమ్మెస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జనపాల మహేష్ మాదిగతదితరులు పాల్గొన్నారు.

## విఎన్ఆర్, విజెఐఇటి కాలేజీ గుర్తింపు రద్దు చేయాలి

ఒయు జెఎసి నేతలు ఆర్.ఎన్ శంకర్, గడ్డం శ్యామ్ డిమాండ్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** విఎన్ఆర్, విజెఐఇటి కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని, సంస్థ చైర్మన్ సురేష్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఒయు జెఎసి నేతలు ఆర్.ఎన్ శంకర్,గడ్డం శ్యామ్ డిమాండ్ చేశారు. విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కాలేజ్ లో చదువుతున్న మహిళ విద్యార్థినిపై అదే కాలేజ్‌లో చదువుతున్న యువకులు మత్తు చాకెట్లు ఇచ్చి బలవంతంగా లైంగిక దాడి పాల్పడ ఘటనపై చైర్మన్ సురేష్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బుధవారం మహిళ కమిషన్‌కు పిర్యాదు చేశారు. అనంతరం వారు మహిళా కమిషన్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ నగరంలో ప్రఖ్యాతి గాంచిన కళాశాలగా ప్రచారం చేసుకుంటూ కోట్లాది రూపాయలు సంపాదిస్తూ మహిళల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన విఎన్ఆర్ విజ్ఞాన ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ దగ్గుపాటి సురేష్ నాయుడు, ప్రిన్సిపాల్ చెన్నకేశవరావు, సిడి నాయుడులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అక్టోబర్ 2024లో కళాశాలలోని డి.బ్లాక్ రూమ్ నెంబర్ 33లో బాధిత అమ్మాయికి మత్తు చాకెట్లు ఇచ్చి యువకులు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డారని, ఇదే విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్, డీన్‌లకు పలుమార్లు పిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆ బాధిత మహిళ ఆత్మహత్యయత్నం చేసిందని పేర్కొన్నారు. కళాశాల యజమాన్యం తమకున్న ఆర్థిక రాజకీయ పలుకుబడితో తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని వారి నిర్లక్ష్య కారణంగానే 18 నెలలుగా బాధిత విద్యార్థి నరకయాతన అనుభవించిందని, అందు వల్ల కళాశాల యాజమాన్యంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టబద్ధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కళాశాల ముందు ప్రత్యక్ష పోరాటం చేస్తామని హెచ్చరించారు. దాదాపు 3,000 మంది విద్యార్థులు చదువుతున్న కళాశాలలో విద్యార్థినిలకు రక్షణకు యజమాన్యం ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం సమాజంలో మహిళలను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర దాగుందని ఆరోపించారు.

## తీర్పు వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హుజూర్‌నగర్ శాసనసభ ఉప ఎన్నికల ప్రచార సమయంలో ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన అభియోగాలతో పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టేయాలంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ సుజన విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థినిగా ఉత్తమ్ భార్య పద్మావతి పోటీ చేశారు. ఎన్నికల ప్రచారానికి ఉత్తమ్ వెళ్లినప్పుడు జరిగిన రోడ్‌షో, చర్చిలో మీటింగ్, అనుమతి లేకుండా సమావేశం పెట్టారంటూ నాలుగు కేసులు నమోదు అయ్యాయని, వాటిని కొట్టేయాలని ఉత్తమ్ పిటిషన్ వేశారు.

## యుద్ధపరిష్కారానికి చైనా మధ్యవర్తిత్వం

పశ్చిమాసియాకు ప్రత్యేకదూత : వాంగ్ యీ

**బీజింగ్:** యుద్ధ పరిష్కారానికి మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేయడంకోసం పశ్చిమాసియాకు ఒక ప్రత్యేక దూతను చైనా పంపిస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉప ప్రధానమంత్రి–విదేశాంగమంత్రి షేక్ అబిదుల్ బిన్ జియద్ అల్ హసన్ నహ్యాన్, సౌదీ అరేబియా విదేశాంగమమంత్రి ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్‌సౌద్‌లతో చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ విడివిడిగా ఫోన్ సంభాషణలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వారికి మధ్యవర్తిత్వ ప్రయత్నాల గురించి తెలియజేశారు. ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై చైనా అనుసరిస్తున్న సూత్రబద్ధమైన వైఖరిని వారికి తెలియజేశారు. యుద్ధ విస్తరణ వల్ల ఏ దేశానికీ ప్రయోజనం లేదని, పైగా ఆయా దేశాలలో ఉన్న ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, ఈ సంఘర్షణలో పౌరులను రక్షించే విషయంలో ఆయాదేశాలు వారి ఉన్న పరిమితులను అధిగమించకూడదని వాంగ్ యీ ఫోన్ సంభాషణల్లో చెప్పారు. ఇంధనం, ఆర్థిక వ్యవస్థ, ప్రజల జీవనోపాధి వంటి సైనికేతర లక్ష్యాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ దాడులు చేయకూడదని, అదేవిధంగా ప్రపంచ రవాణాకు సంబంధించి ప్రజలకు కావాల్సిన సరుకులను ఒకచోట నుండి మరొక చోటకు తరలించే ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలూ కలగకూడదని ఆయన చెప్పారు. అదేసమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేస్తున్న శాంతి ప్రయత్నాలపట్ల నహ్యాన్‌కు తన ప్రశంసలు తెలియజేశారు. సంక్షోభాన్ని అధిగమించడానికి, ప్రాంతీయ భద్రతను కాపాడుకోవడానికి చర్చలు, దౌత్యం ఒక్కటే ప్రధాన మార్గమని పునరుద్ఘాటించారు. అదేవిధంగా జిసిసి (గల్ఫ్ కో–ఆపరేషన్ కౌన్సిల్) గురువారం నిర్వహించిన సమావేశంలో ప్రగతిని, ఆ ఫలితాలను కూడా ఆయన ప్రశంసించారు.

### తక్షణం ఇరాన్ దాడులు ఆపాలి
### జిసిసి–ఇ.యు ఉమ్మడి ప్రకటన

ఆరు రోజులుగా ఇరాన్ చేస్తున్న దాడులను గల్ఫ్ దేశాల సహకార మండలి, యూరోపియన్ యూనియన్ ఉమ్మడి సమావేశం తీవ్రంగా ఖండించింది. బహ్రైన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు సభ్యులుగా ఉన్న జిసిసి, యూరోపియన్ యూనియన్ ఉమ్మడి సమావేశానంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంత మాత్రం సమర్థనీయం కానీ దాడులను ఇరాన్ తక్షణం ఆపాలని సమావేశం కోరింది. జి.సి.సికి యూరోపియన్ యూనియన్ తన సంఘీభావాన్ని పునరుద్ఘాటించింది. పశ్చిమాసియా ప్రాంతీయ స్థిరత్వానికి తాము కట్టుబడి ఉన్నట్లు సమావేశంలో పాల్గొన్న మంత్రులు, దేశాధిపతులందరూ ఉద్ఘాటించారు. పశ్చిమాసియా ప్రాంతాన్ని, యూరోపియన్ యూనియన్ అభివృద్ధిని క్షీణింపజేసే అణు కార్యక్రమానికి దూరంగా ఉండాలని, బాలిస్టిక్ క్షిపణి తయారీ కార్యక్రమాలను నిలిపివేయాలని అనేక సార్లు తాము ఇరాన్‌కు విజ్ఞప్తి చేసిన విషయాన్ని మంత్రులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ విచక్షణారహితంగా దాడులు చేయడం, ఇళ్ళు, మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యవస్థలను ధ్వంసం చేయడం, సామాన్య ప్రజలకు భద్రత లేకుండా చేయడం, ఇళ్ళు కూల్చేయడం వంటి చర్యలన్నీ ఈ ప్రాంత అస్థిరతకు దారితీస్తాయని పేర్కొంటూ పునర్నిర్మాణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా ఇరాన్‌పై ఎదురు దాడులు చేయడానికి తమ తమ భూభాగాలను ఉపయోగించుకోకుండా చూసేందుకే ప్రాధాన్యత ఇవ్వాలని కూడా ఈ సమావేశం నిర్ణయించింది.

## పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల అబ్జర్వర్‌గా పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ హైకమాండ్ కీలక బాధ్యతలు అప్పగించింది. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక అబ్జర్వర్‌గా పొన్నం ప్రభాకర్‌ను నియమించినట్లు ఎఐసిసి జనరల్ సెక్రటరీ కెసి.వేణుగోపాల్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# బిహార్‌లో 'ప్రభుత్వం మార్పు' బిజెపి చేతికి సారధ్యం!

బిహార్ ముఖ్యమంత్రి, జెడి(యు) అధినేత నితీశ్‌కుమార్ రాజ్యసభలో కూర్చునేందుకు సంసిద్ధుడై రాజ్యసభ ఎన్నికలకు గురువారం నామినేషన్ దాఖలు చేయటంతో ఆ హిందీ భాషా రాష్ట్రంలో 'ప్రభుత్వం మార్పుకు' రంగం సిద్ధమైంది. ఆయన కొద్దిరోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా సమర్పిస్తారు. బిజెపి తన నామినీని అందలమెక్కిస్తుంది. నితీశ్ మోదీ ప్రభుత్వంలో మంత్రి అవుతారు. దీంతో బిహార్ రాజకీయాల్లో అత్యంత వెనుకబడిన కులాలు పునాదిగా నితీష్‌కుమార్ తాను కేంద్రంగా చాకచక్యంగా నడుపుతున్న 'సంకీర్ణ ప్రభుత్వ' రాజకీయాలు కొత్త దశలో ప్రవేశిస్తాయి. వారసత్వ రాజకీయాలను గట్టిగా వ్యతిరేకించిన నితీశ్‌కుమార్ తమ పార్టీ నాయకుల ఒత్తిడిపై తన కుమారుడు నిషాంత్ కుమార్‌ను రాజకీయాల్లోకి అనుమతించారు. అతను రాజకీయాలకు కొత్త అయినందున ప్రభుత్వ నాయకత్వాన్ని ఆశించలేరు. రాబోయే బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో అతను మంత్రి కావచ్చు, తండ్రి రాజీనామా తదుపరి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గంనుంచి ఎన్నిక కావచ్చు. అయితే పార్టీలో ఎందరో సీనియర్లు ఉండగా నిషాంత్ పార్టీని ఐక్యంగా నిలబెట్టగలడా, ఏకపక్ష ఆధిపత్యానికై ఎప్పటినుంచో వేచిచూస్తున్న బిజెపి నాయకత్వం జెడి(యు)ను చీల్చకుండా ఉంటుందా? ఆ పార్టీ సంకీర్ణ రాజకీయాలు నడిపే తీరును గమనించే ఎవరికైనా ఈ సందేహం కలుగకమానదు. తమ ఏలుబడిలోని రాష్ట్రాల్లో స్థానిక, ప్రాంతీయ పార్టీలను ఎన్‌డిఎ కూటమికి రాబట్టటం, ఆ తర్వాత వాటిని చీల్చటం, బలహీనపర్చటం బిజెపికి అలవాటైన విద్య. మహారాష్ట్ర దాని ఆధిపత్య రాజకీయ కుతంత్రాలకు చక్కటి ఉదాహరణ. బిజెపి ప్రతిపక్షంలో ఉండగానే శివసేన, ఎన్‌సిపిలను చీల్చింది. శివసేన నాయకుడు ఏక్‌నాథ్ షిండెని ముఖ్యమంత్రిని చేసింది. ఆయన నాయకత్వంలోనే ఎన్‌డిఎ కూటమి ఎన్నికల్లోకి వెళ్లింది. బిజెపి అత్యధిక సీట్లు గెలుచుకుని, షిండే క్లెయింని త్రోసివేసి తమ సొంత మనిషి దేవేంద్ర ఫడ్నావీస్‌ను ముఖ్యమంత్రి పీఠమెక్కించింది. ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో మరికొన్ని చిన్న కుటుంబ, కుల పార్టీలనూ నిర్వీర్యం చేసింది. బిహార్‌లో 2021 అసెంబ్లీ ఎన్నికల్లో రాంవిలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ ఎన్‌డిఎ లో భాగస్వామిగా ఉంటూనే నితీశ్‌కుమార్‌పై యుద్ధం ప్రకటించి జెడి(యు) అభ్యర్థులపై మాత్రమే తమ అభ్యర్థులను పోటీపెట్టి నితీశ్‌కుమార్ బలాన్ని దెబ్బకొట్టే ప్రయత్నం చేశాడు. చిరాగ్‌పై బిజెపి చర్య తీసుకోనందున అతనికి బిజెపి మద్దతు ఉన్నట్లు విదితమైంది. 2025 ఎన్నికల్లో జెడియు బలం తగ్గించేందుకు బిజెపి ప్రయత్నాలు ఫలించలేదు. నితీశ్‌కుమార్ నాయకత్వంలో బిజెపి, చిరాగ్ పాశ్వాన్ (ఎల్‌జెపి–ఆర్‌విపి) తదితరులతో కూడిన ఎన్‌డిఎ ఎన్నికల్లో పోటీ చేసింది. నితీశ్ బాబు ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని వాగ్దానం చేసింది. ఇంతలోనే ఆయన తొలగింపు ప్రజాతీర్పుకు వెన్నుపోటు అవుతుంది. అయితే ఆ పార్టీల మధ్య ఈ అవగాహన ఎన్నికల అనంతరం లోపాయికారిగా కుదిరినట్లు విదితమవుతున్నది. 243 మంది సభ్యులుగల బిహార్ అసెంబ్లీలో ఎన్‌డిఎ అనూహ్యంగా 202సీట్లు (జెడియు–85, బిజెపి– 89, ఎల్‌జెపి–19, ఆర్‌ఎల్‌ఎం–4, హెచ్‌ఎఎం–5) గెలుచుకున్నాయి.

> తూర్పు కారిడార్‌కు (యుపి, బిహార్, ఝార్ఖండ్ బెల్ట్) విస్తరించటానికి, పటిష్టం కావటానికి బిహార్‌ను తన ప్రత్యక్ష పాలనలోకి తెచ్చుకోవటం బిజెపికి ఎంతైనా అవసరం. బలమైన పశ్చిమ/ఉత్తర కేంద్రాలనుంచి ఈశాన్య భారత్‌లోకి విస్తరించటం బిజెపి దీర్ఘకాలిక వ్యూహం. అలయెన్స్ రాష్ట్రాలను బిజెపి నాయకత్వం కిందకు తెచ్చుకోవటం సులువవుతుంది. ఇప్పుడు బిహార్ పరిణామాలతో ఎన్‌డిఎలో బలాబలాల్లో మార్పు వస్తుంది. జెడి(యు) బలహీనపడుతుంది. దాంతో రాజకీయాలు సమానస్థాయితో సంప్రదింపులనుంచి ''కేంద్రీకృత నాయకత్వం'' కిందకు మారతాయి.

2024 లోక్‌సభ ఎన్నికల్లో 9 హిందీ భాషా రాష్ట్రాల్లో బిజెపికి అనూహ్యమైన ఎదురుదెబ్బ తగలటం గుర్తుచేసుకోదగింది. 2019 ఎన్నికల్లో ఆ రాష్ట్రాల్లోని 225 సీట్లలో బిజెపి 203 గెలుచుకుంది. అయితే 2024లో 55 సీట్లు కోల్పోయింది. పర్యవసానంగా లోక్‌సభలో బిజెపి 240 సీట్లతో మైనారిటీలో పడింది. టిడిపి, జెడి(యు) ప్రధాన మద్దతుదార్లుగా, శివసేన, ఎన్‌సిపి, మరికొన్ని చిన్నచితక పార్టీల అండతో మూడవసారి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో తూర్పు కారిడార్‌కు (యుపి, బిహార్, ఝార్ఖండ్ బెల్ట్) విస్తరించటానికి, పటిష్టం కావటానికి బిహార్‌ను తన ప్రత్యక్ష పాలనలోకి తెచ్చుకోవటం బిజెపికి ఎంతైనా అవసరం. బలమైన పశ్చిమ/ఉత్తర కేంద్రాలనుంచి ఈశాన్య భారత్‌లోకి విస్తరించటం బిజెపి దీర్ఘకాలిక వ్యూహం. అలయెన్స్ రాష్ట్రాలను బిజెపి నాయకత్వం కిందకు తెచ్చుకోవటం సులువవుతుంది. ఇప్పుడు బిహార్ పరిణామాలతో ఎన్‌డిఎలో బలాబలాల్లో మార్పు వస్తుంది. జెడి(యు) బలహీనపడుతుంది. దాంతో రాజకీయాలు సమానస్థాయితో సంప్రదింపుల నుంచి ''కేంద్రీకృత నాయకత్వం'' కిందకు మారతాయి. అంతేగాక బిజెపి ఆధిపత్య పార్టీగా ఉన్నప్పుడు చిన్నచిన్న మిత్రపక్షాలు తోక జాడించే అవకాశం ఉండదు.

అయితే నితీశ్‌కుమార్ బలహీనపడటం బిహార్ కుల రాజకీయ పొందికల్లో మార్పు తేవచ్చు. దాన్ని నిరోధించే ఉద్దేశంతో, నితీష్ వెనుకనున్న ఇబిసి, ఒబిసిలను తనవైపు రాబట్టుకునేందుకుగాను బిజెపి పై రెండు తరగతుల్లో ఏదో ఒక దానినుంచి ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎంపిక చేసే ఆలోచనలో ఉంది. నితీశ్ నిష్క్రమణతో బిహార్‌లో ఒక తరహా రాజకీయాల శకం ముగిసింది, బిజెపి ఆధిపత్య రాజకీయ శకం ఆరంభమవుతోంది. నితీశ్‌కుమార్ లాంటి ప్రాంతీయ నాయకులు లేకపోవటం ప్రతిపక్ష రాజకీయాలకు కూడా అవకాశాలు పెంపొందిస్తుంది. అయితే కులం కన్నా మత రాజకీయాల ప్రభావం పెరిగే ప్రమాదం ఉంటుంది.



## నియంత్రణ విధించే హక్కు లేదు

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న వివాదంపై తన వైఖరిని ప్రదర్శించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. 'ఇరాన్ ఒక స్వతంత్ర్య దేశం. అమెరికా దానిపై దాడి చేసింది; అది తప్పు. మరే ఇతర దేశంపైనా దాడి చేయడం తప్పు. ఏ దేశానికీ మరొక దేశంపై తన నియంత్రణను విధించే హక్కు లేదు. కొనసాగుతున్న యుద్ధం ప్రభావం రానున్న రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా పడవచ్చు. పరిస్థితి పెద్ద ప్రపంచ సంఘర్షణగా, బహుశా మూడవ ప్రపంచ యుద్ధానికి కూడా దారి తీయవచ్చు. పరిస్థితిని బాధ్యతతో ఎదుర్కొవాలి. దేశ వైఖరిపై తన వైఖ-రిని ప్రదర్శించ డం భారత ప్రభుత్వ బాధ్యత. కశ్మీరీ విద్యార్థులను స్వదేశానికి తీసుకు రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా

# ప్రతిమలు పేరుప్రతిష్ఠలకు ప్రతీకలా?



సంగిరెడ్డి హనుమంత రెడ్డి,
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

మన దేశంలో వైదికవాద మూర్తిపూజ విగ్రహ నిర్మాణాలకు మూలం. విగ్రహారాధన మౌర్య శకం అనగా ప్రస్తుత శకం 300లలో జైన బౌద్ధ మతాల ప్రభావంతో మొదలయింది. రాజుల విజయచిహ్నాల స్థాపనగా మారింది. విగ్రహస్థాపన ఆచారం వలసపాలనలో ఎక్కువయింది. ఐరోపా రాచరిక ఆరాధనకు సంకేతమయింది. భారత విగ్రహభూమిని ఆంబేద్కర్ విమర్శించారు. అయితే ఓట్ల కోసం, దళితులను దువ్వ డం కోసం ఈనాడు విగ్రహస్థాపన విస్తృతంగా జరుగుతోంది.

విప్లవాలకు నాయకత్వం వహించి విప్లవాలను విజయవంతం చేసినవారి, సంఘసంస్కర్తల, జాతీయ ఉద్యమ, చరిత్ర, సంస్కృతి నిర్మాతల విగ్రహాలను, స్మారక చిహ్నాలను నిర్మిస్తారు. విగ్రహ నిర్మాణానికి జాతీయ, అంతర్జాతీయ నియమాలు లేవు. మనకు సుప్రీం కోర్టు సూచనలు ఉన్నాయి. రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల అనుమతులు అవసరం. చట్టబద్ధత, క్రమబద్ధీకరణ, కళాత్మక, సాంకేతిక, సాంస్కృతిక, ఆచరాణాత్మక విషయాలను పరిగణించాలి. విగ్రహవ్యక్తి కీర్తి శేషులయి ఉండాలి. చారిత్రక ప్రసిద్ధిగాంచిన, పౌర, సైనిక, శాస్త్రవిజ్ఞాన, సాంస్కృతిక, సేవా రంగాలలో విశిష్ట కృషి చేసి పేరుమోసిన వ్యక్తుల విగ్రహాలనే స్థాపించాలి. వాతావరణానికి, పర్యావరణానికి హానిచేయని, శీతోష్ణ పరిస్థితులకు, వర్షాలకు తట్టుకునే పదార్థాలతో, కూలని విధంగా భద్రత కు ప్రాధాన్యతనిచ్చి విగ్రహ నిర్మాణాలు జరగాలి. మహారాష్ట్ర సింధుదుర్గ్ జిల్లా మాల్వాన్ రాజకోట లో ప్రధాని ప్రారంభించిన శివాజి విగ్రహం అతి త్వరగా 26.08.2024 న కూలింది. కుటుంబ స్మారకాలకు నియమాలు లేవు. యునైటెడ్ కింగ్డం (యుకె)లో మరణించిన 10 ఏళ్ళ తర్వాతే విగ్రహాలను నిర్మించాలి. విగ్రహాల ఎత్తు యుకె లో 8 అడుగులు, అమెరికా లో 11 అడుగులు మించరాదు. వ్యక్తుల చందాలు, స్వచ్ఛంద బహూకరణలు, రాజకీయ పక్షాల, ధార్మిక సంస్థల నిధులతో విగ్రహాలను నిర్మించాలి.

చారిత్రక ప్రసిద్ధ వ్యక్తుల, సామాజిక సంస్కర్తల విగ్రహాలు సమూహాలు సమైక్యతకు దారితీస్తాయి. విగ్రహవ్యక్తుల గౌరవ ప్రతిష్టలను, వారసత్వ విలువలను కొంత పెంచుతాయి. వారి విజయాలను శాశ్వతీకరిస్తాయి. నేటి, భావి తరాలకు పరివర్తనా స్ఫూర్తిని, ఉత్సాహ ఉద్దీపనలను కలిగిస్తాయి. అయితే ఈ విలువల పెంపుదల ప్రజల అవగాహనపై, అభిప్రాయాలపై, సామాజిక విలువలపై ఆధారపడి ఉంటుంది. విగ్రహవ్యక్తుల విజయాలు ఎవరికి మేలుచేశాయి, వాటి ప్రచార ఫలితాలు ఎవరికి అందుతాయి అన్నది ప్రధానం. విగ్రహాలు కొందరిని ఎన్నికల్లో గెలిపిస్తాయి. ప్రజలందరికి కాక కొన్ని కులాలకు, ఒక వర్గానికి మాత్రమే మేలుచేస్తాయి. వెనుక్కునెట్టబడినవారికి కీడు కలిగిస్తాయి. పాలకవర్గ జవాబుదారితనాన్ని తగ్గిస్తాయి. నిరంకుశత్వాన్ని పెంచుతాయి. పాలక, ప్రతిపక్ష పార్టీలకు ఇద్దరికీ వేరు వేరు అనుకూలతలను కల్పిస్తాయి. విగ్రహాల రూపంలో మతారాధనలు ఫాసిస్టు లక్షణాలు. నేటి ప్రజాస్వామ్య ప్రభుత్వాల ఈ పోకడలు అత్యంత అపాయకరం. ఆధునిక పాత్రికేయత ఈ ధోరణులకు మద్దతునిస్తోంది.

నేటి నేతలు మంచి భవిష్యత్తును కోరుకునే రాజనీతిజ్ఞులు కారు. తత్కాలీన స్వార్థ రాజకీయులు. స్వపక్ష పక్షపాతులు. నేటి నేతల విగ్రహాలు విలువలకు, విధానాలకు తిలోదకాలిచ్చాయి. మనుషులకు దివ్యత్వాన్ని ఆపాదించాయి. నాయకవ్యక్తిపూజ, విగ్రహారాధన ఆచారాలకు, దేశభక్తి పేరుతో కులమతాధార ఓట్ల సమీకరణకు, ఆధిపత్య కేంద్రీకరణకు, అధికార లబ్ధికి, కొనసాగింపుకు, సమాజ విభజనకు, సాంస్కృతిక చారిత్రక వక్రీకరణకు, అసమానతలకు దారితీస్తున్నాయి. విగ్రహ ప్రతిష్ఠాపకుల అభిప్రాయాలను, ఆలోచనలను ప్రతిబింబిస్తున్నాయి. విగ్రహవ్యక్తులను ఆకాశానికి ఎత్తుతాయి. సామూహిక మనో భావాలను చారిత్రక సత్యాలుగా చిత్రిస్తాయి. గుర్తింపులను, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి. భావితరాల అభిప్రాయాలను తప్పుదోవ పట్టిస్తాయి. ప్రజల మరుపుతో అసంఖ్యాక శ్రమజీవుల శ్రమను ఒక వ్యక్తికి కట్టబెడతాయి. విగ్రహనాయకుని రాజ్య భాగస్వామిగా, సమాజ భాగంగా చిత్రిస్తాయి. జాతిపిత స్థాయిలో నిలబెడతాయి. వీటికి భిన్నాభిప్రాయాలను దేశద్రోహంగా దిగజార్చుతాయి. పలు పూజాప్రక్రియలతో విగ్రహాల పట్ల భావోద్వేగాలను పెంచి మతారాధనలను స్థిరపరుస్తాయి. ఉద్యమాలలో కష్టజీవుల పాత్రను పక్కనబెట్టి ప్రత్యామ్నాయ విధానాలకు, ఆలోచనలకు తావు లేకుండా చేస్తాయి. ప్రజలను కలపవు. చీలుస్తాయి. ఇవి సర్వజన ప్రతీకలు, సమాజ సంస్కరణ చిహ్నాలు కావు. కులమత ప్రచారాల సాధనాలు. నేటి నేతల విగ్రహాలు నిరంకుశ రోమన్ చక్రవర్తుల బొమ్మలను గుర్తుచేస్తాయి. ఈ విగ్రహాల నిర్మాణ ఖర్చు చర్చనీయాంశం.

విగ్రహాలు స్థాపకుల ఆసక్తులను, అభిరుచులను తెలుపుతాయి. మెక్సికో, క్యూబాల లోని అబ్రహాం లింకన్ విగ్రహాలు ఆయన జాత్యహంకార వ్యతిరేకతకు, బానిసత్వ నిర్మూలనకు సంకేతాలు. హంగేరి, పోల్ండ లలో రొనాల్డ్ రీగన్ విగ్రహాలు ఆ దేశాల కమ్యూనిస్టు వ్యతిరేకతకు చిహ్నాలు. ప్రపంచ వ్యాపితంగా నెల్సన్ మండేల విగ్రహాలు ఆయన జాతివ్యతిరేకతకు గుర్తులు. పూర్వ సోవియట్ యూనియన్ లో జోసెఫ్ స్టాలిన్ విగ్రహాలు ఆయన రాజనీతిజ్ఞతకు, సోషలిస్టు రాజ్య నిర్మాణ కాంక్షదక్షతలకు, ప్రజా పక్షపాతానికి సంకేతాలు. పాలక ప్రేరణతో స్పెయిన్ లో స్థాపించిన ఆ దేశ నియంత ఫ్రాన్సిస్కో ఫ్రాంకో విగ్రహాలను ఇటీవల తొలగించారు. ప్రపంచ వ్యాపితంగా స్థాపించబడిన మన స్వాతంత్ర్య సమర యోధుడు మోహన్ చంద్ గాంధి విగ్రహాలు ఆయన అహింసావాదానికి, నిరాడంబరతకు, సత్యాగ్రహ పోరాట పద్ధతికి ప్రతీకలు. ఆయన ఎప్పుడూ అడుగుపెట్టని అమెరికాలో గాంధి విగ్రహాలు ఎక్కువగా ఉన్నాయి.

గాంధీయ అనుచర నాయకులు అమెరికాలో ఎక్కువగా ఉండటం అందుకు కారణం కావచ్చు. యుపిలో మాయావతి విగ్రహస్థాపనపై 2009 లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. ఆ వ్యాజ్యంపై 2025 జనవరిలో సుప్రీంకోర్టు తీర్పు యిచ్చింది. రాజకీయ పార్టీల గుర్తుల, నాయకుల విగ్రహాల నిర్మాణంలో ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయరాదని, ఈ విషయంలో ఎన్నికల సంఘం సూచనలను పాటించాలని ఆదేశించింది.

దేవుడే పూజారికి లొంగినట్లు ఎన్నికల సంఘం పాలకుల వశమైన వేళ ప్రజలకు దేవుడే (శూన్యమే)దిక్కు. పన్నుచెల్లింపుదారుల సొమ్మును నాయకుల ప్రచారానికి కాక ప్రజాసంక్షేమానికి వాడాలని సుప్రీం కోర్టుతో సహా అనేక కోర్టులు పలుమార్లు ఆదేశించాయి.

శిలాజీకరించిన విగ్రహాలు మాత్రమే విగ్రహవ్యక్తుల గౌరవప్రతిష్టలను పెంచవు. వారి ఆదర్శాల ఆచరణ వారికి నిజమైన నివాళి. విగ్రహవ్యక్తులు పనిచేసిన ప్రజారంగంలో ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ పరిధిలో విశేషంగా కార్యక్రమాలు జరిపి ప్రజలకు ఉపయోగపడటం శ్రేయస్కరం. ఆ వ్యక్తుల పేరుతో గ్రంధాలయాలను, పాఠశాలలను, ప్రయోగశాలలను, పరిశోధన సంస్థలను, రక్తనిధులను, వైద్యశాలలను, సామూహిక సమావేశ మందిరాలను స్థాపించాలి. విగ్రహప్రతిష్టతో సహా ఏ పథకమైనా సామాన్య ప్రజానీకానికి ప్రయోజనం చేకూర్చాలి. పాలక వర్గాల, బహుళజాతి సంస్థల కొమ్ము కాయరాదు.

## హక్కులు, న్యాయం, ప్రపంచ శాంతి కోసం

# మహిళల ఐక్య ఉద్యమాలు



డా॥ బి.వి. విజయలక్ష్మి

శతాబ్దానికి పైగా పూర్వం న్యూయార్క్‌లోని మాన్హాటన్ వీధుల్లో గడ్డకట్టే చలిలో మహిళా వస్త్ర కార్మికులు ప్రపంచాన్ని కుదిపేసే పరిమిత పని గంటలు అనే డిమాండ్ సాధన కోసం రోడ్ల పైకి వచ్చా రు. వారు కార్మిక వర్గానికి చెందిన మహిళలు. ఆకలితో, దోపిడీకి గురై, ఆర్థిక, సామాజిక న్యాయం లేకుండా గౌరవం సాధ్యం కాదని అవగతం చేసుకున్నవారు. ఆ చారిత్రాత్మక సమ్మె, నేడు మనం ఆచరిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి పునాది వేసింది. సోషలిస్టు నాయకురాలు Clara Zetkin వంటి నాయకుల స్ఫూర్తితో, ప్రేరణతో యూరప్, ఆసియా, క్లారా జెట్కిన్ అమెరికా అంతటా మహిళలు స్వీకరించిన మార్చి 8 వర్గపోరాటం, ఓటుహక్కు ఉద్యమాల నుంచి మహిళలకార్మిక వర్గ ఐక్యశక్తి నుంచి పుట్టుకొచ్చింది.

ఈ రోజు, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గుర్తుచేసుకుంటున్న వేళ, దాన్ని కేవలం ఆనవాయితీ వేడుకగా కాకుండా, పోరాటాల పిలుపుగా దాని మూలాలను అర్థం చేసుకుని భవిష్యత్ పోరాటాలకు ఉద్యమిద్దాం.

ఓటుహక్కు నుండి సోషలిజం స్థాపన వరకు : మహిళల విశ్వవ్యాప్తమైన పోరాటం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల ఉద్భవించలేదు. అది ఫ్యాక్టరీల నేల నుంచి, కార్మిక సంఘాల నుంచి, సోషలిస్టు మహాసభల నుంచి పుట్టుకొచ్చింది.

**మహిళలు డిమాండ్ చేసినవి :**

* ఓటు హక్కు * సమాన వేతనం
* పరిమిత పని గంటలు
* ప్రసూతి రక్షణ
* యుద్ధం బదులుగా శాంతి

1908లో న్యూయార్క్‌లోని దుస్తుల తయారీ కార్మికుల సమ్మెల నుంచి కోపెన్‌హేగన్ (డెన్మార్క్ దేశం రాజధాని)లో జరిగిన సోషలిస్టు మహిళా సదస్సుల వరకు, ఓటుహక్కు, కార్మిక హక్కుల ఉద్యమం విడదీయరాని సంబంధం కలిగినవి. అనేక దేశాల్లో మహిళలు ఓటు హక్కు పొందారు. అది వారికి కానుకగా ఇవ్వబడలేదు. వారు సంఘటితమై, ర్యాలీలు నిర్వహించి, సమ్మెలు చేసి సాధించారు.

1975లో అంతర్జాతీయ మహిళా సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి మార్చి 8ను అధికారికంగా గుర్తించడం, కార్మిక వర్గ మహిళలు ఇప్పటికే చరిత్రగా నిలబెట్టిన పోరాటానికి సంస్థాగత గుర్తింపు మాత్రమే. కానీ గుర్తుంచుకోవాల్సిన హక్కులు పాలక వర్గాలు ఇచ్చినవికాదు; పోరాడి సాధించుకున్నవే.

**భారత్–వర్గపోరాటంలో మహిళల అగ్రగామి పాత్ర :**

భారతదేశంలో మహిళలు చరిత్రలో నిష్క్రియ పాత్రధారులుగా ఎప్పుడూ లేరు.. బ్రిటిష్ వలసవాదుల వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటంలో, చారిత్రాత్మక మహత్తర తెలంగాణా సాయుధ పోరాటంలోను, కేరళలోని పున్నప్ర వయలార్ మరియు బెంగాల్లోని తేభాగా ఉద్యమాల్లో, రైతు తిరుగుబాట్లలో వారు భుజానికి భుజం కలిపి నిలబడ్డారు. వ్యవసాయ కార్మికుల నుంచి ఫ్యాక్టరీ కార్మికుల వరకు, అంగన్వాడీ కార్యకర్తల నుంచి ఉపాధ్యాయులు, నర్సుల వరకు – మహిళల హక్కుల సాధనకై నిర్విరామ పోరాటాలు చేస్తూనే ఉన్నారు.

ప్రస్తుత వాస్తవాలు మరింత తీవ్రంగా ఉన్నాయి : భారతదేశ కార్మిక శక్తిలో 93% అసంఘటిత రంగంలో ఉంటే, అందులో దాదాపు 50% మహిళలే. ఈ మహిళలు పొలాల్లో, నిర్మాణ ప్రదేశాల్లో, ఇళ్లలో, వస్త్ర యూనిట్లలో, మందుల తయారీ రంగంలో, ఎలక్ట్రానిక్ రంగంలో, పాఠశాలల్లో, ఆసుపత్రుల్లో, సంక్షేమ పథకాలలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నారు. అయినప్పటికీ విధానాపర నిర్ణయాలలో వీరికి భాగస్వామ్యం ఉండదు. వారు కనిపించరు.

**కార్మిక కోడ్లు : సంస్కరణలా, తిరోగమన విధానాలా?**

కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా క్రోడీకరించారు.

* పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020 * వేతనాల కోడ్ 2019
* వృత్తిపరమైన ప్రమాదాల నుండి రక్షణ, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020 * సామాజిక భద్రత కోడ్ 2020

వ్యాపారం చేయడంలో సౌలభ్యం పేరిట ప్రభుత్వం వీటిని సమర్థించుకుంటుంది.

కానీ ఎవరికోసం? ఎలాంటి మూల్యంతో?

కార్మికులు వంద సంవత్సరాలకు పైగా శ్రమతో, పోరాటాలతో, అనేక త్యాగాలతో అనేక హక్కులు, సౌకర్యాల చట్టాలు సాధించుకున్నారు. ఈ పోరాటాల, త్యాగాల ఫలితాలను కేవలం నాలుగు కోడ్ల పేరుతో తుడిచి వేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తే కార్మికుల ఆగ్రహానికి గురి కాక తప్పదు.

**మహిళా కార్మికుల దృష్టిలో ప్రధాన ఆందోళనలు :**

* సార్వత్రిక ప్రసూతి హక్కు లేదు

1961 మాతృత్వ ప్రయోజన చట్టం కొన్ని సంస్థల్లో చెల్లింపు ప్రసూతి సెలవును హామీ ఇచ్చింది. కొత్త విధానంలో మహిళా కార్మికులకు – ముఖ్యంగా అసంఘటిత లేదా కాంట్రాక్ట్ ఉద్యోగాల్లో ఉన్నవారికి – ప్రభుత్వం నుంచి ఏ విధమైన సార్వత్రిక హామీ లేదు.

* ఉద్యోగ భద్రత లోపం



నిర్దిష్ట కాలపరిమితి ఉద్యోగాల పెరుగుదలతో, గర్భిణీ లేదా వివాహిత మహిళల ఒప్పందాలు పునరుద్ధరించకపోవచ్చు.

* వేతనం మరియు అదనపు పని గంటల సమస్య

పని గంటలు పెరిగినా, తగిన అదనపు వేతనం అందకపోవడం అనేక ప్రాంతాల్లో కనిపిస్తోంది.

> మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం

* సేవా ప్రయోజనాల అనిశ్చితి

తక్కువకాల ఒప్పందాల వల్ల గ్రాట్యుటీ, భవిష్యనిధి వంటి ప్రయోజనాలు అనిశ్చితంగా మారుతున్నాయి.

* కార్మిక తనిఖీల బలహీనత

ఇన్స్‌పెక్టర్ కమ్ ఫెసిలిటేటర్ విధానంతో కార్మిక చట్టాల అమలు సడలింపబడింది. కాగితాలపై హక్కులు ఉన్నా, అమలులో భద్రత లేదు.

ఇది కార్మిక సంస్కరణ కాదు — కార్మిక వర్గ ఖర్చుతో కార్మికుల శ్రమ దోపిడీ.

**లింగ అసమానత, మానవ అభివృద్ధి**

యుఎన్డిపి మానవ అభివృద్ధి నివేదిక 2023–24 ప్రకారం, భారతదేశ మానవ అభివృద్ధి సూచీ (HDI) 0.644 – 193 దేశాల్లో 134వ స్థానం.

లింగ అసమానత సూచీలో భారత్ 108వ స్థానంలో ఉంది.

గ్లోబల్ జెండర్ గ్యాప్ సూచీ 2025లో భారత్ 148 దేశాల్లో 131వ స్థానంలో నిలిచింది – కేవలం 64% లింగ సమానత్వం మాత్రమే సాధించబడింది.

పురుషులతో పోలిస్తే శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉంది – ఇది నిర్మాణాత్మక ఆర్థిక బహిష్కరణకు సంకేతం. లింగ న్యాయం లేకుండా అభివృద్ధి అసంపూర్ణం.

**ఆలస్యమైన న్యాయం : ప్రత్యూష కేసు**

2002లో టాలీవుడ్ నటి ప్రత్యూష పై జరిగిన అత్యాచారం మరియు హత్య దేశాన్ని కుదిపేసింది. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని లొంగిపోవాలని కోర్టు తుది తీర్పు ఆదేశించడానికి 24 సంవత్సరాలు పట్టింది.

ఒక తరం గడిచాక వచ్చే న్యాయం — అది నిజమైన న్యాయమా?

అనేక మహిళల విషయంలో ఆలస్యమైన న్యాయం, మరింత అన్యాయంగా మారుతోంది.

**1975: అంతర్జాతీయ మహిళా సంవత్సరం, ICDSకు 50 సంవత్సరాలు**

1975ను ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించినప్పుడు, భారత్ సమగ్ర శిశు అభివృద్ధి సేవలు ప్రారంభించింది. Integrated Child development Services (ICDS) మాతృ మరియు శిశు మరణాలను తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషించింది.

అయితే, ఐదు దశాబ్దాల తరువాత కూడా లక్షలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు గౌరవ వేతనం మీదే పనిచేస్తున్నారు — సరైన జీతం లేకుండా, ఉద్యోగ భద్రత లేకుండా, కేవలం వలంటీర్లుగా చేస్తున్నారు. దీనిని బట్టి మహిళాభివృద్ధి పట్ల ప్రభుత్వాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుంది. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని కొన్ని పార్టీలు వాచాలత్వం ప్రదర్శిస్తాయి. కేవలం రెండు వేల రూపాయల జీతంతో పని చేసే మధ్యాహ్నభోజన కార్మికుల స్థితిగతులు వీరికి అస్సలు కనపడవు. ఇదే మన కాలం యొక్క విరుద్ధ స్వభావం.

**బ్రెడ్ మరియు శాంతి నుంచి నేటి యుద్ధాల వరకు**

ప్రథమ ప్రపంచ యుద్ధ విధ్వంసంలో మహిళలు అన్నం మరియు శాంతి (బ్రెడ్ అండ్ పీస్) కోరారు. ఈ రోజు మళ్లీ ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు కొనసాగుతున్నాయి. గాజాలో గత మూడు సంవత్సరాల్లో 70,000 మందికిపైగా మరణించారు. ఉక్రెయిన్ మరియు రష్యాలో వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. సామ్రాజ్యవాద యుద్ధాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తాయి; భవిష్యత్తులను నాశనం చేస్తాయి. 2026లో కూడా అంతర్జాతీయ మహిళా దినోత్సవ పిలుపు ప్రతిధ్వనిస్తోంది : **అన్నం, శాంతి, న్యాయం**

**ప్రపంచ మహిళల్లారా — ఐక్యమవ్వండి**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆనవాయితీ వేడుక కాదు — ఇది ప్రతిఘటన దినం.

కార్మిక అస్థిరతకు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళల నుంచి, పోషణ మరియు ఆరోగ్యం కోరుతున్న తల్లుల వరకు, న్యాయం కోసం పోరాడుతున్న బాధితుల నుంచి, యుద్ధానికి వ్యతిరేకంగా నిలుస్తున్న సమాజాల వరకు — మన పోరాటాలు పరస్పర సంబంధితమైనవి.

**మన సంకల్పాన్ని పునరుద్ఘాటిద్దాం :**

* కార్మిక హక్కుల పరిరక్షణకు
* సార్వత్రిక ప్రసూతి మరియు సామాజిక భద్రతకు
* మహిళలపై నేరాలకు వేగవంతమైన న్యాయానికి
* సంక్షేమ పథకాలను హామీ హక్కులుగా మార్చడానికి
* సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా, ప్రపంచ శాంతి కోసం

శతాబ్దం క్రితం మహిళలు అనుమతి కోసం ఎదురుచూడలేదు. వారు నడిచారు, చరిత్ర మారింది.

అదే స్ఫూర్తితో ముందుకు సాగుదాం.

హింసకు వ్యతిరేకంగా హక్కుల సాధనకై, న్యాయం, ప్రపంచ శాంతికోసం మహిళల ఐక్య ఉద్యమాలు నిర్మిద్దాం. కలిసి నడు ద్దాం.

8 మార్చి 2026.

## నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

-ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** నిర్మాణంలో ఉన్న భవన ప్రమాద ప్రాంతాన్ని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ వెల్దండి పరిశీలించారు. టోలీచౌకి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనంలో కర్రల నిర్మాణం కూలిపోవడంతో కార్మికులు కిందపడిపోయి పలువురు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారు. ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేస్తూ, గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందేలా అధికారులతో మాట్లాడారు. భవన నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/దూల్‌పేట్:** భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దూల్‌పేట్‌లోని బడాబంగ్లా, మంగళ్‌హాల్ తదితర ప్రాంతాల్లో ఎస్‌టీఎఫ్ఏ బృందం, దూల్‌పేట్ ఆబ్కారీ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ ఇంట్లో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 1.394 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు



హోటల్ నిర్వాహకులకు నోటీసులు

**ప్రజాపక్షం/సీతాఫల్‌మండి:** హోటళ్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే వారాసిగూడ, సీతాఫల్‌మండి ఏరియాలోని లక్కీ బిర్యానీ హౌస్, సప్తమి గ్రాండ్ హోటల్‌లో కిచెన్ డైనింగ్ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత నాణ్యత గూరించి తనిఖీలు చేయడం జరిగింది. తనిఖీలలో భాగంగా సంబంధిత హోటళ్లకు నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్ జ్యోతి, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ స్వాతి, సానిటేషన్ ఇంచార్జ్ నాగమణి, వినయ్ కుమార్. సూపర్‌వైజర్లు దశరథ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## యాక్షన్‌ప్లాన్ విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులు యాక్షన్ ప్లాన్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ జెడసీ మంద మకరంద్ అధికారులకు అదేశించారు. ఈనెల 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు నిర్వహించనున్న ప్రజా పాలనపట్టణ ప్రణాళిక కార్యక్రమంపై జోన్ జోనల్ కమిషనర్ మంద మకరంద్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం చాంద్రాయణగుట్ట సర్కిల్ లోని హఫీస్ బాబానగర్, కంచన్‌బాగ్ వార్డులో క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి అక్కడి ఇంటింటి చెత్త సేకరణ, రోడ్ల స్వీపింగ్ , పాదాచారుల పై వంతెన పారిశుధ్యం పరిశీలించారు.

## వేంనరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేంనరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసిన సందర్భంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మృతికి టిజిఒ సంతాపం



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ మృతికి గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టిజిఒ) సంతాపం తెలిపింది. కడ్తాల్ లోని జైపాల్ యాదవ్ నివాసంలో టిజిఒ హైదరాబాద్ శాఖ ఎంబి కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఆయన తల్లిని కలిసి తమ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగం శివధర్ రెడ్డి, యాదవ సంఘం నాయకులు వెంకటనర్సయ్యయాదవ్ ,బి.రాములు యాదవ్, శంతన్న యాదవ్, శ్రీనివాస్ యాదవ్,టిజిఒ హైదరాబాద్ శాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ కొత్త విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫస్టియర్ పరీక్ష ప్రశాంతం

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం సంవత్సరం గణితం పరీక్షకు 57553 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 59630 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా జనరల్ పరీక్షకు 54044 మంది, వొకేషనవొకేషనల్ పరీక్షకు 3509 మంది హాజరయ్యారు. జనరల్‌లో 1291 మంది, వొకేషనల్‌లో 786 మంది విద్యార్థులు గైర్హాజరు. మొత్తం 2077మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

# అభయాంజనేయ ఆలయ నిర్మాణ వివాదం

*తెరపైకి అక్బర్ ప్రాపర్టీస్ వ్యవహారం?*
*ఎన్ని గజాల స్థలంలో ఆలయం నిర్మిస్తున్నారు?*
*రాష్ట్రీయ వానరసేన ప్రతినిధుల నిరసన*



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:**మరోమారు అక్బర్ ప్రాపర్టీస్ భూ వ్యవహారం అనూహ్యంగా చర్చకు దారితీసింది. ఫిల్మ్‌నగర్‌లో అక్బర్ ప్రాపర్టీస్‌కు అప్పటి ప్రభుత్వం కేటాయించిన స్థలంలోని అభయాంజనేయ స్వామి ఆలయం నిర్మాణం విషయంలో గతంలో చోటుచేసుకున్న వివాదాల వ్యవహారం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆలయం నిర్మించే విషయంలో గుంటూరుకు చెందిన శివస్వామి బిల్డర్లతో చేసుకున్న అగ్రిమెంట్ల వ్యవహారంతో మరోమారు వివాదం తెరపైకి వచ్చింది. ముందుగా రెండు వేల గజాల స్థలంలో ఆలయం నిర్మిస్తామని ఒప్పందం చేసుకున్నారని.. అయితే 1,300 గజాల స్థలంలోనే ఆలయం నిర్మిస్తున్నారన్న విషయం వెలుగులోకి రావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయంలో రాష్ట్రీయ వానరసేన ప్రతినిధులు గురువారం ఆలయం నిర్మించే స్థలం వద్దకు చేరుకుని అగ్రిమెంట్ ప్రతులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఆలయం కూల్చిన అదే స్థలంలో తిరిగి నిర్మిస్తామని చెప్పి బిల్డర్లతో రెండు అగ్రిమెంట్లు చేసుకుని హిందూ సమాజాన్ని, స్థానిక ప్రజలను శివస్వామి తప్పుదోవ పట్టిస్తున్నారని రాష్ట్రీయ వానరసేన ఆరోపించింది. రెండు వేల గజాల్లో ఆలయం నిర్మిస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం కేవలం పదమూడు వందల గజాల్లోనే నిర్మాణం జరుగుతుందని వారు తెలిపారు. ఈ విషయంపై రాష్ట్రీయ వానరసేన ప్రశ్నించగా దమ్ముంటే వచ్చి చర్చించండి అని శివస్వామి అన్నారని... అందుకే చర్చించేందుకు తాము వచ్చామని రాష్ట్రీయ వానరసేన సభ్యులు ఆయన కార్యాలయానికి వెళ్లి బహిరంగ లేఖ అందించేందుకు యత్నించారు. అయితే శివస్వామి ఆలేఖను స్వీకరించేందుకు సంసిద్ధత చూపకపోవడంతో రాష్ట్రీయ వానరసేన సభ్యులు ఆ లేఖను కార్యాలయ గోడకు అతికించారు. ఈ సమయంలో శివస్వామి బయటకు రాకుండా లోపలే ఉండి తన అనుచరులను బయటకు పంపించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నించారని వానరసేన ప్రతినిధులు ఆరోపించారు. ఈ క్రమంలోనే శివస్వామి పోలీసులకు సమాచారం అందించడంతో పరిస్థితులను పోలీసు అధికారులు పర్యవేక్షించారు. ఇదిలాఉండగా.. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు కార్యాలయం లోపలికి వెళ్లకుండా బయటనే నిరసన వ్యక్తం చేసినట్లు రాష్ట్రీయ వానరసేన సభ్యులు తెలిపారు.

# తాగునీటి సరఫరాలో అంతరాయం

### 36 గంటల పాటు సరఫరా బంద్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరాఫేజ్3, పెద్దాపూర్ పంప్‌లోని పంప్‌హౌస్‌లో పాత హైటెన్షన్ ఎలక్ట్రికల్ ప్యానెల్స్‌ను తొలగించి వాటి స్థానంలో కొత్త ప్యానల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. పెద్దాపూర్ నుంచి సంగాపూర్ వరకు ఉన్న 1,600 మిమీ డయా పంపింగ్ మెయిన్ పైప్‌లైన్‌లోని ఎయిర్ వాల్వ్‌ల మార్పు తదితర పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మరుసటి రోజు రాత్రి 8 గంటల వరకు మరమ్మత్తు పనులుచేపడతారు. ఇందులో భాగంగానే 36 గంటల పాటు కొన్ని ప్రాంతాల్లో లోప్రెజర్, మరికికొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ క్రమంలోనే షేక్‌పేట్ రిజర్వాయర్‌కు నీటి సరఫరా పూర్తిగా నిలిపివేస్తారు. భోజగుట్ట ప్రాంతానికి తక్కువ స్పీడ్‌తో నీటి సరఫరా జరుగుతుంది. మణికొండ, కోకాపేట్, నార్సింగి, మంచిరేవుల తదితర ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదు. కావున వినియోగదారులు పొదుపుగా నీటిని వాడుకోవాలని జలమండలి అధికారులు సూచించారు.

## గ్లాకోమా ఇనిస్టిట్యూట్ ప్రారంభం



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో:** ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యశాలలో గురువారం 'కళత్తూర్ వేణుగోపాల్ రెడ్డి గ్లాకోమా ఇనిస్టిట్యూట్' ప్రారంభం అయింది. గ్లాకోమా చికిత్స పరిశోధనల కోసం అత్యాధునిక ఈ ఇనిస్టిట్యూట్‌ను బంజారా హిల్స్‌లోని కల్లం అంజిరెడ్డి క్యాంపస్‌లో దివంగత కళత్తూర్ వేణుగోపాల్‌రెడ్డి సతీమణి మల్లికారెడ్డి తన కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు. 'అకాడెమియో ఆప్తాల్మోలాజికా ఇంటర్నేషనలిస్ట్' చైర్‌కు తాజాగా ఎన్నికైన డాక్టర్ సెంథిల్ ఈ సంస్థకు నేతృత్వం వహిస్తారు. కళత్తూర్ వేణుగోపాల్ రెడ్డి గ్లాకోమా వ్యాధితో పోరాడి చివరకు చూపు కోల్పోయారు. ఈ పరిస్థితి ఎవరికి రాకూడదని, ఈ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు చికిత్స అందించాలనే ఆయన ఆశయ సాధన కోసం ఈ సంస్థను ప్రారంభించారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఖర్జూర పండ్ల పంపిణీ

**ప్రజాపక్షం/ వెల్దండ :** ముస్లీం సోదరులు పవిత్ర మాసంగా జరుపుకునే రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిలు అన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో రంజాన్ మాసం ఉపవాసదీక్షలు చేపడుతున్నా ముస్లీం సోదరులకు ఖర్జూర పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి, ప్రేమ, ఐక్యతకు ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ మాసాన్ని ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక స్ఫూర్తిని కల్గిస్తుందని, ప్రతి రోజు ఉపవాసాలు ఆచరిస్తూ మనసును పవిత్రంగా ఉచ్చుకోవడం, ప్రేమ కరుణ, దానం వంటి గోప్ప విలువలను ఆచరణలో పెట్టడం రంజాన్ మాసం గొప్పతనమని, ఖర్జూర పండ్లను పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

## ఎఐసిసి ఒబిసి విభాగం చైర్మన్ డా.అనిల్ జైహింద్‌కు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/సోమాజిగూడ:**ఎఐసిసి ఒబిసి విభాగం చైర్మన్ డా.అనిల్ జైహింద్ యాదవ్ అధికారిక పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాద్ చేరుకొన్నారు. ఈ సందర్భంగా ఆలిండియా ఒబిసి ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ, ఆలిండియా ఒబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు కిరణ్‌కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ ఒబిసి కన్వీనర్ డా.కేతూరి వెంకటేశ్, తెలంగాణ ఒబిసి వైస్ ప్రెసిడెంట్ రాజేశ్, ఒబిసి నేతలు మధు బాబు, డా. అరుణ్ కేతన్ తదితరులు ఆయనకు హైదరాబాద్ విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఒబిసి సెల్ కార్యక్రమాలలో అనిల్ జైహింద్ పాల్గొంటారని ఆళ్ల రామకృష్ణ తెలిపారు. సాయంత్రం హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో ఒబిసి విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులతో సమావేశమవుతారన్నారు. సమావేశంలో వివిధ బిసి సంఘాల నేతలు, విద్యార్థులు, అధ్యాపకులు ఒబిసి సంక్షేమం, సామాజిక న్యాయం అంశాలపై చర్చిస్తారని ఆళ్ల రామకృష్ణ పేర్కొన్నారు.

## ఎండాకాలం దృష్ట్యా ఎంఎంసిలో.. పారిశుధ్య కార్మికుల పని సమయాల్లో మార్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రత కోసం పని సమయాల్లో స్వల్ప మార్పులు చేసినట్లు మల్కాజిగిరి నగరపాలక సంస్థ అదనపు సి.ఎన్. రఘుప్రసాద్ తెలిపారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే కార్మికులు అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి గురికాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కొత్త సమయాల ప్రకారం ఉదయం హాజరు నమోదు ఉదయం 5 గంటల నుండి 6 గంటల వరకు ఉంటుంది. మధ్యాహ్నం హాజరు నమోదు సమయం మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంట వరకు నిర్ణయించారు. ఇంతకు ముందు మధ్యాహ్న హాజరు నమోదు సమయం మధ్యాహ్నం 1 గంట నుండి 2 గంటల వరకు ఉండేది. అయితే ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఒక గంట ముందుగానే హాజరు నమోదు చేయాలని నిర్ణయించినట్లు రఘుప్రసాద్ తెలిపారు.

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా శ్యామ్ ప్రసాద్‌లాల్



**ప్రజాపక్ష/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా శ్యామ్ ప్రసాద్‌లాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యాక్రమంలో ఆయన జిల్లా పరిషత్ సిఈఓ,ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ దేవ సహాయం నుంచి బాధ్యతలు స్వీకరించారు.మొదటగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిలా అభివృద్ధి కార్యక్రమాలు ముఖ్యంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణపై చర్చించారు. జిల్లా లో గ్రామీణాభివృద్ధి మౌళిక వసతుల మెరుగుదల ,సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషించాలని,ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ అధికారులతో సూచించారు. జిల్లా అధికారులు,వివిధ శాఖల అధికారులు,తదితరులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ జీవి శ్యామ్ ప్రసాద్ లాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.కలెక్టర్ నాయకత్వంలో జిల్లాలోని కార్యక్రమాలు మరింత వేగవంతంగా కొనసాగేందకు అధికారుల సమన్వయంతో పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ తెలిపారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ కు చెందిన శ్యామ్ ప్రసాద్ లాల్ మహాత్మ జ్యోతిబాపూలే విద్యా సంస్థల జాయింట్ కార్యదర్శిగా పని చేశారు.

## గద్వాల నడిబొడ్డున 'శ్రీ కృష్ణ గ్రౌండ్' బలిపీఠం

**ప్రజాపక్షం/గద్వాల్ :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సరిహద్దు గడ్డ.. గద్వాల పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రంగుల పండుగ హోలీ వేళ, లోకమంతా సంబరాల్లో మునిగితేలుతుంటే.. బతుకుదెరువు కోసం వేల మైళ్ల దూరం నుంచి వచ్చిన ఒక నిరుపేద వలస కార్మికుడు ఉరితాడుకు బలయ్యాడు. పట్టణంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన పోస్ట్ ఆఫీస్ సమీపంలో గత 'శ్రీ కృష్ణ గ్రాండ్' హోటల్ లో పనిచేస్తున్న ఉత్తర ప్రదేశ్ వాసి స్వరాజ్ (28), తన అద్దె గదిలో కిటికీకి శవమై వేలాడటం స్థానికంగా పెను సంచలనం సృష్టిస్తోంది. మధ్యాహ్నం వరకు అందరితో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్న స్వరాజ్, అంతలోనే అంతటి కఠిన నిర్ణయం తీసుకోవడం వెనుక ఉన్న అసలు కారణం ఏంటి? నిన్న మధ్యాహ్నం భీం నగర్ లోని తన అద్దె గదికి యువకుడు, అన్న ప్రశ్నలు గద్వాల గల్లీల్లో వినిపిస్తున్నాయి.

## ఏళ్ల నాటి సొంతింటి కల నెరవేరింది

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి నిర్మాణం కోసం కలలుగన్న మా కుటుంబానికి నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి మాకు ఓ సొంత గూడును ఏర్పాటు చేసుకునేందుకు 5 లక్షల రూపాయలు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్‌రెడ్డికి, వనపర్తి నిరుపేదల ఆశాజ్యోతి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు అంటూ ఇందిరమ్మ ఇంటి లబ్దిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గురువారం వనపర్తి మండలం అచ్చుతాపురం గ్రామానికి చెందిన జయమ్మ చంద్రశేఖర్ గౌడ్, బాలమ్మ రామస్వామి, నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి వనపర్తి శాసనసభ్యులు అందించి అభినందించారు. అనంతరం పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన మేకల వెంకటయ్య తిరుపతమ్మ, ఈడిమాకుల కృష్ణయ్య నారమ్మ గౌరీ కురుమూర్తి లక్ష్మీ ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశానికి హాజరై దంపతులకు నూతన వస్త్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులుస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మండల మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, మండల అధ్యక్షులు రవి కిరణ్, న్యాయవాది తిరుపతయ్య, పిసిసి సభ్యులు శంకర ప్రసాద్, గ్రామ నాయకులు పాపిరెడ్డి, పెద్దమందడి మాజీ జెడ్పిటిసి , మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సత్యారెడ్డి, సర్పంచు స్వరూప వెంకటస్వామి, దొడగుంటపల్లి సర్పంచు పెంటయ్య, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, సుదర్శన్, చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఇందిరమ్మ ఇంటి లబ్దిదారులు పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల వేతన పెంపునకు కలిసి రావాలి

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మోషే

**ప్రజాపక్షం/అమరచింత :** బీడీ కార్మికుల వేతన ఒప్పందం ఈనెల 14న ముగుస్తున్న నేపథ్యంలో కార్మికులందరూ ఐక్యమత్యమై పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ కార్యదర్శి మోషే పిలుపునిచ్చారు. గురువారం అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని సిపిఐ కార్యాయంలో తెలంగాణ బీడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోష మాట్లాడుతూ వనపర్తి జిల్లాతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని బీడీ కార్మికుల అందరి సమక్షంలో ఫ్యాక్టరీ యజమానులతో ప్రతి రెండేళ్ల కోసారి వేతన ఒప్పందం చేసుకుంటామని తెలిపారు. కార్మికులకు కూలీ రేట్లు పెంచేందుకు మరో ఒప్పందం కోసం యజమానులతో జరిగే పోరాటంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కార్మికులందరూ తమతో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 14న డిమాండు నోటీసు అందజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ తెలంగాణ బీడీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి భాస్కర్ , సౌలు, ఇజ్రాయిల్ తదితరులు ఉన్నారు.

## ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక




**ప్రజాపక్షం/వనపర్తి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని వనపర్తి జిల్లాలో పకడ్బందీగా అమలు చేసి విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయడం జరిగిందని, గ్రామ, పట్టణాల్లో ప్రజలకు లబ్ది చేకూర్చిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అదే విధంగా చేయడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పరిశుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్‌అలైవ్ , సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళలు, పర్యావరణం వంటి ప్రభుత్వ రంగాలకు సంబంధించిన 10 థీమ్‌లు ఉంటాయని, ప్రతి థీమ్ కొరకు నోడల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి కార్యక్రమాన్ని డాక్యుమెంటేషన్ చేయాలని, పని చేయక ముందు, పని చేశాక జరిగిన కార్యక్రమ ఫోటోలు, వీడియోలు తీసుకొని డాక్యుమెంటేషన్ చేయాల్సిందిగా ఆదేశించారు. రోజువారీ కార్యక్రమాలు నివేదిక రూపంలో అందచేయాల్సి ఉంటుందని సూచించారు. మార్చి 6 నుండి 15 వరకు పరిశుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్ అనే థీమ్ ఉంటుందని, మార్చి 6న అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమ ప్రారంభోత్సవం నిర్వహించాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్.ఖీమ్యా నాయక్, జడ్పిసిఈఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఈ ఏడాది ఐదుశాతం చైనా ఆర్థికవృద్ధి లక్ష్యం

# రక్షణ బడ్జెట్ ఏడు శాతం

*మిలిటరీ ఆధునీకరణకే ప్రాధాన్యత*
*నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్*



**బీజింగ్ :** సైన్యం ఆధునీకరణ చర్యలే ప్రధాన లక్ష్యంగా చైనా రక్షణ బడ్జెట్‌ను ఏడూశాతానికి పెంచింది. అదేవిధంగా దేశ ఆర్థికవృద్ధిని కూడా 4.5 నుండి 5 శాతం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేసింది. రక్షణ బడ్జెట్ గత ఏడాది కంటే ఈ ఏడాది ఏడూశాతం అంటే 1.91 ట్రిలియన్ యువాన్లు, (277 బిలియన్ డాలర్లు) మేరకు పెరిగింది. చైనాతో ఈ ఏడాది భారత్ రక్షణ బడ్జెట్‌ను పోల్చిచూస్తే కేవలం 86 బిలియన్ డాలర్లు (రూ.7.85 లక్షలకోట్లు) మాత్రమే. గురువారం జరిగిన నేషపల్ పీపుల్స్ కాంగ్రెస్ ప్రారంభ సమావేశంలో చైనా ప్రధానమంత్రి లీ క్వియాంగ్ ఈ ప్రతిపాదనలు చేశారు. దేశాధ్యక్షుడు జిన్‌పింగ్, ఇతర అగ్రశ్రేణి నాయకుల సమక్షంలో ఆయన తప వార్షిక కార్యాచరణ ప్రణాళికను సమర్పించారు. కాగా చైనా స్థూల జాతీయోత్పత్తి లక్ష్యాన్ని మాత్రం ట్రంప్ వాణిజ్య యుద్ధం నేపథ్యంలో 4.5 శాతానికి తగ్గించారు. ఈ వాణిజ్య యుద్ధం వల్ల ప్రపంచ ఆర్థిక సంక్షోభం మరింత క్షీణదశకు చేరుకుంది. గతంతో చైనా గతంలో రెండంకెలస్థాయిలో వృద్ధిని సాధించింది. 2016 నుండి ఇప్పటివరకూ 11 సంవత్సరాలుగా చైనా రక్షణ బడ్జెట్‌ను రెండంకెల శాతానికి చేరకుండా తక్కువస్థాయిలో నిర్వహిస్తోందని ఆ దేశ మీడియా పేర్కొంది. ప్రపంచంలో అమెరికాయే చాలా ఎక్కువగా రక్షణ వ్యయం చేస్తోందని చైనా నిపుణులు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. చైనా వద్ద ఇప్పటికే మూడు యుద్ధ విమాన వాహక నౌకలు ఉన్నాయి. నాలుగో యుద్ధ విమాన వాహక నౌక రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉంది. ఈ లక్ష్యాలను నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ఆమోదించింది. చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం ఈ ప్రతిపాదనలను తయారు చేసింది. 3000 మంది సభ్యులు ఈ ఎన్.పి.సిలో ఉన్నారు. అదేవిధంగా చైనా ప్రభుత్వ పత్రిక చైనా డైలీ కోసం కూడా భారీ మొత్తాన్ని కేటాయించింది.



## వోల్టేజ్ సమస్యతో సబ్ స్టేషన్ ముట్టడించిన రైతులు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండలంలోని చిల్లాపురం, లచ్చమ్మ గూడెం, కొర్ర తండా గ్రామాల్లో కరెంట్ తీవ్ర ఓల్టేజ్ సమస్యలు నెలకొనడంతో రైతులు సబ్ స్టేషన్ ముట్టడించారు. వ్యవసాయ బోర్లు సరిగ్గా నడవకపోవడంతో పంటలకు నీరు అందక రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. తక్కువ ఓల్టేజ్ కారణంగా ఓటర్లు పదేపదే కాలిపోతున్నాయని వేల రూపాయలు ఖర్చుపెట్టి మరమ్మత్తులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మండిపడుతున్నారు. వరి సాగు సీజన్ మధ్యలో ఉండగా సరైన వోల్టేజ్ ఇవ్వకుండా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రాత్రి వేళల్లో కూడా కరెంటు వచ్చిన ఓల్టేజ్ తక్కువ ఉండడంతో మోటర్లు పనిచేయడం లేదని, అధికారులు మాత్రం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వోల్టేజ్ సమస్య పరిష్కరించి వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కొర్ర లాలు, కొర్ర పూలు, కొప్పు సుధాకర్, కొర్ర శంకర్, హరియా, మాజీ సర్పంచ్ లచ్చిరాం, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## రైతుబంధు డబ్బులను వెంటనే అకౌంట్‌లో జమ చేయాలి : సిపిఐ




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : రైతుబంధు డబ్బులను ప్రభుత్వం వెంటనే రైతుల అకౌంట్లో జమ చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్మ భిక్షం భవనంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూరియా యాప్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని కోరారు. యాసంగి సాగు రైతులు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టవలసిన దుస్థితి దాపురించిందని రైతులు మళ్లీ వడ్డీ వ్యాపారులను సంప్రదించవల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ రూ.500 ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వెంటనే సన్న వడ్ల బోనస్ రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎడెల్లి శ్రీకాంత్, దేశగాని హేమలత, రెడ్డిమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆదర్శలో దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/నిడమనూరు:** మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2025/2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి. నిర్మల తెలిపారు.ఆరవ తరగతిలో 100 సీట్లు,అలాగే ఏడో తరగతి నుండి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ నెల 10వ తేదీ వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు తమ గత తరగతి మార్కుల మెమో,ఆధార్ కార్డు ప్రతులు,కుల ధ్రువీకరణ పత్రం (అవసరమైతే), పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని పాఠశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అర్హత కలిగిన విద్యార్థులను ఎంపిక చేయడం మెరిట్ ఆధారంగా జరుగుతుందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఆదర్శ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## రాంగ్‌రూట్‌లో టిప్పర్, బైక్ ఢీ...

### ఒకరి మృతి



**ప్రజాపక్షం/మోతె** : రాంగ్ రూటల్ టిప్పర్ బైక్‌ని ఢీకొట్టగా ఒకరు మృతి చెందినం సంఘటన గురువారం మండల కేంద్రంలోని సూర్యాపేట ఖమ్మం రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోల్‌తండ గ్రామానికి చెందిన ధరావత్ మంగత్య, హరిజ ఇరువురు బైక్‌పై రోజు వారీ కూలీపనులకు సూర్యాపేట వెళ్తుండగా మోతె గ్రామ శివారులోనికి చేరుకోగా రాంగ్‌రూట్‌లో కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ లారీ డ్రైవర్ ఉడుముల ప్రభాకర్ తన యొక్క వాహనాన్ని అజాగ్రత్తగా అతివేగముగా నడుపుతూ మంగత్య యొక్క బైక్‌కు టక్కర్ ఇవ్వగా బైక్ పైన ఉన్న ఇద్దరికి తీవ గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించగా అందులో హరిజ అను వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కొరకు ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మంగత్య ప్రస్తుతం సూర్యాపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. టిప్పర్ డ్రైవర్ పై ఎస్ఐ అజయ్ కుమార్ కేసు నమోదు చేసి వాహనం పోలీసు స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు.

## బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆడపిల్లల వివాహ వయస్సు రాకముందే వివాహాలు చేస్తే తల్లిదండ్రులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమాబేగం మహమ్మద్ అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్‌లోని జడ్పీహైస్కూల్‌లో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్స్ ఆన్ గర్ల్ చైల్డ్‌పై పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందించి మాట్లాడారు. ఆడపిల్లలు ఈ మధ్య కాలంలో మొబైల్‌లో అనేక రకాల యాప్స్‌లలో ఫ్రెండ్స్ పేరిట రిక్వెస్ట్‌ల పేరిట ఎన్నో మోసాలకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలాంటి వాటికి ఆడప్లిలు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా తెలియని వ్యక్తులు మీ వివరాలు అడిగినట్లయితే వారికి ఎటువంటి వివరాలు ఇవ్వకుండా 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా రక్షణ మనందరి బాధ్యత అని గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై, ఆడపిల్లల చదువుపై, భద్రత, అక్రమ దత్తత, పిల్లల డ్రాపౌట్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి, అంగన్‌వాడి టీచర్ ఎల్లమ్మ, వాణి,సైదమ్మ, విద్యార్థినిలు పాల్గొన్నారు.



# విద్య వైద్యానికి మొదటి ప్రాధాన్యం

### ఆలేరులో నూతన కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మిక తనిఖీ

### విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచన



**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ని నూతన కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. స్కూల్‌లో ఎంతమంది విద్యార్థులు చదువు తున్నారని, ఇంటర్మీడియట్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని సంబంధిత ప్రిన్సిపాల్‌ని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారని, అందరూ ఇక్కడే ఉంటారా లేక వెళ్లి వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు మెనూ ప్రకారం ఆహారం వండడం జరిగిందా అని పరిశీలించారు. రోజు మెనూ ప్రకారం భోజనం రుచిగా పెడుతున్నార అని విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ రుచి చూసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, కూరగాయలు, వంట సరుకులను పరిశీలించారు. కూరగాయలు, గుడ్లు ఫ్రెష్‌గా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను వాటర్ యొక్క క్వాలిటీని రెగ్యులర్‌గా చెక్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ని తనిఖీ...**
కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోజు వారీ ఓపికి సంబంధించిన ఎంత మంది వస్తున్నారు. ఈరోజు ఎంత మంది వచ్చారు అని ఓపి రిజిస్టర్‌ని చెక్ చేశారు. కమ్యూనిటీ హెల్త్‌లో ఎంత మంది డాక్టర్స్ ఉన్నారు. వాళ్ళ స్పెషలైజేషన్ ఏంటి వాళ్ళు షిఫ్ట్‌లు ఏంటి అని అడిగారు. నైట్ షిఫ్ట్‌లో ఎంత మంది డాక్టర్స్ ఉంటారు. ఎంత మంది సిబ్బంది ఉంటారు అని అడిగారు. హెల్త్ సెంటర్ లోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గర్భిణి స్త్రీ యొక్క బ్లడ్ పర్సెంటేజ్ ఎంత ఉంది అని అడిగారు. అల్ ది బెస్ట్ అని తెలిపారు. సెంటర్‌లో ఉన్న మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, అడ్వాన్స్డ్ సిఎన్‌సి మిషనింగ్ టెక్నీషియన్, వంటి కోర్సులు పై విద్యార్థులకి ఇస్తున్న శిక్షణని క్షుణ్ణంగా పరిశీలించారు.

**ఐటిఐ కళాశాల పరిశీలన..** ఆలేరులోని ఐటిఐలో ఏం కోర్సులు నేర్పిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగి ఉండి, సరి కొత్త ఆలోచనలతో సృజనాత్మకతను చాటితే ఎంతో స్థాయికి చేరుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మండల తాసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సమర్థవంతంగా 99 రోజుల కార్యాచరణ

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా, సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి ముందుగా జిల్లా అధికారులతో సమగ్ర దిశానిర్దేశం నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులు, ఆర్‌డిఓలు, ఎంపిడిఓలు, తహశీల్దార్లు, ఎంపిఒలు, మున్సిపల్ కమీషనర్లు, వార్డు అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి, పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 6 నుండి 11 వరకు ఆరోగ్యం, ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఏప్రిల్ 13 నుండి 18 వరకు సురక్షితంగా చేరుకోండి (అరైవ్ అలైవ్) కార్యక్రమం హోం, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని వివరించారు. రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, హెల్మెట్ సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ 20 నుండి 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖలు, ఇందిరమ్మ ఇల్ల పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత, రక్షణ డ్రగ్స్‌కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు. జూన్ 1 నుండి 12 వరకు పర్యావరణ అంశంపై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ సమావేశంలో జడ్‌పి సిఇఓ శిరీష, సిపిఓ యాదగిరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, సంబంధిత శాఖల జిల్లా అధికారులుపాల్గొన్నారు.

# బంగారంపై రుణాలు తీసుకున్న వారిని మోసగించిన నిందితుడి అరెస్ట్




### రూ.4లక్షలు స్వాధీనం : డిఎస్‌పి రాజశేఖర్‌రాజు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ముత్తూట్ ప్రైవేట్ ఫైనాన్స్, మిర్యాలగూడలో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తూ వేర్వేరు గోల్డ్ ఫైనాన్స్‌లలో గోల్డ్ లోన్ రిలీజ్ చేసుకునేందుకు వచ్చే బాధితుల నుంచి నమ్మించి వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు తన అకౌంట్‌లో వేసుకోని మోసం చేసే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం డీఎస్పీ రాజశేఖర్‌రాజు తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. నిందితుడు లొడంగి యాదగిరి మాడ్గులపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందినవాడు. యాదగిరి మణప్పురం గోల్డ్ స్పీ ప్రైవేట్ లిమిటెడ్ హైద్రాబాద్‌లో జూనియర్ ఆఫీసర్‌గా సుమారు 2 సంవత్సరాలు పనిచేశాడన్నారు. తరువాత 2017లో మిర్యాలగూడకు వచ్చి 2019 నుంచి ఐఐఎఫ్ఎల్ గోల్డ్ లోన్స్ ప్రైవేట్ లిమిటెడ్, మిర్యాలగూడలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేశాడు. తరువాత తిరిగి 2023 నుంచి ముత్తూట్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, మిర్యాలగూడ టౌన్‌లో చేరి బ్రాంచ్ మేనేజర్‌గా 2024 నుంచి పనిచేస్తున్నాడు. తన వృత్తిలో భాగంగా గోల్డ్ షాప్ నడిపే వ్యక్తులు తన ముత్తూట్ ఫైనాన్స్ వద్దకు వస్తూ ఎక్కువ మొత్తంలో డబ్బులు కస్టమర్లపై పెట్టి లోన్స్ రిలీజ్ చేయించి బంగారం కొంటూ ఉంటారు. అలా వారితో పరిచయం చేసుకోని మండల శకంర్ అనే వ్యక్తి తన వద్దకు గోల్డ్ రిలీజ్‌కు రాగా సొల్లేటి కనకాచారి ద్వారా మదారి ఉపేంద్రచారిని పరిచయం చేసుసకోని కొంత బంగారం బ్యాంక్ నుంచి విడిపించి అమ్మడానికి గాను రూ.9.60లక్షలను యాదగిరి తన అకౌంట్‌కు ఎలాగైనా వేయించుకో వాలనే దురుద్ధేవ్యంతో సదరు శంకర్‌కు కరెంట్ అకౌంట్ లేదని ఉపేంద్రచారికి మాయమాటలు చెప్పి అతన్ని నమ్మించి ఆ మొత్తం రూ.9.60లక్షలను తన అకౌంట్‌లో వేయించుకున్నాడని అన్నారు. అకౌంట్‌లో డబ్బులు పడగానే సదరు వ్యక్తి గోల్డ్ రిలీజ్ ప్రాసెస్ కోసం బ్యాంక్‌కు వెళ్లగా అక్కడ నిందితుడు తన అకౌంట్‌లో ఉన్న డబ్బును లోన్ అకౌంట్‌కు సెండ్ చేయకుండా ఉద్ధేశ్యపూర్వకంగా తప్పుడు పాస్‌వర్డ్ కొడుతూ ఈ రోజు ప్రాసెస్ కావడం లేదు రేపు రండని చెప్పడంతో తన మాటలను నమ్మి బాధితులు వెళ్లిపోయిన తరువాత అలా మోసం చేసి మొత్తాన్ని తన అకౌంట్‌లో వేసుకోని వాటిని క్రికెట్ బెట్టింగ్లో పెట్టాడన్నారు. ఈ విషయమై ఉపేంద్రచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారన్నారు. గతంలో కూడా సదరు యాదగిరి సుధీర్‌కుమార్ అనే వ్యక్తిని ఇదే విధంగా నమ్మించి మోసం చేశారు. నిందితుడి నుంచి రూ.4లక్షలు, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ నాగభూషన రావు, ఎస్ఐ సైదిరెడ్డి, హెచ్‌సీ రాజారాం, పీసీలు వీరబాబు, నర్సింహా, ప్రసాద్‌లను డీఎస్పీ అభినందించారు.

## ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర ఆదేశించారు.ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేయనున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై గురువారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రిసోర్స్ పర్సన్స్‌తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయాలని రిసోర్స్ పర్సన్స్‌కు సూచనలు చేశారు.ప్రణాళిక అమలులో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు.అలాగే అన్ని రిసోర్స్ పర్సన్స్ నేడు ఉదయం 9:30 గంటలకు పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద సమావేశమై 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన ప్రతిజ్ఞ పఠనం చేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

### విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ ఆత్మీయంగా ముచ్చటించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి):** విద్యార్థులు పరీక్షల సమయంలో భయపడకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. గురువారం ఆయన తిప్పర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పలు అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పదో తరగతి తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడి వారి చదువులపై ప్రశ్నలు అడిగారు.పరీక్షల సమయంలో భయపడకుండా ధైర్యంగా,ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని విద్యార్థినులకు సూచించారు.తదుపరి విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేసి వారితో ఆత్మీయంగా ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రామకృష్ణ,ఎంపీడీవో జానయ్య,ఎంఈఓ నరసింహ నాయక్,ఏవో సన్నీ రాజు,ప్రిన్సిపాల్ కే. రాజరాజేశ్వరి, ఇంజనీరింగ్ ఏఈ జ్యోతి తదితర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

**ఉగాది లోపు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పూర్తి చేయాలి:**
నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేసి ఉగాది పండుగకు ముందే పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ లబ్ధిదారులకు సూచించారు.గురువారం తిప్పర్తి మండలం శిలార్మియా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల సహాయంతో ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు.గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో జానయ్య, హౌసింగ్ ఏఈ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఇబ్బందులు రావొద్దు

### ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/నల్లగొండ** : జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ గురువారం ఆకస్మికంగా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆల్ఫా జూనియర్ కాలేజ్, వేదాంత జూనియర్ కాలేజ్‌లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా త్రాగునీరు, శుభ్రమైన మూత్రశాలలు, ప్రథమ చికిత్సతో కూడిన మెడికల్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని, మాల్ ప్రాక్టీస్ లేదా మాస్ కాపీయింగ్ వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా హాలులోకి అనుమతించాలని సూచించారు.పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో డీఐఈఓ దస్రు నాయక్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్న్ షిప్ ద్వారా ప్రత్యక్ష అనుభవం

### ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణ పరిధిలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం మేనేజ్మెంట్ విద్యార్థులు ఇండియా పేమెంట్స్ బ్యాంకు నందు 45 రోజుల ఇంటర్న్ షిప్ పూర్తి చేశారు.బ్యాంకింగ్ సేవలను వినియోగదారులకు అందించడం,మార్కెటింగ్,డిజిటల్ బ్యాంకింగ్,అవగాహన కార్యక్రమాలు,యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌లు, వీధి వ్యాపారుల రుణ సదుపాయాలు వంటి అంశాలలో ప్రత్యక్షంగా శిక్షణ పొందారు. తమ శిక్షణ అనంతరం ప్రత్యక్ష అనుభవాలను గురువారం ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తో పంచుకున్నారు.ఈ సందర్భంగా ఉప కులపతి మాట్లాడుతూ ప్రత్యక్ష అనుభవంతో పాటు నైపుణ్యాల వృద్ధి సాధ్యమవుతుందని విద్యార్థులు ఆదిశగా దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మేనేజ్మెంట్ విభాగ అధిపతి డాక్టర్ సబీనా హెరాల్డ్, విద్యార్థులు ఉప్పరి మహేష్,సింగపురం నవీన్, నకిరేకంటి నవీన్,శ్రీకాంత్,స్టీవెన్ కృపానందం,కొండా సందీప్,ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్,శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్‌కు 6 నెలల జైలు

**ప్రజాపక్షం/నకిరేకల్(కేతేపల్లి)** :మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.500విధిస్తూ నకిరేకల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ తీర్పు వెలువరించారు.పోలీసుల వివరాల ప్రకారం 2015 నవంబర్ 24న చీకటిగూడెం గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వేములపల్లి మండలం కల్వలపాలెం గ్రామానికి చెందిన గడ్డమీది మల్లయ్య జాతీయ రహదారి65 దాటుతుండగా ప్రమాదం జరిగింది.హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఇన్నోవా కారును కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలానికి చెందిన పామర్తి జోజిబాబు అతి వేగంగా,అజాగ్రత్తగా నడుపుతూ మల్లయ్యను ఢీకొట్టాడు.ఈఘటనలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.విచారణ అనంతరం నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు.ఈ కేసులో ప్రతిభ కనబరిచిన కేతేపల్లి ఎస్ఐ సతీష్,కోర్టు కానిస్టేబుల్ జి. సురేష్,ను జిల్లా ఎస్‌పి శరత్ చంద్రపవార్అభినందించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ పరిధిలో ఉన్న హాస్టళ్లలో కుక్,కమాటి పోస్టులకు అవుట్‌సోర్సింగ్ సేవలు అందించేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లాలో ఎంపానెల్ అయి ఇప్పటి వరకు ఏ డిపార్ట్‌మెంట్ అలాట్మెంట్ పొందని అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలు ఈ అవకాశానికి దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఉపాధి కల్పన అధికారి తెలిపారు.దరఖాస్తు చేసుకున్న ఏజెన్సీలను జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి గల ఏజెన్సీలు రూ.500 దరఖాస్తు రుసుముతో తమ దరఖాస్తులను ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు నల్లగొండ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవని అధికారులు స్పష్టం చేశారు.

## మంచినీటి సరఫరాకు చర్యలు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణంలోని మంచినీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట పైపులైన్ వేయాలని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సరఫరాపై పాలకవర్గంతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు వేసవిలో తాగునీరు అందించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అదేశించారు. మిషన్ భగీరథ నీరును ఇంటింటికి సరఫరా చేయాలన్నారు. అధికారులు సమన్వయం తో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లే కుండా చర్యలు తీసుకోవాలని అదేశించారు. మిషన్ భగీరథ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్‌రెడ్డి, కమిషనర్ శ్రీనివాస్, ఎఈ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



# వరుసగా రెండోసారి ఫైనల్లో భారత్



పొట్టి ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లో ఇంగ్లాండ్ కడదాకా పోరాడిన వాంఖడేలో ఇండియా విజయంతో మురిసింది. జాకబ్ బెథెల్(105) భయపెట్టినా.. బుమ్రా(3–31), పాండ్యా(2–38)లు డెత్ ఓవర్లలో అద్భుతంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని పడగొట్టారు. మ్యాచ్ చేజారుతున్న వేళ బౌండరీ లైన్ వద్ద అక్షర్ పటేల్.. తిలక్ వర్మ పట్టిన క్యాచ్‌లు భారత విజయంలో కీలకమయ్యాయి. ఉత్కంఠ రేపిన రెండో సెమీఫైనల్లో భారత్ అద్భుత విజయం సాధించింది. వెస్టిండీస్‌ను ఓడించిన ఆత్మవిశ్వాసంతో వాంఖడేలో ఇంగ్లాండ్ బౌలర్లను ఉతికేస్తూ 253 రన్స్ కొట్టిన టీమిండియా.. రికార్డు ఛేదనలో ప్రత్యర్థి గొప్పగా పోరాడినా 246కే కట్టడి చేసింది. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ ఫీల్డింగ్ మెరుపులు.. బుమ్రా, హార్దిక్ బౌలింగ్ టీమిండియాను గెలిపించాయి. 7 పరుగులతో విక్టరీ కొట్టిన టీమిండియా.. ఇంగ్లాండ్‌పై వరుసగా రెండోసారి సెమీస్‌లో పైచేయి సాధించింది. చివరి ఓవర్లో 30 రన్స్ అవసరమవ్వగా.. దూబే బంతి అందుకున్నాడు. సెంచరీతో జోరుమీదున్న బెథెల్ క్రీజులో ఉండగా, స్ట్రెయిట్‌గా ఆడిన బెథెల్ రెండు పరుగులు తీసే క్రమంలో రనౌటయ్యాడు. వరుసగా మూడు బంతుల్ని జోఫ్రా ఆర్చర్(19నాటౌట్) సిక్సర్లుగా మలిచాడు. 240 పరుగులకే పరిమితమైంది. భారత్ ఆదివారం న్యూజిలాండ్‌తో టైటిల్ పోరులో తలపడనుంది.

భారీ ఛేదనలో రెండో ఓవర్‌లోనే హార్దిక్ పాండ్యా వికెట్ అందించాడు. ఫిల్ సాల్ట్(5)ను ఔట్ చేసిన అతడు.. బుమ్రా ఓవర్లో హ్యారీ బ్రూక్(7) దొరికిపోయాడు. ఆ తర్వాత జాకబ్ బెథెల్(105) వరుణ్‌చక్రవర్తి ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లు బాదాడు. సింగిల్ తీయడమే పొరపాటైంది. ఆ తర్వాతి బంతికే పెద్ద షాట్ ఆడాలనుకున్న బట్లర్ను గూగ్లీతో బౌల్ చేసిన వరుణ్ మూడో వికెట్ అందించాడు. కాసేపటికే అక్షర్ పటేల్ బౌలింగ్లో వరుసగా రెండు సిక్సర్లు బాదిన టామ్ బ్యాంటన్ (17).. స్లోబంతికి బౌల్డయ్యా డు. దాంతో.. 95కే నాలుగు వికెట్లు పడ్డాయి. ఆదశలో విల్ జాక్స్(35) జతగా రెచ్చిపోయాడు. సిక్సర్ల మీద సిక్సర్లు బాదిన ఈ చిచ్చరపిడుగు.. అర్ధ శతకం తో ఆశలు రేపాడు. 14వ ఓవర్లో వరుసగా మూడు వైడ్లు వేసినా.. అక్షర్ పటేల్ స్టన్నింగ్ క్యాచ్‌తో.. ఈ జోడీని విడదీసి.. 27 బంతుల్లోనే 50 రన్స్ రాబట్టిన.. సామ్ కరన్(18)ను తిలక్ బౌండరీ క్యాచ్తో పెవిలియన్ చేర్చాడు. అయినా.. క్రీజులో బెథెల్ ఉండడంతో ఇంగ్లాండ్ విజయంపై ధీమాతో ఉంది. కానీ 18వ ఓవర్‌లో బుమ్రా ఆరు పరుగులు.. 19వ ఓవర్లో 9 రన్స్ ఇచ్చిన పాండ్యా వికెట్ తీశాడు. చివరి ఓవర్‌లో తొలి బంతికే బెథెల్ రనౌటవ్వగా.. భారత్ విజయం ఖాయమైంది. ఆఖరి మూడు బంతులకు ఆర్చర్ (19 నాటౌట్) సిక్సర్లు సంధించగా.. ఇంగ్లాండ్ 246కి పరిమితమైంది. ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌పై చెలరేగిన సంజూ శాంసన్(89) ఇంగాండ్ బౌలర్ల భరతం పట్టగా.. మిడిల్ ఆర్డర్‌లో శివం దూబే(43) ఉతికేశాడు. ఇషాన్ కిషన్(39), డెత్ ఓవర్లలో హార్దిక్ పాండ్యా(27), తిలక్ వర్మ(21)లు తమమార్క్ విధ్వంసంతో కదం తొక్కగా టీమిండియా 253 పరుగులతో ప్రత్యర్థికి కష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించింది.

# వైభవంగా అర్జున్ టెండూల్కర్ వివాహం..

## తరలివచ్చిన క్రీడా, సినీ ప్రముఖులు



భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ వివాహ బంధంలో అడుగుపెట్టాడు. ఆంత్రోప్రెన్యూర్ సానియా చందోక్‌ను పెళ్లి చేసుకున్నాడు. ముంబైలో వీరి కల్యాణ వేడుక అద్యంతం.. వైభవంగా జరిగింది. కొత్త జంటను ఆశీర్వదించేందుకు క్రీడా, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు భారీగా తరలి వెళ్లారు. నిరుడు ఆగస్టు 25వ తేదీన అర్జున్, సానియా చందోక్‌ల నిశ్చితార్థం జరిగింది. మార్చి ఆరంభంలోనే ముందస్తు పెళ్లి వేడుకల్లో సచిన్ దంపతులు, కుటుంబసభ్యులు సందడి చేశారు. సన్నిహితులు, బంధుమిత్రుల సమక్షంలో సౌత్ ముంబైలో అర్జున్, సానియాల పెళ్లి కన్నులపండువగా జరిగింది. కొత్త జంటను దీవించేందుకు మాజీ ఆటగాళ్లు పెద్ద సంఖ్యలో వచ్చారు. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ భార్య సాక్షితో పాటు హాజరయ్యారు. వెటరన్ ప్లేయర్ సునీల్ గవాస్కర్, మాజీ కోచ్‌లు రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, రవిశాస్త్రి, టీమిండియా ప్రస్తుత కోచ్ గౌతం గంభీర్.. మాజీ హిట్టర్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపి యూసుఫ్‌పఠాన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఐసిసి చైర్మన్ జైషా, కామెంటేటర్ హర్ష భోగ్లే.. తదితరులు కొత్త దంపతులైన అర్జున్ సానియాకు అభినందనలు తెలిపారు.

**అర్జున్.. సానియా నేపథ్యమిదీ...**దిగ్గజ క్రికెటర్ సచిన్ వారసత్వాన్ని కొనసాగిస్తున్న అర్జున్ టెండూల్కర్ దేశవాళీ, ఐపిఎల్‌ల్లో మెరుస్తున్నాడు. అయితే.. తండ్రిలా జాతీయ జట్టు తరఫున చెలరేగి ఆడే అవకాశం మాత్రం మనోడికి ఇంకా దక్కలేదు. వధువు సానియా చందోక్ విషయానికొస్తే తను ఒక ఆంత్రోప్రెన్యూర్. ముంబైలో ఆతిథ్యం, ఆహారరంగాల్లో ప్రసిద్ధి గాంచిన గాహీ కుటుంబం ఆమెది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్‌లో చదివి, ముంబైలో పెంపుడు జంతువుల కోసం సానియా మిస్టర్ పాస్ అనే పెట్ స్పా నడుపుతోంది.

# పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## శుద్ధ బంగారం ఎన్ని క్యారెట్లు?



- రాష్ట్రపతులుగా పనిచేసిన కిందివారిలో ఎవరు 'ఇండియన్ పోస్ట్ ఆఫీసెస్ బిల్లు'పై సంతకం చేయడానికి నిరాకరించారు?
  జ్ఞానీ జైల్‌సింగ్
- సూక్ష్మ జీవినాశిని పెన్సిలిన్ దేని నుంచి లభిస్తుంది?
  ఫంగస్
- బెలారస్ దేశ రాజధాని నగరాన్ని గుర్తించండి.
  మిన్స్క్
- పాలలో ఉన్న నీటిశాతాన్ని కొలిచే పరికరం ఏది?
  లాక్టోమీటరు
- ఆర్కాట్ వీరుడిగా ప్రసిద్ధి గాంచిన బ్రిటిష్ జనరల్ ఎవరు?
  రాబర్ట్ క్లైవ్
- తిమింగలం ఏ జంతువుల రకానికి చెందుతుంది?
  క్షీరదం
- మానవాభివృద్ధి సూచికను అభివృద్ధి పరిచేది?
  యూఎన్‌డిపి
- రాజ్యాంగ అత్యవసర స్థితి ప్రకటన దేనికి దారితీస్తుంది?
  స్వేచ్ఛ హక్కు తాత్కాలిక రద్దు
- రాష్ట్రపతి రాజ్యసభకు ఎంతమంది సభ్యులను నియమిస్తారు?
  12 మంది
- స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే అంశాలను మన రాజ్యాంగం ముందుమాటలో పొందుపరిచాం. వీటికి ప్రేరణ ఇచ్చింది ఏది?
  ఫ్రెంచి విప్లవం
- మానవ దేహంలో అతిపెద్ద గ్రంథి ఏది?
  కాలేయం
- 2014–15 ఆర్థిక సంవత్సరంలో భారత్‌కు తరలివచ్చిన ఎఫ్ డీఐల మొత్తం ఎంత?
  30.93 బిలియన్ డాలర్లు
- థయామిన్ (విటమిన్ బి 1) లోపం వల్ల వచ్చే వ్యాధి ఏది?
  బెరిబెరి
- అధిక శక్తి ఉన్న ద్రవ్యాన్ని ఇలా కూడా పిలవవచ్చు.
  ఎం 1
- 'గన్ కాటన్' పేరుతో పిలిచే శక్తిమంతమైన విస్ఫోటనకారి ఏది?
  సెల్యులోజ్ నైట్రేట్
- మానవ రక్తంలో అధికశాతం ఉండేవి?
  బేసోఫిల్స్
- మానవుడిలో ఉండే మాస్టర్ గ్రంథి ఏది?
  పిట్యూటరీ
- ఏ విటమిన్ లోపం వల్ల రేచీకటి వస్తుంది?
  విటమిన్‌ఎ
- చీకటి గది ఉదంతం గురించి పేర్కొన్న వ్యక్తి ఎవరు?
  హాల్వెల్
- 'ఈస్టర్న్ స్టార్' భారీ విహార నౌక ప్రమాదం ఇటీవల ఏ దేశంలో చోటు చేసుకుంది?
- మొదటితరం కంప్యూటర్లలో వాడిన కీలక పదార్థం
  ట్యూబ్స్
- టొమాటోలకు దేనివల్ల రంగు వస్తుంది?
  కెరోటినాయిడ్లు
- శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు ఏ రంగానికి సంబంధించింది?
  సాంకేతికత
- బ్రిటిష్‌పాలనలో భారతదేశ మొదటిజాతీయ ఆదాయఅంచనాలు సమకూర్చినవారు?
  దాదాభాయ్ నౌరోజీ
- పెద్దమనుషుల ఒప్పందంఎప్పుడు జరిగింది?
  1956, ఫిబ్రవరి 20



- కిందివాటిలో మొగ్గల నుంచి లభించే సుగంధ ద్రవ్యం ఏది?
  లవంగాలు
- 2015 మేలో ప్రధాని నరేంద్రమోదీ చైనా పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య ఎన్ని కీలక ఒప్పందాలు కుదిరాయి?
  24
- నల్లా ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగు నీరు అందించడం కోసం ప్రవేశ పెట్టిన పథకం ఏది?
  తెలంగాణ తాగునీటి సరఫరా పథకం (వాటర్ గ్రిడ్)
- శత్రు విమాన ఉనికిని గుర్తించే 'రాడార్' ఏ తరంగాలను ఉపయోగించుకుంటుంది?
  రేడియో తరంగాలు
- మొక్కల్లోని ఏ భాగంలో కణవిభజన చురుకుగా జరుగుతుంది?
  వేళ్లు
- అగ్ని 5 లక్ష్య దూరం?
  5000 కి.మీ.
- భారత క్రికెట్ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సలహా సంఘంలో బీసీసీఐ ఇటీవల ముగ్గురు క్రీడాకారులను సలహాదారులుగా నియమించింది. అందులో లేని ఆటగాడిని గుర్తించండి.
  రాహుల్ ద్రవిడ్
- కంప్యూటర్లలో ఉండే శాశ్వత జ్ఞాపకశక్తి?
  రోమ్
- గాలిలోని కాలుష్యానికి కారణమేది?
  కార్బన్ మోనాక్సైడ్ కార్బన్ డై ఆక్సైడ్ హైడ్రోజన్ సల్ఫేట్
- ఆహార పదార్థాల నిల్వకు ఉపయోగించే పదార్థం ఏది?
  బెంజోయిక్ ఆమ్లం
- నవ్వు పుట్టించే వాయువు ఏది?
  నైట్రస్ ఆక్సైడ్
- శుద్ధ బంగారం ఎన్ని క్యారెట్లు?
  24
- ఆభరణాల తయారీలో బంగారంతో కలిపే లోహం ఏది?
  రాగి
- గాలిలోని తేమను కొలిచే సాధనం ఏది?
  హైగ్రోమీటర్
- ఎల్పీజీ (వంట గ్యాసు)లో ఉండేది?
  బ్యూటేన్

# సమాన పనికి సమాన వేతనం

## సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ డిమాండ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** బస్టాండ్ లోడ్, అన్‌లోడ్ కార్మికులతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటితరంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యాలు తక్షణమే పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కిరాణా షాపులు, బట్టల దుకాణాలు, సిమెంట్ షాపులు, పెట్రోల్ బంకులలో హమాలీలు, కార్మికులుగా పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు 2026 సంవత్సరపు నిబంధనల ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి కార్మికుడి నెలకు రూ.26,000 కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులను కేవలం యంత్రాలుగా చూడకుండా మనుషులుగా గౌరవించాలని, వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా యాజమాన్యాలు వ్యవహరించాలని కోరారు. ప్రమాదకర పనుల్లో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యాలే పూర్తి స్థాయిలో ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని రమేష్ పేర్కొన్నారు. విధుల్లో ఉండగా ఏదైనా ప్రమాదం జరిగితే సదరు కార్మికుడి కుటుంబానికి భరోసా ఇచ్చేలా చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఓనర్లపై ఉందన్నారు. అనంతరం కార్మిక సంఘం నూతన కార్యవర్గ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా భూక్యా రమేష్, జిల్లా అధ్యక్షుడిగా ఎన్.రాజేశ్వర్,జిల్లా కార్యదర్శిగా శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడిగా ముత్తన్న, కోశాధికారి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్ఎన్.రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె



## వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్ వెల్లడి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపునిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం గోదావరిఖనిలో జరిగిన ఎఐటియుసి కేంద్ర కమిటీ సమావేశంలో జరిగిన వివరాలను వారు వెల్లడించారు. సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘం ఎఐటియుసితో నవంబర్ 2024, మార్చి 2025లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో పలు డిమాండ్‌లను అంగీకరించి అమలు చేయడం లేదని వారు ఆరోపించారు. ముఖ్యంగా సొంత ఇంటి పథకాన్ని, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ చెల్లింపులపై సర్క్యులర్‌లను జారీ చేయకుండా కార్మికులను మోసం చేస్తుందన్నారు. మెడికల్ బోర్డును ఎసిబి విచారణ పేరుతో నిలిపివేశారన్నారు. అనారోగ్యం వల్ల కార్మికులు చాలామంది మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు మెడికల్ బోర్డుకు పిలువకుండా కాలయాపన చేస్తూ కార్మికులను యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మారుపేర్లు విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వకుండా యాజమాన్యం సమస్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందని పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల వారికి ఉద్యోగాలు రావడం లేదన్నారు. జనరల్ సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికుల నుంచి జీతం రికవరీ చేస్తామని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని, కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కొత్త గనులు ఇవ్వకుండా తెలంగాణలో ఉన్న సింగరేణి సంస్థను నిర్వీర్యం చేస్తుందని వారు ఆరోపించారు. వేలంతో సంబంధం లేకుండా తెలంగాణలో ఉన్న కొత్త గనులు సింగరేణికి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణిలో మైనింగ్, క్లరికల్, ట్రేడ్స్ మెన్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, లేకుంటే సమ్మెకు పిలుపునిస్తామని వారు పేర్కొన్నారు. సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అదనపు ప్రధానకార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉపప్రధాన కార్యదర్శులు కే.సారయ్య, వై.వి.రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లాగౌడ్, కె.వీరభద్రం, అక్బర్ అలీ, కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, బాజీ సైదా, మల్లికార్జున్, రాంగోపాల్, రమేశ్, తిరుపతి, మల్లేష్, జీగురు రవీందర్, ఎంఆర్‌సి.రెడ్డి, రంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సీతమ్మ సహనం, సేవాభావం ఆదర్శం

## సంస్మరణ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సిపిఐ సీనియర్ నాయకురాలు కనకబండి సీతమ్మ సహనం, సేవాభావం నేటితరానికి ఆదర్శమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతర్‌రావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా నేలకొండలంలోని భైరవునిపల్లి గ్రామంలో కనకబండి సీతమ్మ సంస్మరణ సభను పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత సీతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు, శ్రేణులు నివాళులర్పించారు. అనంతరం పార్టీమండల కార్యదర్శి మారిశెట్టి వెంకేశ్వరరావు, గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతర్‌రావు మాట్లాడుతూ కనకబండి సీతమ్మ పార్టీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన తీరు, ఆమె పోరాట, పటిమ, ఉద్యమ స్ఫూర్తి నేటి సమాజానికి ఆదర్శనీయమన్నారు. సీతయ్య పార్టీలో జిల్లా నాయకుడిగా ఎదగడానికి, గ్రామంలో సర్పంచ్‌గా ప్రజల ఆదరణ పొందడంలో సీతమ్మ ఆయనకు వెన్ను ముక్కలా నిలిచారని కొనియాడారు. గ్రామంలో సిపిఐని అగ్రభాగాన నిలపడంలో సీతమ్మ పార్టీకి అందించిన సలహా, సూచనలు అత్యంత ప్రాధాన్యత కలిగి ఎంతగానో దోహదం చేశాయన్నారు. సీతమ్మ పార్టీ పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావం, నిబద్ధతగా పని చేసిన వ్యక్తిగా ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. సీతమ్మ ఆశయ సాధ కు ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు కర్నాటి భాను ప్రసాద్, సిద్ధినేని కర్ణకుమార్, పెద్ద పాక వెంకట్, మల్లెబోయిన ఉపేందర్, కర్నాటి నళినిరాణి, పాల్తియ శ్రీనివాసరావు, భాగం నరసింహారావు, సర్పంచ్ గుండపనేని లక్ష్మణరావు, ఉపసర్పంచ్ ఆలేటి ఉమా మహేష్, జానపద కళాకారుడు పెద్దపాక విజయ్‌కుమార్, గ్రామశాఖ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బీడీ కార్మికుల వేతనాల పెంపునకు ఐక్య పోరాటాలు : ఎఐటియుసి



**ప్రజాపక్షం/అమరచింత :** బీడీ కార్మికుల వేతన ఒప్పందం ఈనెల 14న ముగుస్తున్న నేపథ్యంలో కార్మికులందరూ ఐక్యమత్యమై పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని ఎఐటియుసి కార్యదర్శి మోషే పిలుపునిచ్చారు. గురువారం అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని సిపిఐ కార్యాయంలో బీడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోష మాట్లాడుతూ వనపర్తి జిల్లాతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని బీడీ కార్మికుల అందరి సమక్షంలో ఫ్యాక్టరీ యజమానులతో ప్రతి రెండేళ్లకోసారి వేతన ఒప్పందం చేసుకుంటామని తెలిపారు. కార్మికులకు కూలీ రేట్లు పెంచేందుకు మరో ఒప్పందం కోసం యజమానులతో జరిగే పోరాటంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కార్మికులందరూ తమతో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీడీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, జిల్లా కార్యదర్శి భాస్కర్, సౌలు, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి 9న చలో కలెక్టరేట్

## ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య



**ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి మార్చి 9న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య పిలుపునిచ్చారు. గురువారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయల వేతనాన్ని చెల్లిస్తామని, ప్రతినెల బిల్లులను చెల్లిస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నేటికి అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో సెంట్రలైజ్డ్ కిచెన్ విదానం మరియు అక్షయపాత్ర అనే సంస్థలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అప్పజెప్పడానికి కుట్రలు చేయడం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 9న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు, మార్చి 16న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చక్రపాణి, కుశాల్ పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్ వినియోగంలోకి తేవాలి

## సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలో గల కొత్త సమీకృత ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్‌ను తక్షణమే వినియోగంలోకి తేవాలని; గాంధీపార్క్‌కు తక్షణమే విముక్తి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఆందోళనలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 33 వ వార్డు కౌన్సిలర్ బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33 వ వార్డు పరిధిలో ఉన్న కొత్త మోడల్ కూరగాయల మార్కెట్‌ను తక్షణమే వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. కూరగాయల వ్యాపారులకు ఎలాంటి ఆర్థిక భారం కాకుండా అన్ని విధాల చేయూతనివ్వాలని, మార్కెట్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కూరగాయల మార్కెట్ రోడ్ లో మిగిలిపోయిన సిసి రోడ్లు వేయాలని, వచ్చే మార్చి 27 2026 జరగనున్న శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామకళ్యాణ మహోత్సవం ఆనవాయితీగా గాంధీపార్కులో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీ పార్కును అందరికీ ఉపయోగపడే విధంగా ఆధునాతన రీతిలో అభివృద్ధి చేయాలన్నారు. రాజకీయ విద్యా విజ్ఞాన సాంస్కృతిక ఆధ్యాత్మిక తదితర అనేక విస్తృత ప్రజా అవసరాలకు వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కోరారు. కూరగాయల మార్కెట్ రోడ్‌లో ఉన్న వివిధ రకాల అన్ని వ్యాపారాలు మెరుగుపడేలా, వృద్ధులు కూడా లోపలికి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పాత కూరగాయల మార్కెట్ ప్రధాన రోడ్డుపైన గుంతలో ఉన్న వివిధ రకాల షాపులను తొలగించి శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రక్కన మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేసిన ఇటీవల మూడు నెలల క్రితం తొలగించిన వాటిని యధావిధంగా కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసి, చిరు వ్యాపారులను ఆదుకోవాలని అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పెరుగుకుమార్, 18వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్, 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్య శ్రావణ్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, కూరగాయల వ్యాపారస్తులు గీసగాని కుమార్, మేదరమెట్ల వెంకట్రావు, చీకటి తిరుమలేష్, రాంబాబు, నీలం వెంకటేశ్వర్లు, బిర్రు సాయి, బండి వెంకటరామ నరసయ్య, యూసుఫ్, షకీల్ ఖాన్, జమీల్ ఖాన్, మెరుగు అశోక్, ఆబోతు అశోక్, పడిదల శ్రీధర్, ఎండి మహమూద్, శేషగాని శ్రీనివాస్, మార్వడి మోహన్, పాక ధర్మేశ్వర్, వికాస్, భీమ రాజు, వెంకన్న, రహీం తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజా పాలన' విజయవంతం చేయాలి

అధికారులకు దిశా నిర్దేశం చేసిన సిఎంసి కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా పాలన–ప్రగతి నివేదిక అమలుపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ సృజన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో చేపడుతున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. ప్రజా పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం, పెండింగ్ లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రణాళికను అమలు చేస్తోందని కమిషనర్ అన్నారు.

ఈ కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక మైలురాయిగా నిలవాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల అధికారులతో సమావేశమైన కమిషనర్, క్షేత్రస్థాయిలో ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలయ్యేలా సర్కిల్ స్థాయి అధికారులతో సమన్వయం పెంచుకోవాలని జోనల్ కమిషనర్లు, హెచ్‌ఓడిలకు సూచించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికను శాతం వందకు విజయవంతం చేసేలా ప్రతి విభాగం బాధ్యతాయుతంగా పనిచేయాలని కమిషనర్ సృజన స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని మెరుగైన రీతిలో అమలు చేయడానికి అవసరమైన మార్గదర్శకాలను అధికారులకు ఇచ్చారు.





**సమస్యలను తక్షణమే పరిష్కరించాలి**
**ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి**

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చూపే కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఉప్పల్ జోన్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా దేవేందర్ నగర్ ప్రాంతంలో కమిషనర్, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఎల్.బి. నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌లతో కలిసి పరిశుభ్రత, డ్రైనేజ్, మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. రహదారులపై పేరుకుపోయిన చెత్త, డ్రైనేజ్ కాల్వల్లో మట్టి పేరుకుపోవడం, వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ఎస్‌సిటిపి డంప్ కలెక్షన్ పాయింట్ పనులను సమీక్షించి వ్యర్థ నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పీర్జాదిగూడలోని ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి తడి–పొడి వ్యర్థాలను సేకరణ దగ్గరే వేరు చేయడం శుభ్రమైన నగర నిర్మాణానికి ముఖ్యమని తెలిపారు. బైరామల్‌గూడ ఫ్లైఓవర్ కింద అభివృద్ధి చేస్తున్న మల్టీ స్పోర్ట్స్ అరేనాను పరిశీలించి యువతకు క్రీడలను ప్రోత్సహించేలా అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే టికెఆర్ కాలేజ్ కమాన్ నుంచి ఎటిఆర్ గార్డెన్స్ వరకు సుమారు 2.16 కిలోమీటర్ల పొడవుతో ప్రతిపాదించిన గాయత్రి నగర్ ఫ్లైఓవర్ ప్రాజెక్టు ప్రణాళికను సమీక్షించారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గి, రవాణా సౌలభ్యం మెరుగుపడనుందన్నారు. ఈ పర్యటనలో కమిషనర్‌తో పాటు జోనల్ కమిషనర్లు, చీఫ్ సిటీప్లానర్ బి.ప్రదీప్ కుమార్, అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యువ ఆపదమిత్రులు మరో పది మందికి శిక్షణ ఇవ్వాలి

హైడ్రా అధికారులు సుదర్శన్, వర్ల పాపయ్య






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రాకృతిక విపత్తుల సమయంలో యువ ఆపద మిత్ర వాలంటీర్లు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని హైడ్రా అదనపు కమిషనర్, అదనపు సంచాలకులు ఆర్. సుదర్శన్, వర్ల పాపయ్య అన్నారు. యువ ఆపదమిత్రులుగా శిక్షణ పొందిన ప్రతి వాలంటీర్ తన శిక్షణను సమాజానికి ఉపయోగపడేలా మార్చాలని కోరారు. హైడ్రా కార్యాలయంలో గురువారం నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో సంగారెడ్డి, మెదక్, హైదరాబాద్, సిద్ధిపేట జిల్లాలకు చెందిన 115 మంది యువ ఆపదమిత్ర వాలంటీర్లు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువులతో పాటు ఈ ప్రత్యేక శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు లేదా ప్రమాదాలు సంభవించిన సమయంలో ప్రజలకు సహాయం అందించే మొదటి వ్యక్తులుగా యువ ఆపదమిత్రులు ఉండాలని తెలిపారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ సేవలు అందించాల్సిన బాధ్యత వాలంటీర్లపై ఉంటుందన్నారు. శిక్షణలో భాగంగా సిపిఆర్ అందించడం, వరదలు, అగ్ని ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను ఎలా రక్షించాలి, వాటిని ఎలా నియంత్రించాలి అనే అంశాలపై వాలంటీర్లకు అవగాహన కల్పించామని తెలిపారు. బాధ్యత గల పౌరులుగా ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వాలంటీర్ మరికొంత మందికి అవగాహన కల్పించి కనీసం మరో పది మందికి శిక్షణ ఇవ్వాలని అధికారులు సూచించారు. హైడ్రా కూడా వారి సేవలను వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లకు హైడ్రా తరపున ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా ఆర్ఎఫ్ఓ జయప్రకాశ్, డిఎఫ్ఓలు గౌతమ్, యజ్ఞనారాయణ, హైడ్రా ఇన్స్పెక్టర్ షంషుద్దీన్, ఏడిఎఫ్ఓ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. హైడ్రాలో శిక్షణ పొందడం తమకు గొప్ప అవకాశమని విద్యార్థులు తెలిపారు. వారం రోజుల శిక్షణ తమ అలవాట్లను మార్చి, మరింత చురుకుదనాన్ని కలిగించిందన్నారు.

# స్థల వివాదం హైడ్రా విచారణ

**చర్లపల్లి రైల్వే స్టేషన్ పక్కన సర్వే నంబర్ 186/4కు**



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు సమీపంలోని సర్వే నంబర్ 186/4కు సంబంధించి స్థల వివాదం తీవ్రమవుతోంది. ఈసి నగర్ హౌసింగ్ సొసైటి ఫిర్యాదు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా అధికార బృందం శుక్రవారం ఈ ప్రాంతాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ఇరు పక్షాల వాదనలు విన్న హైడ్రా అధికారులు భూమికి సంబంధించిన అన్ని ఆధార పత్రాలను సమర్పించాలని ఆదేశించారు. స్థల యాజమాన్యం విషయంల ఇరువర్గాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటంతో వివాదం మరింత ముదిరింది. ఈసి నగర్ హౌసింగ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ స్థలాన్ని గతంలో గిఫ్ట్ డీడ్ ద్వారా జిహెచ్ఎంసికి అప్పగించామని తెలిపారు. అందువల్ల ఈ భూమి ప్రభుత్వానిదే అని స్పష్టం చేసారు. మరోవైపు స్థలాలకు యజమానులమి చెప్పుకొంటున్న వారు మాట్లాడుతూ ఈ భూమిని తాము కొనుగోలు చేసినందున దీనిపై తమకు పూర్తి హక్కులు ఉన్నాయన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు అధికారిక సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి తమకు అప్పగించారాని తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి ఆధారాలతో కూడిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూముల ధరలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ స్థలం ధరలు కోట్లలో పలుకుతుండటం కారణంగా భూమి విషయంలో తలెత్తిన వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకొంది.

పరిస్థితిని సమీక్షించిన హైడ్రా అధికారులు తాము అడిగిన విధంగా ఇరు వర్గాల నుండి పత్రాలు సమర్పించిన అనంతరం తాము పరిశీలించి తగిన నిర్ణయం తీసుకొంటామని తెలిపారు. తుది నిర్ణయం వెల్లడి చేసేవరకు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఆదేశించామన్నారు. ఈ నేపథ్యంలో స్థల వివాదంపై స్పష్టత తీసుకొని రావాల్సిన బాధ్యత జిహెచ్ఎంసి అధికారులపై ఉందని స్థానికులు అభిప్రా య పడుతున్నారను.

సమగ్ర విచారణ జరిపి హైడ్రా, జిహెచ్ఎంసి అధికారులు సరైన నిర్ణ యం తీసుకోవాల్సిన బాధ్యత ఉంది. అధికారుల విచారణలో ఈసినగర్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బూడిద శ్రవణ్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షురాలు సిహెచ్ పద్మిని, కోశాధికారి కాసుల ఇందిరాగౌడ్, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు సత్తిరెడ్డి, ఈసి నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు ప్రసాద్, గోవర్ధన్, బాలయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తా

మల్కాజిగిరి ఎంపి ఈటల



**ప్రజాపక్షం/కాప్రా:** జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రెస్‌క్లబ్ జర్నలిస్టుల ప్రతినిధులు ఎంపిని మర్యాదపూర్వకంగా కల్సి సత్కరించారు. కాప్రా ప్రెస్‌క్లబ్ నూతన ప్రతినిధులకు ఆయన అభినందనలు తెలియచేసారు. ఈ కార్యక్రమం లో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జ్యోతిర్మయచారి, ప్రధానకార్యదర్శి ఆది మూలం శ్రీనివాస్, కోశాధికారి వట్టిపల్లి సురేష్, ఉపాధ్యక్షులు పలుగుల పవన్, లక్కిడి బాల్‌రెడ్డి, కార్యనిర్వాహణ కార్యదర్శి గడ్డమీద బాలరాజు గౌడ్, సీనియర్ జర్నలిస్టులు కెసి మోహన్, క్యాసాని సత్యనారాయణ, సహదేవాచారి, వేముల శంకర్, తదితరులు పాల్గొన్నారు. ఎఎస్ రావు నగర్‌లోని భవానీనగర్ కమ్యూనిటీ హాలులో జరిగిన నూతన జర్నలిస్టుల ప్రతినిధుల ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జర్నలిస్టుల సమస్యలను తన దృష్టికి తీసుకొని వస్తే ప్రభుత్వపరంగా రావల్సిన అన్ని సంక్షేమ పథకాలు దక్కేలా చూస్తానన్నారు. పత్రికా వార్తలను నిర్భయంగా అధికారులు, ప్రజల దృష్టికి తీసుకొని రావాలన్నారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులతో ఉద్యమకాలం నుండి తనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. ప్రజా సమస్యల కోసం పాత్రికేయులుగా విధుల్లో ఉండే వారందరికీ అండగా ఉంటానన్నారు. చర్లపల్లి మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాట్లాడుతూ జర్నలిస్టులు నిష్పక్షపాతంగా వార్తా కథనాలు రాయాలన్నారు. మరో మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణి మాట్లాడుతూ జర్నలిస్టులు గత దశాబ్దకాలంగా తాను చేసిన అభివృద్ధి పనులను ప్రజల ముందుంచటంలో తోడ్పడ్డారన్నారు. బిఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నేత సింగిరెడ్డి సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే తనకు పాత్రికేయులతో సత్సంబంధాలున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి, సింగిరెడ్డి ధనపాల్‌రెడ్డి, అంజయ్య, గుండారపు శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నేతలు కొత్త అంజిరెడ్డి, టిటిడిపి నేతలు సతీష్ బాబు, బిజెపి అధ్యక్షురాలు తుమ్మల సంధ్యారెడ్డి, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్, అంబటి వెంకటాచలం, రజనీకాంతరెడ్డి, రావు, మహేందర్, రామ్‌ప్రదీప్, సంపత్‌రావు, వెంకులు, తదితరులు పాల్గొన్నారు. భవానీనగర్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు కృష్ణారెడ్డి, చిరంజీవి, రామరాజు, పుల్లారావు, శ్రీనివాస గుప్తా, అశోక్‌రెడ్డి, వెంకటరెడ్డి, బాలతదితరులు ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలి ప్రతినిధులు రాజేందర్‌రెడ్డి, యానాల ప్రభాకర్, మధు, సుభాష్ చంద్రబోస్ తదితరు లు నూతన కమిటీ ప్రతినిధులను శాలువాలతో సన్మానించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి ప్రమాణ స్వీకారం చేయించారు.



## మహిళలు, చిన్నారులకు అండగా 'మార్గదర్శక్'

వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన హైదరాబాద్ సిటీ పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళలు, చిన్నారుల భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా 'మార్గదర్శక్' అనే వినూత్న కార్యక్రమానికి హైదరాబాద్ సిటీ పోలీసులు శ్రీకారం చుట్టారు. బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ విసి. సజ్జనర్ మార్గదర్శక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, పని ప్రదేశాల్లో ఇబ్బందులు, గృహ హింస వంటి ఘటనల్లో బాధితులు ఎవరిని ఆశ్రయించాలో తెలియక సతమతమవుతున్నారని అన్నారు. చాలామంది తమ సమస్యలను బయటకు చెప్పలేక మౌనంగా ఉండిపోతున్నారని, ఇది కాలక్రమేణా పెద్ద నేరాలకు దారితీస్తుందని, బాధితులకు భరోసా కల్పించేందుకే మార్గదర్శక్ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. బాధితులకు చట్టపరమైన రక్షణలు, పోలీసు వ్యవస్థపై అవగాహన కల్పిస్తూ, సరైన దిశానిర్దేశం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వివరించారు.


శిక్షణ పొందిన వాలంటీర్లు ఇకపై బాధితులకు, పోలీసు వ్యవస్థకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తారని, సమస్య తీవ్రతను బట్టి వారిని షీ టీమ్స్, భరోసా కేంద్రాలు లేదా న్యాయ నిపుణుల వద్దకు చేరవేస్తారని పేర్కొన్నారు. 'మార్గదర్శకులు కేవలం సలహాదారులుగా మాత్రమే వ్యవహరించాలి. బాధితులు భయాందోళనలకు గురికాకుం డా, వారికి అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాలను వివరించి, వ్యవస్థాగత సహాయం అందేలా చూడటమే మీ బాధ్యత' అని వాలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. ఇది కేవలం పోలీసుల కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజ లు, సంస్థల భాగస్వామ్యంతో నడిచే ప్రజా ఉద్యమమని ఆయన కొనియాడారు. మహిళా భద్రత లో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో, డిసిపి మహిళా భద్రతా విభాగం డాక్టర్ లావణ్య ఎన్.జె.పి. నేతృత్వంలో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (శాంతిభద్రతలు) ఎన్. శ్వేత, హెచ్‌సిఎస్‌సి సెక్రటరీ జనరల్ శేఖర్ రెడ్డి, ఉమెన్స్ ఫోరం జాయింట్ సెక్రటరీ ఖ్యాతి నారాయణ్, తదితరులు పాల్గొన్నారు.



## యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

కీసర ఎస్ఐ హరిప్రసాద్

**ప్రజాపక్షం/చర్లపల్లి :** యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని మత్తు పదార్థాలను వాడటం వలన ఆరోగ్యం క్షీణిస్తుందని కీసర పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్స్‌పెక్టర్ హరిప్రసాద్, మెడికల్ ఆఫీసర్ సిందూజలు అన్నారు. గురువారం కీసర మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ స్కూల్లో మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనారోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలను స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ బండారి శ్రీనివాస్‌రెడ్డి సౌజన్యంతో నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. మొదటి బహుమతి బోయ విఘ్నేశ్వరి రూ. 3 వేలు, సాబియా రెండవ బహుమతి రూ. 2 వేలు, సీమా భుష్ర మూడో బహుమతి రూ. 1 వేయి, కన్సోలేషన్ బహుమతి జగ్గల కిరన్‌కుమార్ రూ. 1 వేయి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పానీయాలు వాడటం వలన భవిష్యత్తు నాశనం కావడంతో పాటు నేరాలకు దారితీసే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలోమెడికల్ ఆఫీసర్ (పిడికే) డాక్టర్ సింధూజ, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ బండారి శ్రీనివాస్‌రెడ్డి, బిజెపి సీనియర్ నాయకుడు మెట్టు మహేందర్‌యాదవ్, ఉపాధ్యాయులు కె రవి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రమాదేవి, సుభద్రాదేవి, ఆనంద్, సుశీలత, చంద్రారెడ్డి, చందర్, ఎపిపిసి చైర్మన్ జబీనా, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



## టిడిపి నాయకురాలి మునిమనవడు తొలి పుట్టినరోజు వేడుకలు

**ప్రజాపక్షం /కూకట్‌పల్లి :** టిడిపి సీనియర్ నాయకురాలు రమాదేవి మునిమనవడు చిన్నారి ధృవన్ తొలి పుట్టినరోజు వేడుకలు కెపిహెచ్‌బి ఫంక్షన్ హాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ కార్యక్రమానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ విచ్చేసి చిన్నారి ధృవన్‌ను ఆశీర్వదించారు. చిన్నారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని వారు ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ మిత్రబృందం చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దండమూడి సామ్రాజ్యం, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకురాలు పద్మచౌదరి, ఉమా, కాంగ్రెస్ పార్టీ నాయకులు డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్, గంధం రాజు, మధు, కిలారి బాబు, హరి ప్రసాద్ నాయుడు, రంగమోహన్, పిడికిటి గోపాల్ చౌదరి, సాయిబాబు చౌదరి, శ్రీను, అఖిల్, డా.బిక్షపతి, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రెస్‌క్లబ్‌కు సహకారం అందిస్తా

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు తన వంతు సహకారం అందజేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రాంరెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షుడు పల్లా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని గురువారం నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కలిశారు. ఈ మేరకు రెండవసారి చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా మీడియా అకాడమీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వి.తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ లు కలిసి సిఎం రేవంత్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో కూడిన మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమంకోసం తన వంతు సహకారం అందజేస్తామన్నారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పారెల్లి సాగర్, ఉపాధ్యక్షులు శ్రీధర్ రావు, నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, దాస రాజు, ఓర్సు రమేష్ పాల్గొన్నారు.



## వికసిత్ భారత్‌లో మహిళలు భాగస్వాములు

బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షులు రాలు శిల్పా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో మార్చి 6న సోమాజిగూడలోని కత్రియా హోటల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపి బన్సూరీ స్వరాజ్ ముఖ్య అతిథిగా, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఎంపి డి.కె. అరుణ విశిష్ట అతిథులుగా పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శిల్పారెడ్డి ఆవిష్కరించారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంతో మహిళలు దేశ అభివృద్ధిలో ఎలా భాగస్వామ్యులు కావాలనే అంశంపై ప్రత్యేక చర్చలు నిర్వహిస్తామని చెప్పారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, రాష్ట్రంలో మహిళల భద్రతపై పరిస్థితి ఆందోళనకరంగా ఉందని శిల్పారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవ వేడుకలకు మహిళలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల లోనే కనివిని ఎరుగని రీతిలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి పొన్నాల్‌లో రాగి స్వాతి బాల్‌రెడ్డిల ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంబించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం సిఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నాడని అన్నారు. డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గానికి మూడు వేల ఇండ్లు కేటాయించారని చెప్పారు. ఇళ్లు లేని ప్రతి నిరుపేదలకు ఇండ్లు కట్టించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, కౌన్సిలర్లు పాపిరెడ్డి, మల్లేష్‌యాదవ్, మాజి ఉపసర్పంచ్ గడ్డం రమేష్, తూం వేణుగోపాల్‌రావు, దామోదర్‌రెడ్డి, మహేష్, ఇందిరమ్మ కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రాల్లో కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం /కొడంగల్:** అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, గురువారం దుద్యాల మండలం ఒకటి ,రెండవ అంగన్వాడీ కేంద్రాలను అకస్మికంగా తనిఖీచేసి ,పిల్లలు ఎంత మంది ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్యామ్ మ్యామ్ పిల్లలు అరోగ్య పరిస్థితి పై దృష్టి సారించాలని అదేశించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న పోషకాహరం ,ప్రీస్కుల్ విద్యా కార్యక్రమాలు , హజరు నమోదు పుస్తకాలు ,భద్రాతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు. కలెక్టర్ పిల్లలతో ముచ్చటించి వారికి అందిస్తున్న ఆహరం నాణ్యపై వివరాలు అగిడి తెలుసుకున్నారు. మద్యాహ్న భోజన సమయం అయినందున పిల్లలతో పాటు కలెక్టర్ భోజనం చేశారు. గర్భిణీ స్త్రీలు , బాలింతలకు అందిస్తున్న సప్లిమెంటరీ , పోషకాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సిబ్బందికి పలు సూచనలు చేస్తు ,పిల్లల ఆరోగ్య ,శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదేశించారు. ప్రీ,స్కూల్ విద్యా కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. ఈకార్యక్రమంలో శిశు సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, జయశ్రీ,నిర్మల, లు పాల్గొన్నారు.

## మూగజీవాలకు వైద్యసేవలు అందించేందుకే టోల్‌ఫ్రీ సేవలు

రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భగీష్ మిశ్రా



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకే 1962టోల్ ఫ్రీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భగీష్ మిశ్రా వివరించారు. గురువారం షాద్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జీవికే, ఈఎమ్ఆర్ఐ ద్వారా సంచార పశువైద్యశాల 1962టోల్ ఫ్రీ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ భగీష్ మిశ్రా మాట్లాడుతూ మూగజీవాలకు వైద్యసేవలు అంధించడంతో జాప్యం చేయరాదనే లక్ష్యంతోనే ప్రత్యేకంగా అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు. మూగ జీవాలకు సేవలంధించడంలో జాప్యం చేయరాదని సూచించారు. 1962ను ఫోన్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి మూగజీవాలు ఉన్న ప్రాంతానికి వెళ్ళి వైద్యసేవలు అందించాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతోనే ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. షాద్‌నగర్‌లోని స్థానిక పశువైద్యశాలలో 1962 సంచార పశువైద్యశాల వాహన సిబ్బంది డాక్టర్ హర్షిని, పరవేట్ గాయత్రి, ఫైలట్ శ్రీనివాస్‌లను ప్రత్యేకంగా అభినంధించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ షేక్‌జాన్ షాహిద్, రంగారెడ్డి జిల్లా మేనేజర్ రాజాబాబు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ సిఐగా సీతారాం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గురువారం షాద్‌నగర్ పట్టణ నూతన సిఐ సీతారాంకు సిఐ విజయ్‌కుమార్ బాధ్యతలను అప్పగించారు. ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ పరిధిలోని కందుకూరు సిఐగా విధులు నిర్వహిస్తున్న సీతారాం బదిలీపై షాద్‌నగర్‌కు వచ్చారు. స్థానికంగా పనిచేస్తున్న సిఐ విజయ్‌కుమార్ ఫ్యూచర్ సిటి పోలీస్ కమీషనరేట్‌కు అటాచ్ చేస్తున్న ఉత్తర్వులు చేశారు. ఈ సందర్భంగా నూతన సిఐ సీతారాం మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం తాను నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్దంగా ఉన్నట్లు వివరించారు.

## పేదలకు సొంతింటి కల నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ పేదలకు సొంతింటి కల నేరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో లబ్దిదారు లలిత నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని గృహప్రవేశం చేయించి నూతన వస్రాలను అంధించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబం సొంతింటిలో నివాసం ఉండాలన్నదే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, చందు యాదవ్, అంజి, ఫాయిజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రకృతి వ్యవసాయం, నూనె గింజల సాగుపై అన్నదాతలు అవగాహన పెంచుకోవాలని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని చించోడు రైతు వేధికలో వివిధ గ్రామాల సర్పంచులకు, ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు, రైతులకు అవకగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ అన్నదాతలు రసాయన ఎరువుకు ఎక్కువగా వాడకుండా కృత్రిమ ఎరువులు వినియోగించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆదునిక సాంకేతిక పద్దతులను అనుసరించి పంటలను సాగుచేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు హైమావతి, ప్రణీత, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, వెంకట్‌రెడ్డిపల్లి సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి, లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎలిమినేటి నరసింహ రెడ్డి అన్నారు. టీమ్ ఏఎన్ఆర్ ఆధ్వర్యంలో గురువారం రాగన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తొర్రూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎలిమినేటి నరసింహ రెడ్డి విద్యార్థులు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. పదో తరగతి అనేది విద్యార్థి జీవితంలో కీలక దశ అని, క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, టీమ్ ఏ ఎన్ ఆర్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు

# పకడ్బందీగా ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు చేపట్టనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు కె.చంద్రారెడ్డి, కె.శ్రీనివాస్‌తో కలిసి జిల్లా అధికారులు, ఆర్డీఓలు, ఎంపిడిఒలు, తహసీల్దార్లు, ఎంపిఒలు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. గ్రామ, పట్టణాల్లో ప్రజలకు లబ్ది చేకూర్చిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేవిధంగా చేయడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. మార్చి 6 నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులను అందరినీ భాగస్వాములు చేసి, జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాల్టీలల్లో కార్యక్రమాలను టీమ్ వర్క్ తో చేపట్టాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళలు, పర్యావరణం వంటి ప్రభుత్వ రంగాలకు సంబంధించిన 10 థీమ్‌లు ఉంటాయని, ప్రతి థీమ్ కొరకు నోడల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి కార్యక్రమాన్ని డాక్యుమెంటేషన్ చేయాలని, పనిచేయక ముందు, పనిచేశాక జరిగిన కార్యక్రమ ఫొటోలు, వీడియోలు తీసుకొని డాక్యుమెంటేషన్ చేయాల్సిందిగా ఆదేశించారు. రోజువారీ కార్యక్రమాలు నివేదిక రూపంలో అందజేయాల్సి ఉంటుందని సూచించారు. మార్చి 6 నుండి 15 వరకు పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ అనే థీమ్ ఉంటుందని, మార్చి 6న అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమ ప్రారంభోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. తమతమ కార్యాలయాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా చేపట్టే ప్రతి పని ప్రజలకు స్పష్టంగా కనిపించాలని చెప్పారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని, ఎవరైనా అలసత్వానికి తావు ఇస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిఆర్ఓ సంగీత, జడ్‌పిసిఇఓ సిహెచ్ కృష్ణారెడ్డి, డిపిఓ వి.సురేశ్ మోహన్, సిపిఓ సౌమ్య, డిఆర్‌డిఓ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషా, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీష్, మిషన్ భగీరథ అ ధికారులు రాజేశ్వర్, ఆర్అండ్‌బి అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, కోట్ల నవీన్ కుమార్‌రెడ్డి, కేషరామ్, జొన్నలగడ్డ పద్మావతితో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి



రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్ఐఓ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** రాష్ట్ర ప్రభుత్వం రానున్న బడ్జెట్ 2026–27లో విద్య, విద్యార్థి సంక్షేమం, యువజన అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) తెలంగాణ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్ఐఓ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఫరాజ్ అహ్మద్, ప్రధానకార్యదర్శి మహమ్మద్ హమ్మదుద్దీన్ మాట్లాడుతూ విద్యారంగ మౌలిక సదుపాయాల బలోపేతానికి, ఉన్నత విద్యాసంస్థలకు మద్దతు ఇచ్చేందుకు కేటాయించిన నిధులను సకాలంలో, పూర్తిస్థాయిలో వినియోగించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని కోరారు. ప్రైవేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు 25శాతం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. డిఎస్‌సి – 24లో మిగిలిన 666 ఉర్దూపోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా ప్రమాణాల మెరుగునకు అన్ని వర్సిటీలలో బోధనా సిబ్బందిని నియమించాలని కోరారు. సమావేశంలో ఎస్ఐఓ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ఫహీముద్దీన్, సహాయ కార్యదర్శి అబ్దుల్ గని, కార్యదర్శులు సయ్యద్ ఇమ్మదుద్దీన్, అబ్దుల్ సమి పాల్గొన్నారు.

## సైబర్ వలలో చిక్కుకొని లక్ష పోగొట్టుకున్న మాజీ ఉన్నతాధికారి

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని లక్ష రూపాయలు పోగొట్టుకున్న రిటైర్డ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, ఎల్ బి నగర్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మన్సూరాబాద్ డివిజన్ హిమపురి కాలనీ కి చెందిన కంచర్ల సత్యనారాయణ రెడ్డి,, రిటైర్డ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, సైబర్ నేరగాళ్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ మేఘనా రెడ్డిగా తనను తాను పరిచయం చేసుకున్న గుర్తుతెలియని మహిళ నుండి వచ్చిన కాల్ తో ఈ సంఘటన ప్రారంభమైంది.అని అన్నారు సత్యనారాయణ రెడ్డపేరు మీద రిజిస్టర్ చేయబడిన మొబైల్ నంబర్ నంబర్‌ను ఉగ్రవాద ఏజెంట్లకు రహస్య సమాచారాన్ని అందించడానికి ఉపయోగిస్తున్నారని ఆమె అతనికి తప్పుడు సమాచారం ఇచ్చింది మరియు అతను దర్యాప్తులో ఉన్నాడని మరియు తరువాత సీనియర్ అధికారిగా నటిస్తున్న మరొక వ్యక్తితో సంబంధం కలిగి ఉన్నాడని చెప్పింది. ఈ రెండవ వ్యక్తి తన వ్యక్తిగత గుర్తింపు వివరాలు మరియు బ్యాంక్ ఖాతా సమాచారాన్ని అందించమని అతనిని బలవంతం చేశాడు. అతన్ని మరింత భయపెట్టడానికి, స్కామర్లు అనేక మోసపూరిత పత్రాలను పంపారు, వాటిలో మనీలాండరింగ్ నేరంలో అతని ప్రమేయం ఉందని ఆరోపిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నుండి నకిలీ కేసు నివేదిక మరియు జాతీయ దర్యాప్తు సంస్థ నుండి నకిలీ "గోప్యతా ఒప్పందం" ఉన్నాయి. తీవ్ర ఒత్తిడి మరియు తక్షణ అరెస్టు బెదిరింపుతో, వారి "దర్యాప్తు"లో భాగంగా నిధులను బదిలీ చేయమని అతనికి సూచించబడింది. ఆ తర్వాత అతను ఫోనెపే ద్వారా మొత్తం రూ. 98,888/ రూపాయలను బదిలీ చేశాడు. తరువాత, అతను డిజిటల్ అరెస్ట్ స్కామ్‌కు బలైపోయాడని అతను అర్థం చేసుకొని పోలీసులకు పిర్యాదు చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

## పేదలకు చేయూతే లక్ష్యం



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామీణ పేద ప్రజలకు చేయూతను అంధించాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నామని కొండారెడ్డిపల్లి సర్పంచ్ పల్లె ఆనంద్‌కుమార్ తెలిపారు. గురువారం గ్రామానికి చెందిన కర్ణకోట యాదమ్మకు పింఛన్‌ను అంధించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కర్ణకోట యాదమ్మ అనే వృద్దురాలికి 2014నుండి 2019వరకు ప్రభుత్వం నుండి వృద్దాప్య పింఛన్ వచ్చిందని, 2019నుండి రావడం లేదని, ఇదేమిటని మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే వృద్దురాలి మరణించిందని నమోదు చేశారని వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి బతికి ఉన్న వృద్దురాలికి పింఛన్ ఇప్పించడం జరిగిందన్నారు. ఫించన్ రావడంతో వృద్దురాలి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేష్, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, అరవింద్, మాధవులు, గ్రామస్తులు మల్లేష్‌గౌడ్, కుమ్మరి కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి స్వరూప్‌కుమార్, కారోబర్ రాజులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రతిష్టాత్మకంగా వైద్య ఆరోగ్య సేవలు

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె లలితాదేవి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో వైద్య అరోగ్య సేవల ప్రత్యేక కార్యక్రమములో భాగంగా నేటి(6వ తేది) నుంచి స్పెషలిస్ట్ వైద్యులతో జిల్లా వ్యాప్తంగా ప్రారంబించబడుతుందని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు. మార్చి 06 నుంచి జూన్ 12 వరకు నిర్వహించబడుతున్నదని చెప్పారు. జిల్లాలో మొదటి దశ కార్యక్రమంలో మాతృ, ఆరోగ్యము, మహిళా ఆరోగ్యం. శిశు ఆరోగ్యము,వృద్ధుల కోసం చెపట్టబడుతున్నదన్నారు.. కార్యక్రమము 6 మార్చి నుండి 31 మార్చి వరకు నిర్వహించబడుతున్నదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్పెషలిస్ట్ డాక్టర్ల చే మహిళలకు, శిశువులకు తోపాటు వృద్దులకు పరీక్షలు నిర్వహించి చికిత్స చేస్తారని తెలిపారు. కొమర దశలోవున్న వారికి అనీమియా పరిక్ష.,వారికి మెన్సెస్ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు .ఆర్ బి ఎస్‌కె డాక్టర్‌ల ఆధ్వర్యంలో రెసిడెన్సియల్ పాఠశాల విధ్యార్థులకు కంటి పరీక్షలు, ఆడపిల్లలకు గైనకాలజిస్ట్ ల చే పరిక్షలు చేసి చికిత్స, సూచనలు అందిస్తారు.వృద్ధుల కోసం, వృదాప్య ఆశ్రమాలలో కూడా స్పెషలస్టీ వైద్యులచే పరీక్షలు నిర్వహిస్తారు అదేవిధంగా మోగా హెల్త్ క్యాంప్ మహిళలకు సింధు హస్పిటల్ సౌజన్యంతో, జిల్లా కలెక్టర్ నారాయణ్‌రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె లలిత దేవి ఆధ్వర్యంలో నిర్వహంచబడుతున్నదని పేర్కొన్నారు. క్యాంపులో గైనాకాలజి, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, డెర్మటలోజీ అప్తమాలజి, ఈం ఎస్.టి., డెంటల్ సెషలిస్ట్ వైద్యులు పాల్గోని పరిక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలకు, మామోగ్రామ్ అల్ట్రాస్మియర్, ఇసిజి., 2 డి ఎకో ఎ.ఎక్సీరే వంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ల్యాబ్ ఇన్వెష్టిగేషన్ లు సీబీపీ ల్ ఫ్టీ ,ఆర్ఎఫ్‌టి, థైరాయిడ్ ప్రొఫైల్ ,హచ్ వి,వీడీఆర్ ఎల్, ఆర్‌బిఎస్, లిపిడ్ ప్రొఫైల్ అండ్ హెచ్‌బిఎసి, టెస్టులు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ అధ్వర్యంలో నిర్వహిస్తారని డిఎంహెచ్ఒ తెలిపారు.



## ఇందిరమ్మ రాజ్యంతోనే పేదలకు ఇండ్లు

పామేన భీమ్ భరత్



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి;** ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరిందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ అన్నారు. గురువారం శంకర్ పల్లి మండల పరిధిలో చందిప్ప గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నాడైనా,నేడైయిన పేదల పక్షాన ఉంటుందని, పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.గత ఎన్నికల మేనిఫస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారని గుర్తుచేశారు. ఎన్నికల మేనిఫస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. కార్యక్రమంలో మండలం అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, బద్దం చిన్న కృష్ణరెడ్డి, సేవాలాల్ అధ్యక్షులు నసీరోద్దీన్, మాజీ ఎంపిటిసి ఎ.జాజ్, కౌన్సిలర్ సమీ, ఏఎంసి డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, శశికిరణ్ , తౌఫీక్, శివ , అంతప్పగూడ కొండ పెంటయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అధునాతన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొందుర్గు:** అధునాతన వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో అన్నదాలకు అధునాతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్‌టి పత్తి విత్తనాలు సాగు చేయడం ద్వారా కలిగే నష్టాలు, లాభాలను వివరించారు. రైతులు వాడే కలుపు మందు వల్ల వాతావరణం కలుషితం అవుతుందని, డిఏపి, యూరియాను అవసరం ఉన్న మేరకు అందించేందుకు కృషిచేయాలని సూచించారు. ప్రభుత్వం గుర్తింపు లేని కంపెనీల ద్వారా విత్తనాలు తీసుకోవద్దని, నిబంధనలకు విరుద్దంగా కొనుగోలు చేస్తే తీవ్ర నష్టాలు జరిగే అస్కారం ఉంటుందని వివరించారు. పంట మార్పిడితో చీడ పీడల నుండి దూరం కావచ్చని, అయిత్ ఫామ్ పంటల దిగుబడి గురించిన రైతులకు అవగాహన కల్పించారు. అయిల్ ఫామ్ పంటలను ఒక్కసారి నాటిగే ఇరవై ఏళ్ళ వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయని, దాంతో రైతు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సదస్సులో వ్యవసాయ అధికారులు వాసవి, నిఖిల్, రమణ, లక్ష్మీకాంత్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

# యువతను విజ్ఞానవంతులు చేయాలన్నదే లక్ష్యం

ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్

పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి రూ.29.70కోట్లు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** యువతను చైతన్య పరచడంతో పాటు విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.29.70కోట్ల నిధులు మంజూరు చేసిందని, గతంలోనే లింగారెడ్డిగూడ వద్ద పాలిటెక్నిక్ కళాశాలకు 3ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందని వివరించారు. ఈ భవనాన్ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.29.70కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజవర్గంలోని మొగిలిగిద్దలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, కొందుర్గులో ఇంటిగ్రేటేడ్‌స్కూల్, అదే విధంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల అభివృద్ధి కోసం కోటి రూపాయల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్య ఇస్తూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరమైన విద్యను అందిస్తే జీవితంలో వారి కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రభుత్వానికి అప్పగించి అక్కడి నుండే విద్యను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నేతలు బాల్‌రాజ్ గౌడ్, మహ్మద్‌ఇబ్రహీం, దంగు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్లలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్...** రాజ్యసభ అభ్యర్థులు వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీల నామినేషన్ పర్వంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ నుండి రాజ్యసభకు నామినేషన్లు వేసిన ఇద్దరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రం నుండి రాజ్యసభకు నామినేషన్లు వేసిన ఇద్దరు వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు అవకాశం ఉందన్నారు. రాజ్యసభలో తెలంగాణ వాణి వినిపించేందుకు అన్నివిధాల ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.


ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
06-03-2026
www.prajapaksham.in

తారక్ ఫిలిం హౌస్ బ్యానర్ పై హీరో ప్రశాంత్ రాదారపు హీరోయిన్ అనుశ్రీ నటించిన చిత్రం రవం. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా మార్చి 6న ఆహాలో విడుదల కాబోతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ఇటీవల విడుదల చేశారు,

రీల్

## 'మిషన్ సి1000'కొత్త కాన్సెప్ట్

### సంగీత దర్శకుడు శ్రీధర్ ఆత్రేయ




తేజేశ్వర్ , ప్రజ్ఞ్య నయన్ హీరో హీరోయిన్లుగా తేజేశ్వర్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన మిషన్ సి 1000 సినిమా ఇంతవరకు ఇండియన్ స్క్రీన్ పై రానటువంటి కథతో తెరకెక్కించారని సంగీత దర్శకుడు శ్రీధర్ ఆత్రేయ అన్నారు. 6వ తేదీన ఈ సినిమా విడుదల అవుతున్న సందర్భంగా శ్రీధర్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మన హిందూ ధర్మంలో ఆవుకు ఇంతగొప్ప విలువ ఉందొ తెలియజేసే కథతో తేజేశ్వర్ ఈ మిషన్ సి 1000 సినిమాను రూపొందించారని అన్నారు. పాన్ ఇండియా సినిమాగా దీన్ని నిర్మించారు. బాలీవుడ్ లో ప్రతిష్టాత్మకమైన రాజశ్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ వారు ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారని చెప్పారు. ఇందులో రాముడిపై ఉన్న పాట బాగా పాపులర్ అయిందని చెప్పారు. తగ ఇరవై యేళ్ళకు పైగా తెలుగు సినిమా పరిశ్రమలో పని చేస్తున్న తాను బ్రహ్మచారులు, నల్లబ్బాయి తెల్లమ్మాయి, నీతోనే నేనున్నా, లవ్ షో కన్నడ తరంగం తరంగం తెలుగు, దేవునితో పోరాటం, చిన్న హృదయాల పిల్లల చిత్రం, తుళ ధురవ మరాఠీ చిత్రం, గోప్యం, కొత్త వింత, కాళోజీ బయోపిక్, మిషన్ 1000 మొదలైన దాదాపు 30 చిత్రాలకు పని చేశానని అన్నారు. దివంగత గాయకుడు ఎస్ పీ బాలసుబ్రమణ్యం తనను ఎంతగానో మెచ్చుకున్నారని అన్నారు. దివంగత రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి తో తనకు మంచి సాన్నిహిత్యం ఉండేదని అన్నారు. ఎన్ సి సి ఆర్ డీ సి క్యాడెట్‌లకు శిక్షణ ఇవ్వడం ,వరుసగా 2 ఆల్ ఇండియా కల్చరల్‌ఆర్ డీ సి గోల్డ్ మెడల్స్ లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఖచ్చితంగా మిషన్ సి 1000 సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని అంటున్న శ్రీధర్ ఆత్రేయ ఈ సినిమాలో ఒక ముఖ్యమంత్రి పాత్రను కూడా పోషించానని చెప్పారు. హిందీ వెర్షన్ లో ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి పాత్రను ఈ సినిమాను తాను చేశానని చెప్పారు. మరో రెండు హిందీ సినిమాలతో పాటు రెండు తెలుగు సినిమాలకు సంబదించిన చర్చలు జరుగుతున్నాయని, వాటి వివరాలు త్వరలోనే వెల్లడిస్తానని శ్రీధర్ ఆత్రేయ తెలిపారు.

## 'పోలీస్ కంప్లైంట్'లో ప్రేమ గీతం



సౌత్ ఇండియన్ టాలెంటెడ్ నటి వరలక్ష్మి శరత్ కుమార్, యాక్టర్ నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'పోలీస్ కంప్లైంట్'. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై, బాలకృష్ణ మహారాణా నిర్మిస్తున్న ఈ సినిమాలో వరలక్ష్మి శరత్ కుమార్ నవీన్ చంద్ర జంటపై చిత్రీకరించిన బ్యూటిఫుల్ మెలోడియస్ సాంగ్ 'ప్రేమ ఓ ప్రేమ' అనే పల్లవితో మొదలైన ప్రేమ గీతాన్ని సీనియర్ జర్నలిస్టు ప్రభు లాంచ్ చేశారు. ఈ పాట అన్విక ఆడియోస్ ద్వారా రిలీజ్ అయింది.'ప్రేమ ఓ ప్రేమ' పాటకు సంగీతం సుధాకర్ మారియో సమకూర్చారు. హారర్ థ్రిల్లర్, అవుట్ అండ్‌అవుట్ యాక్షన్ ఎంటరటైనర్‌గా ఈ సినిమా తెరకెక్కించినట్టు తెలిపారు.యాక్షన్, కామెడీ, రొమాన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్, నవీన్ చంద్ర, రాగిణి ద్వివేది, కృష్ణ సాయి, ఆదిత్య ఓం, రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, రవిశంకర్, పృథ్వి, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్, దిల్ రమేష్ తదితరులు నటిస్తున్నారు. దాదాపు 52 మంది సీనియర్ ఆర్టిస్టులతో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో ఎస్.ఎన్. హరీష్ సినిమాటోగ్రఫీ, డ్రాగన్ ప్రకాష్–రవితేజ ఫైట్స్ హైలైట్‌గా నిలుస్తాయని తెలిపారు. వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, రాగిణి ద్వివేది పాత్రలు వారి గత చిత్రాలకు భిన్నంగా ఉంటాయని తెలిపారు. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్: కె.వి. రమణ, ఎడిటర్: అనుగోజు రేణుకా బాబు, కొరియోగ్రఫీ:పైడి రాజు, సన్ రేస్, మెహర్ బాబా,ఫైట్స్ : డ్రాగన్ ప్రకాష్ రవితేజ,సంగీతం:ఆరోహణ సుధీంద్ర సంజీవ్ మేగోటి సుధాకర్ మారియో, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్, డీఓపీ ఎస్ ఎన్ హరీష్, ఆపరేటివ్ కెమెరామెన్ : సెంథిల్ కుమార్.

## 19న'ఉస్తాద్ భగత్ సింగ్'



పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా అనుకున్న దానికంటే ముందుగానే ప్రేక్షకులను అలరించడానికి వచ్చేస్తోంది. ఈ చిత్రాన్ని మార్చి 19వ తేదీన విడుదల చేయనున్నట్లు తాజాగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దాదాపు రెండు వారాల పాటు ఉండే సెలవుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నారు.పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న మరో భారీ ఎంటర్‌టైనర్ ఇది. గతంలో 'గబ్బర్ సింగ్'తో బాక్సాఫీస్ వద్ద చరిత్ర సృష్టించారు. ఆ మ్యాజిక్‌ను తిరిగి సృష్టించడానికి, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తరుణంలో మరిచిపోలేని థియేటర్ అనుభవాన్ని అందించడానికి ఈ ద్వయం సిద్ధమవుతోంది.'ఉస్తాద్ భగత్ సింగ్' నేపథ్య సంగీతం బాధ్యతలను ఎస్. తమన్‌కు తీసుకున్నారు. దేవి శ్రీ ప్రసాద్ అందించిన పాటలు ప్రేక్షకులను డ్యాన్స్ చేయిస్తే, తమన్ తన నేపథ్య సంగీతంతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళనున్నారు.పరస్పర చర్చల అనంతరం సినిమా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మార్పు చేయడం జరిగింది.'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల, రాశిఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. తమిళ నటుడు పార్థిబన్ కీలకపాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కథనం: కె. దశరథ్, రమేష్ రెడ్డి,రచనా సహకారం: ప్రవీణ్ వర్మ, చంద్ర మోహన్ , కూర్పు: కార్తిక శ్రీనివాస్, కళ: ఆనంద్ సాయి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లు: ఆర్, చంద్రశేఖర్, దినేష్ నరసింహన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: హరీష్ పై, ఫైట్స్: రామ్–లక్ష్మణ్, నబకాంత్, పృథ్వీ.

## 'లీడర్' టీజర్ రిలీజ్



లెజెండ్‌శరవణన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'లీడర్'. ఈ చిత్రాన్ని లెజెండ్‌శరవణ స్టోర్స్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. దర్శకుడు ఆర్ ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో పాయల్ రాజ్ పుత్ హీరోయిన్ గా నటిస్తోంది. 'లీడర్' సినిమా ఏప్రిల్ లో గ్రాండ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు.'లీడర్' మూవీ టీజర్ ఎలా ఉందో చూస్తే నా కూతురితో పాటే నేనుండాలి, దాని కోసం ఈ ప్రపంచాన్ని ఎదిరించమన్నా ఎదిరించి గెలుస్తాను అనే పవర్ ఫుల్ డైలాగ్ తో టీజర్ ప్రారంభమవుతుంది. తన కుటుంబం కోసం చేసిన పోరాటంలో హీరో ఖైదీగా మారడం, జైలులో కూతురినే గుర్తు తెచ్చుకుంటూ బాధపడటం టీజర్‌లో చూపించారు. హీరో భార్య క్యారెక్టర్‌లో పాయల్ రాజ్ పుత్ నటిస్తోంది. ఈ అందమైన కుటుంబంలో ఎవరు తమ స్వార్థం కోసం చిచ్చు పెట్టారు అనేది టీజర్ లో ఆసక్తి కలిగిస్తోంది. తన కుటుంబానికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునే శక్తివేల్ అనే క్యారెక్టర్‌లో హీరో శరవణన్ ఇంటెన్స్ పర్‌ఫార్మెన్స్ కనబర్చారు. ఆయన చేసిన భారీ యాక్షన్ సీక్వెన్సులు టీజర్ కు ఆకర్షణగా నిలుస్తున్నాయి. మాస్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో 'లీడర్' సినిమా ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేయబోతున్నట్లు టీజర్ తో తెలుస్తోంది.పాయల్ రాజ్ పుత్, శ్యామ్, ఆండ్రియా, సంతోష్ ప్రతాప్, లాల్, బాహుబలి ప్రభాకర్, అమృత అయ్యర్, వీటీవీ గణేష్, ఐశ్వర్య, అరంతంగి నిశా, ఐయాల్, జయమిశ్రా, పత్మాన్, యోగిరామ్, ఓక్ సుందర్, మహానది శంకర్, మరియమ్ జార్జ్, ఆదిత్య కతియార్, వేల్ అరుణాచలం, నిరంజన్, శోభన్ బాబు, అశోక్ పాండియన్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్షన్ జి.దురైరాజ్, స్టంట్స్ మహేశ్ మాథ్యూ, ఎడిటింగ్ ప్రదీప్ ఇ.రాఘవ్, సినిమాటోగ్రఫీ ఎస్. వెంకటేష్,మ్యూజిక్ జిబ్రాన్ వైభోద.

## గోల్డెన్ స్పూన్‌తో పుట్టిన ఐరన్ మ్యాన్ రామ్ చరణ్



అనంత శ్రీరామ్

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'పెద్ది'. ఇటీవల విడుదలైన రెండో పాట 'రై రై రా రా' పాట సంచలనంగా మారింది. రికార్డింగ్ బ్రేకింగ్ వ్యూస్ తో టాప్ వన్ లో ట్రెండ అవుతోంది. ఏఆర్ రెహ్మాన్ మ్యూజిక్, అనంత శ్రీరామ్ లిరిక్స్, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అన్నీ కలసి ఈ సాంగ్ హిట్ అయింది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గేయ రచయిత అనంత శ్రీరామ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. పెద్ది 'రై రై రా రా' పాటకు అద్భుతమైన రెస్పాన్స్ రామ్ చరణ్ రుద్రతాండవం, ఏఆర్ రెహమాన్ ధీర శంఖారావం, రత్నవేలు చిత్రీకరణలో ఉన్న మాయాజాలం, వీటన్నిటి మధ్యలో నుంచి కూడా పాటలో లిరిక్స్ బాగున్నాయి, ఫలానా లైన్ విను, ఫలానా లైన్ బాగుంది అని అన్ని చోట్ల సాహిత్యానికి ప్రశంసలు రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. చాలా రాత్రులు రింగ్ రోడ్డు మీద అలా డ్రైవ్ చేస్తూ, కాఫీ షాపుల్లో కూర్చుని చాలా చర్చించాం. అలా నెలలు తరబడి మదనపడితే వచ్చిన పాట ఇది. సాహిత్యంలో మిత్ర సంహిత ప్రక్రియలో పాట రాయాలని అనుకున్నాను. ''నిన్నటి లాగే రేపు ఉన్నదంటే ఈ రోజేం పీకావనే నీ అయ్య వడ్డి నీ బిడ్డ కడితే నువ్వు ఏమి పొడిచావనే' .. ఈ లైన్స్ మీరు గమనిస్తే ఒక స్నేహితుడు మరో స్నేహితుడితో మాట్లాడుతున్నట్టుగానే ఉంటుంది.ఈ పాట ఎలా ఉండాలి అని అనుకున్నప్పుడు యూత్‌కి ఒక యాంథమ్ లాగా ఉండాలి అని డైరెక్టర్ బుచ్చిబాబు చెప్పారు. ''రైరై రారా రైరై రారా అడ్డే లేని ధారై రా రా రైరై రారా రైరై రారా హద్దే లేని తిరై రారా దూకేటి జోరై రా పోరరేటి పోరై రా నీలో ఆరు నూరై రా మందల్లోంచి వేరై రా భయ్యం పీకి పారేయ్ రా సిగ్గుంటే సీరై రా జై కొట్టేటి పేరై రా నీ రాక చూసి లోకం చేసే హోరై హోరై హోరై రా రా'' ఈ పదాల్ని స్వరం లేకుండా పాడిన మంచి గేయ కవిత చదివిన అనుభూతిని కలిగిస్తాయి.ఈ పాటలో ఎక్కువమంది పాతేసుకోకోయలా.. నువ్వు నిన్నే నీ లోపల.. పాతికేళ్లకే..నువ్వు పాతబడిపోకురా.. ఈ లైన్ ని కోట్ చేస్తున్నారు. షూటింగ్ లోకేషన్‌లోఈపాటను చరణ్‌కి వినిపించాను. పాట విని నన్ను హత్తుకున్నా రు.దాదాపు రెండు నెలల వరకు సమయం తీసుకున్నా. పరాయి భాషల ప్రభావం లేని అచ్చ తెలుగు పాటిది.నా పాట విని ఆత్మహత్యను విరమించుకునే సందర్భము రావాలి. ఆ లక్షణం ఈ పాటకి కనిపిస్తోంది.మూడు పాటలు రాబోతున్నా యి. బాలాజీ గారు రాసిన చికిరి, ఈపాట ఎంత వైవిధ్యంగా వున్నాయో.. మిగతా పాటలు కూడా దేనికవే ప్రత్యేకంగా వుంటాయి.

నటన నేను కోరుకున్నది కాదు, అలాగని దానిపై నాకు విరక్తి కూడా లేదు. నేను పాటలు రాస్తున్నప్పుడు నేను ఇచ్చే ఎక్స్‌ప్రెషన్స్ డైరెక్టర్స్ కి నచ్చి అలా ఓ క్యారెక్టర్ కి నేను సరిపోతానంటే వాళ్లు చెప్తుంటారు. నేను కూడా సరదాగా చేస్తుంటాను. అంతేగాని ప్రత్యేకంగా నటనపై నాకు దృష్టి లేదు. పాటల రచయితగా తొలిసారి నా పేరు చూసుకున్న తొలి చిత్రం చిరంజీవి అందరివాడు. మరో అద్భుతమైన అదృష్టమేమిటంటే.. ఒకే సంవత్సరంలో చిరంజీవి సినిమా, అలాగే చిరంజీవి అబ్బాయి రామ్ చరణ్ సినిమా.. ఇలా రెండు పెద్ద హిట్స్ రావడం అనేది గొప్ప అదృష్టం. చరణ్ ప్రతి నిమిషం కష్టపడే వ్యక్తి. గోల్డెన్ స్పూన్ తో పుట్టిన ఐరన్ మ్యాన్ రామ్ చరణ్. స్పిరిట్, చెన్నై లవ్ స్టోరీ సినిమాల్లో రాస్తున్నాను. చాలా మంచి పాటలు ఉంటాయి.

### హైదరాబాద్‌లో అంతర్జాతీయ మహిళల

## హాకీ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు పూర్తి

### టోర్నమెంట్ షెడ్యూల్ విడుదల చేసిన మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోందని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫ:2026 టోర్నమెంట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో నిర్వహించిన గురువారం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహణాధికారి సోనీ బాలాదేవి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ఈ పోటీలు మార్చి 8 నుంచి 14 వరకు గచ్చిబౌలిలోని హాకీ స్టేడియంలో జరుగనున్నాయని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ ఇటలీ, కొరియా, స్కాట్లాండ వేల్స్ జట్లు పాల్గొంటున్నాయన్నారు. మహిళల వరల్డ్ కప్ హాకీ అర్హత పోటీలకు ఈ టోర్నమెంట్ కీలకంగా మారనుందని మంత్రి పేర్కొన్నారు. టోర్నమెంట్‌ను లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అన్ని సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రోటర్ఫ్ మైదానం, కఠిన భద్రతా ఏర్పాట్లు, ఆధునిక సదుపాయాలు, క్రీడాకారిణులకు అత్యుత్తమ వసతి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏర్పాట్లలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డే హాకీ, హాకీ ఇండియా ప్రతినిధులతో సమన్వయం కొనసాగుతోందని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల మధ్య సమగ్ర సమన్వయంతో ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.ఇప్పటికే టోర్నమెంట్‌లో పాల్గొనే అన్ని జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయని, తెలంగాణ ప్రభుత్వం వారికి ఘన స్వాగతం పలికిందని చెప్పారు. ప్రాక్టీస్‌కు కావలసిన అన్ని సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాల వసతి ఏర్పాట్లు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఆధునికీకరించిన గచ్చిబౌలి ఆస్ట్రోటర్ఫ్ మైదానంలో క్రీడాకారిణులు ఉత్సాహంగా సాధన చేస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రతినిధులు, క్రీడాకారిణుల కోసం నగరంలోని వారసత్వ ప్రదేశాల పర్యటనలు, వినోద కార్యక్రమాలు కూడా నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు.ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహంతోనే ఇలాంటి అంతర్జాతీయ టోర్నమెంట్లను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నామని మంత్రి పేర్కొన్నారు. గత రెండేళ్లలో రాష్ట్ర క్రీడా రంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందని తెలిపారు. ఇటీవల గ్రామ స్థాయి నుంచి ఐదు దశల్లో నిర్వహించిన ముఖ్యమంత్రి కప్ క్రీడా పోటీలు కూడా విజయవంతంగా జరిగాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. గచ్చిబౌలిలో జరిగే హాకీ పోటీలకు ప్రజలు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.



ఇటీవల వివాహ బంధంతో ఒక్కటైన కొత్త జంట విజయ్ దేవరకొండ -రష్మికలకు వారి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## కుమ్మెర ఘటన నిందితులను శిక్షించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రజక, దళిత కుటుంబాలపై జరిగిన దాడికి కారకులైన నిందితులను వెంటనే శిక్షించాలని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జేన్‌వెస్లీ, కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, సీనియర్ నాయకులు డిజి నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ ప్రజా సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని చిక్కడపల్లి పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందని వారు వాపోయారు. నిరసకారులకు తమ మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేశారు. అరెస్టు చేసిన నిరసన కారులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.కుమ్మెర ఘటనకు బాధ్యులైన ఆ గ్రామ సర్పంచ్ రాంరెడ్డి, ఇతర నిందితులపై ఇప్పటివరకు ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కింద, హత్య కేసు నమోదు చేయలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రమంతా ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు ఘటనను ఖండిస్తున్నారని తెలిపారు. బాధితులకు అండగా నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ కేసు విచారణ కోసం ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు.

## రూ.47,984 కోట్లతో రైల్వే పనులు

### నాంపల్లి స్టేషన్ పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొత్త రైల్వే మార్గాలు, ద్విగుణీకరణ, మూడో మార్గాలు, స్టేషన్ పునర్వికాసం, భద్రతా పనులు తదితర ప్రాజెక్టులు కలిపి తెలంగాణ రాష్ట్రంలో రూ. 47,984 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వే స్టేషన్ పునర్వికాస పనులను రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతో కలిసి కిషన్‌రెడ్డి గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.స్టేషన్ భవనం నిర్మాణం, భూగర్భ వాహన నిల్వ స్థలం, ప్రయాణికుల రాకపోకల ప్రదేశం తదితర పనులను మంత్రి సందర్శించి పనుల పురోగతిపై సమీక్షించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతా చర్యలను కూడా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రధాన నిర్వాహక అధికారి సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ విభాగ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. నాంపల్లి రైల్వే స్టేషన్‌ను రూ. 327.27 కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో పునర్వికాసం చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నాంపల్లి స్టేషన్‌లో రోజుకు సుమారు 60 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని, రోజుకు సగటున 28 వేల మంది ప్రయాణికులు వినియోగిస్తున్నారని వివరించారు. పునర్వికాసం పూర్తయ్యాక స్టేషన్‌లో 16 లిఫ్టులు, 8 ఎస్కలేటర్లు, 2 ట్రావెలేటర్లు, భూగర్భ పార్కింగ్, పాదచారి వంతెనలు, సిసి కెమెరాలు, వై ఫై, ఆహార కేంద్రాలు, వైద్య సదుపాయాలు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణకు రూ. 5,454 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–పుణే మధ్య అధిక వేగ రైల్వే మార్గాలను కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించినట్టు మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పోలింగ్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

కాఠ్మండు–2 నియోజకవర్గంలో ఓటు వేశారు. ఓటు దేశ ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేస్తుందని ఎన్‌సిపి నాయకుడు ప్రచండ అన్నారు. ప్రసిద్ధగాంచిన 2025 సెప్టెంబరు జెనరేషన్ జెడ్ ఉద్యమం తర్వాత నేపాల్ కొత్త ప్రయాణం ప్రారంభించడానికి ఈ ఎన్నికలను మేలి మలుపుగా భావిస్తున్నారు. దాదాపు కోటీ 90 లక్షలమంది అర్హులైన ఓటర్లు నేపాల్‌లో ఉన్నారు. ఎన్నికనే పాల్ మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి (సిపిఎన్–యుఎంఎల్) సహా ప్రచండ నాయకత్వాన గల ఎన్‌సిపి, రవి లామించ్‌హాన్ నాయకత్వానగల రాష్ట్రీయ స్వతంత్రపార్టీ, గగన్ థాపా నాయకత్వానగల నేపాలీ కాంగ్రెస్ పోటీలో ఉన్నారు.

## రాజ్యసభకు నితీశ్

(మొదటి పేజీ తరువాయి)

నితీశ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బిహార్‌కు కొత్త సిఎం రానున్నారు. ఈ ముఖ్యమంత్రి పదవి బిజెపికే దక్కొచ్చని వార్తలు వస్తున్నాయి. బిహార్ కొత్త ముఖ్యమంత్రి పదవికి పలువురు పోటీపడుతున్నారు. ఆ జాబితాలో డిప్యూటీ సిఎంలు సామ్రాట్ చౌధరీ, విజయ్‌కుమార్ సిన్హా, బిహార్ మంత్రి దిలీప్ జాయస్‌వాల్, దిఘా బిజెపి ఎమ్మెల్యే సంజీవ్ చౌరాసియా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్లు వినిపిస్తున్నాయి. కాగా.. నీతీశ్ నాలుగు నెలల క్రితమే బిహార్ ముఖ్యమంత్రిగా పదోసారి బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. జెడియు కార్యకర్తల ఆందోళన.. బిహార్ సిఎం నితీశ్‌కుమార్ రాజ్యసభకు వెళ్తున్న నేపథ్యంలో ఆందోళనలు వెల్లువెత్తున్నాయి. నితీశ్‌ను రాజ్యసభకు పంపవద్దని, ఆయనను తాము బిహార్ సిఎంగా మాత్రమే చూడాలని అనుకుంటున్నామని కార్యకర్తలు ఆందోళన చేస్తున్నారు. ఈ మేరకు నితీశ్ కుమార్ నివాసం ముందు వారు ఆందోళనకు దిగారు. నితీశ్‌కుమార్‌ను బలవంతంగా రాజ్యసభకు పంపుతున్నారని, దీనికి వెనుక ఏదో కుట్ర ఉన్నదని జెడియు కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

## సిపిఐ ఖండన

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాఇజ్రాయెల్ దాడి వల్ల భారీ నష్టం సంభవించిందని సిపిఐ ఈ ఘటనను ఖండించింది. శ్రీలంక తీరానికి కేవలం 40 నాటికల్ మైళ్ల దూరంలో 'ఐరిస్ దేనా'పై అమెరికా నావికాదాళ సబ్‌మెరైన్ దాడిచేసి ముంచేసినట్లు వచ్చిన వార్తలపై సిపిఐ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ దాడి అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలను పెంచిందని, భారతదేశ తీరాలకు దగ్గరగా హిందూ మహా సముద్ర ప్రాంతంలోకి ఇలాంటి శతృత్వాలను తీసుకురావడం ద్వారా ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి విఘాతం కలిగించిందని, ఈ చర్య పొరుగు దేశాలను విస్తృత సంఘర్షణలోకి నెట్టివేసే ప్రమాదం ఉందని పార్టీ పేర్కొంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఈ తరహా భారీ సంఖ్యలో సైనికుల పెంపు అంతర్జాతీయ చట్టాన్ని, సముద్ర భద్రతను దెబ్బతీస్తోందని, ఈ ప్రాంత ప్రజల జీవితాలు, జీవనోపాధి, భద్రతను కూడా ప్రమాదంలో నెట్టివేస్తుందని, హిందూ మహా సముద్ర ప్రాంతాన్ని సైనిక ఘర్షణ, యుద్ధ వేదికగా మార్చడం సహేతుకం కాదని సిపిఐ పేర్కొంది.ఈ విషయంలో భారతప్రభుత్వం సూత్రప్రాయమైన, స్వతంత్ర వైఖరిని అవలంభించాలని సిపిఐ కోరింది. భారతదేశం తన ఓడరేవులు లేదా లాజిస్టిక్ సౌకర్యాలను అమెరికా నావికాదళం లేదా ఏదైనా విదేశీ సైనిక దళం ఉపయోగించడానికి అనుమతించకూడదని పార్టీ విజ్ఞప్తి చేసింది. ఈ ప్రాంతంలో తీవ్రతరమవుతోన్న యుద్ధంలో మనదేశం భాగస్వామి అయ్యే విధంగా అటువంటి ప్రాప్యతను అనుమతించడం, భారతదేశ దీర్ఘకాలిక వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి, అలీనత, శాంతియుత సహజీవన నిబద్ధతకు విరుద్ధంగా ఉంటుందని సిపిఐ పేర్కొంది.

## త్వరగా ముగింపు పలకాలి

(మొదటి పేజీ తరువాయి)

అంతటా ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరుకున్నాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారతదేశం చేసిన ప్రయత్నాన్ని స్టబ్ గట్టిగా సమర్థించారు.ప్రస్తుత భౌగోళిక రాజకీయాలను ప్రతిబింబించేలా ప్రపంచ బహుపాక్షిక వ్యవస్థ పెద్ద సంస్కరణతో పాటు ఇది చాలా ముఖ్యమైనదని వాదించారు. డిజిటలైజేషన్, స్థిరత్వంలో భారతదేశంఫిన్‌లాండ్ సంబంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యంగా రూపుదిద్దుతున్నామని ప్రధాని మోదీ తన మీడియా ప్రకటనలో తెలిపారు. 'ఇది ఆర్టిఫీషియల్ టెక్నాలజీ (ఎఐ), 6జి టెలికాం, క్లీన్ ఎనర్జీ, క్వాంటం కంప్యూటింగ్ వంటి అపూర అత్యున్నత స్థాయి సాంకేతిక పరిజ్ఞానం రంగాలలో సహకారాన్ని శక్తివంతం చేస్తుంది. రక్షణ, అంతరిక్షం, సెమీ కండక్టర్లు, ఖనిజాల వంటి కీలక రంగాలలో సహకారాన్నిమరింతగా పెంచుకోవడానికి కూడా భారతదేశంఫిన్‌లాండ్ ఇరు పక్షాలు అంగీకరించాయి. మా ఇద్దరి చర్చలలో పశ్చిమాసియా సంక్షోభం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. భారతదేశంఫిన్‌లాండ్ రెండూ చట్ట పాలన, సంభాషణ, దౌత్యాన్ని నమ్ముతాయి. కేవలం సైనిక సంఘర్షణతోనే ఏ సమస్యనూ పరిష్కరించలేమని ఇరుదేశాలూ అంగీకరిస్తున్నాయి. అది ఉక్రెయిన్ అయినా, పశ్చిమ ఆసియా అయినా వివాదాలను త్వరగా ముగించడానికి, శాంతి కోసం చేసే ప్రతీ ప్రయత్నానికీ మద్దతు ఇస్తూనే ఉంటాం' అని ప్రధాన మంత్రి మోదీ స్పష్టం చేశారు. భారత్‌యూరప్ సంబంధాల పెరుగుదల గురించి కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారతదేశంలో ఫిన్నిష్ టెలికాం దిగ్గజం నోకియా కార్యకలాపాలను కూడా ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు.నార్డిక్ ప్రాంతంలో భారతదేశానికి ఒక ముఖ్యమైన భాగస్వామియైన ఫిన్‌లాండ్‌తో కలిసి భారతదేశం ఆర్కిటిక్ ధృవ పరిశోధనలో సహకారాన్ని కూడా పెంచుతున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com